ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

14-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 344 పేజీలు: 16 వెల: 6.50


వీధికుక్కలు కరిస్తే రాష్ట్రాలదే బాధ్యత 2లో

డిజిటల్ అరెస్టుల కట్టడికి కమిటీ 5లో

సిఎం చంద్రబాబుకు ఊరట

## స్కిల్ డెవలప్‌మెంట్ కేసు మూసివేసిన ఎసిబి కోర్టు

**మొత్తం 37 మందిపై విచారణ నిలిపివేత**

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడికి భారీ ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నమోదైన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు మూసివేసింది. 37 మందిపై విచారణ నిలిపివేస్తూ, సీఐడీ తుది నివేదికను ఆమోదించింది. రూ.371 కోట్ల నిధుల దుర్వినియోగం ఆరోపణలతో నమోదైన ఈ కేసులో చంద్రబాబు 53 రోజుల పాటు జైలు జీవితం గడిపారు. ఈ కేసులో మొత్తం 37 మందిపై విచారణను నిలిపివేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు విచారణపై సీఐడీ సమర్పించిన తుది నివేదికను విజయవాడ ఏసీబీ కోర్టు ఆమోదించింది. దాని ప్రకారం చంద్రబాబు నాయుడిపై కేసును క్లోజ్ చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2014 సమయంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఆయనపై ఈ కేసునమోదైంది. ఈ కేసులో భాగంగా చంద్రబాబు నాయుడు సుమారు 53రోజుల పాటు జైలు జీవితం గడిపారు. ఈ కేసులో రూ. 371 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందని సీఐడీ ఆరోపించింది. ఈ కేసులో చంద్రబాబు ఏ37 (ఏ37) నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో చంద్రబాబును నిందితుడిగా పేర్కొంటూ, 2023 సెప్టెంబర్ 9న సీఐడీ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. దీనిపై టీడీపీ ఏసీబీ కోర్టులో, హైకోర్టులో న్యాయ పోరాటం చేసింది.ఈ కేసులో భాగంగా చంద్రబాబు నాయుడు 53రోజుల పాటు రాజ మహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నారు. హైకోర్టు బెయిల్ >>2



మంగళవారం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న సిఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేష్ దంపతులు, తదితరులు

తెలుగు సంస్కృతికి ప్రతిబింబం

## సంక్రాంతి సంబరాలు

**చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:** తెలుగింటి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలు సంక్రాంతి సంబరాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లిలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్, బ్రాహ్మణి, నందమూరి వసుంధర, తేజస్విని, భరత్ సంక్రాంతి సంబరాలను ఆసక్తిగా తిలకించారు. చంద్రబాబు నివాసం ఎదుట ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ బెలూన్ రన్ వంటి పలు క్రీడలను నిర్వహించారు. ఇందులో చంద్రబాబు, బాలకృష్ణ మనవళ్ళు సైతం పాలుపంచుకోవడం మరింత హుషారు >>2

# 'స్వర్ణ నారావారిపల్లె' ఆరంభం

నీవా బ్రాంచ్ కెనాల్ నుండి కళ్యాణి డ్యామ్‌కు నీటి తరలింపు

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో సిఎం చంద్రబాబు బిజీ

తెలుగింటి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కుటుంబం

**చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణ నారావారిపల్లె' కార్యక్రమంతో చంద్రగిరి మండలానికి మహర్దశ పడుతున్నది. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లిలో మంగళవారం ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశల అంకురాన్ని మొలకెత్తించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి తన చిరకాల స్వప్నానికి వాస్తవ రూపాన్నిస్తూ కోట్లాది రూపాయల వెల్లువతో అభివృద్ధికి పట్టం కడుతూ నీవా బ్రాంచ్ కెనాల్ నుండి కళ్యాణీ డ్యామ్‌కు నీటిని తరలించే దిశగా మూలపల్లి చెరువు, కంటిమడుగు చెరువు, వెంకట్రాయుని చెరువు, నాగపట్ల చెరువులను నీటితో నింపి ఆపై కళ్యాణీ డ్యామ్‌కు చేరుకునే విధంగా రూ.126.06 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన గావించారు. శేషాపురం వద్ద భీమవరం-రంగంపేట రోడ్డు నుండి టిటిడి అనుబంధ శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయానికి రూ.70 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. అదేవిధంగా నారావారిపల్లిలో రూ.4.27 కోట్లతో నిర్మించిన 33/11కెవి సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, రూ.1.4కోట్లతో >>2



## 'సుప్రీం'లో సునీత మరో పిటిషన్

వివేకా హత్య కేసు విచారణ 20కి వాయిదా

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులోకీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో విచారణ ఈనెల 20కి వాయిదా పడింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తుపై సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీతారెడ్డి.. సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. వివేకా హత్య కేసులో పరిమితంగా, పాక్షి కంగా సీబీఐ దర్యాప్తునకు ట్రయల్ కోర్టు అనుమతించింది. దీంతో కోర్టు తీర్పును సవాలు చేస్తూ సునీతా రెడ్డి సుప్రీంను ఆశ్రయించారు. ట్రయల్ కోర్టు పాక్షి కంగా మాత్రమే సీబీఐ దర్యాప్తు నకు అనుమతి >>2



## సంక్రాంతి స్పెషల్ విశాఖ- విజయవాడ మధ్య 12 జన్ సాధారణ్ రైళ్లు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ రద్దీ అధికంగా ఉండటంతో రైల్వే అధికారులు మరికొన్ని ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. విశాఖ-విజయవాడ మధ్య 12 జన్‌సాధారణ్ (అన్ రిజర్వుడ్) రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించారు. **ఈ స్టేషన్ల మీదుగా రాకపోకలు:** జనవరి 12, 13, 14, 16, 17, 18వ తేదీల్లో ఈ రైళ్లు సర్వీసులందించనున్నాయి. విశాఖ విజయవాడ జన్‌సాధారణ్ ఎక్స్‌ప్రెస్ (08567) రైలు నిర్ణీత తేదీల్లో విశాఖలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 4గంటలకు విజయవాడ చేరుకోనుంది. అలాగే, విజయవాడ-విశాఖ ప్రత్యేక రైలు (08568)విజయవాడలో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి రాత్రి 12.35 గంటలకు విశాఖ చేరుకోనుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, >>2

## రాష్ట్రానికి రూ.567కోట్ల గ్రాంటు విడుదల

15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో పొందిన రాష్ట్రంగా ఎపి

వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం

**విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** గత 19 నెలలుగా వైద్యారోగ్య రంగం అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం చేసిన కృషికి కేంద్రం గుర్తింపు మరోసారి లభించింది. రాష్ట్రంలో వైద్యారోగ్య రంగానికి 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన మొత్తం రూ.2,600 కోట్ల గ్రాంటును పొందటంలో రాష్ట్రం సఫలీకృతమైంది. ఇందులో భాగంగా ఐదవ మరియు ఆఖరి విడతగా రూ.567.40 కోట్ల గ్రాంటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రాష్ట్రానికి సోమవారం నాడు విడుదల చేసినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. దేశంలో ఆరోగ్య రంగానికి రాష్ట్రాల వారీగా కేటాయించబడిన 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తి స్థాయిలో సాధించిన ఘనత రాష్ట్రానికి దక్కిందని, ఇది సంతోషించదగిన



విషయమని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు తమిళనాడు, త్రిపుర రాష్ట్రాలే ఈ ఘనతను దక్కించుకున్నాయని ఆయన వివరించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు అవసరాలమేరకు భవనాల నిర్మాణం, >>2



ఇరాన్‌లో పేట్రేగిన హింసాకాండ

రెండువేలమందిపైగా మరణించారంటున్న మానవహక్కుల సంస్థలు

స్తంభించిన ప్రజా రవాణా.. చేతులెత్తేసిన భద్రతా బలగాలు

# రోడ్లన్నీ శవాల గుట్టలే!

ఖమేనీ ప్రాణాలకు ముప్పు? రష్యా వెళ్లేందుకు ఏర్పాట్లు

ఇరాన్ విడిచి వెళ్లాలని తమ పౌరులను అప్రమత్తం చేసిన అమెరికా

టెహ్రాన్‌పై దాడికి సిద్ధంగా యుఎస్

**లండన్/ వాషింగ్టన్, జనవరి 13:** ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో మొదలైన అల్లర్లు, నిరసనలు మిన్నంటాయి. ఓ వైపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వానికి అనుకూలంగా ర్యాలీలు, ఆందోళనలు మొదలయ్యాయి. రెండు వారాలుగా కొనసాగుతున్న హింసాకాండ మరింత పెరిగిపోయింది. నిరసనకారులను అదుపు చేయడంలో అటు పోలీసులు, ఇటు భద్రత బలగాలు చేతులెత్తేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరసనలు పెరిగిన నేపథ్యంలో ఇంటర్నెట్ సేవలు బంద్ అయ్యాయి. అంతేగాక విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగరాలు, పట్టణాలలో అంధకారం నెలకొంది. నిత్యావసర వస్తువులు దొరకడం లేదని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ప్రజారవాణా పూర్తిగా ఆగిపోయింది. తాజా పరిణామాలతో ఆందోళనకారులను భద్రతా బలగాలు అదుపు చేయలేకపోతున్నారు. అటు అంతర్జాతీయ మీడియాలో ఇరాన్‌లో ప్రధాన నగరాల్లోని రహదారుల్లో శవాలు గుట్టలుగా పడి ఉన్నాయంటూ ఫొటోలతో కథనాలు వెలువడ్డాయి. గత మూడు రోజుల వ్యవధిలో రెండు వేల మందికి పైగా నిరసనకారులు, ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారని మానవ హక్కుల సంస్థలు చెబుతున్నాయి. >>2



# కోళ్లా! కోట్లా?

బరుల్లోకి దూకిన పందెం కోళ్లు

కోస్తా జిల్లాలతోపాటు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ పదునెక్కిన బరులు

పొట్టేళ్ల పందాలు కూడా ఎక్కువే

కార్ల బహుమతులు ప్రకటిస్తున్న నిర్వాహకులు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో సంక్రాంతి కోడిపందాలు జోరందుకున్నాయి.సంక్రాంతి పండుగకు ఏపీలో కోడి పందాల నేపథ్యంలో రూ.వేల కోట్లు చేతులు మారుతున్నాయి. ఇది అతిశయోక్తి అన్పించినా జరుగుతున్న చరిత్ర ఇదే! పండుగా సరదా సాగే ఈ పోటీలు ఇప్పుడు జూదం తరహాలో మారాయి. కోస్తాంధ్ర, పల్నాడు,ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడి పందెల సాగిపోతున్నాయి.దీనికి తోడు బరులకు దగ్గరల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్లులో పేకాట, కాసినోలు సాగిపోతున్నాయి.పోలీసులు నామ మాత్రపు దాడులు జరిపి, చేతులు దులపుకునే పరిస్థితి.కోర్టు ఉత్తర్వుల అమలుకు రాజకీయ నాయకులే అడ్డంకి,ఆయా ఊళ్ళలో రాజకీయపక్షాల నాయకులు బరులను మీకిన్ని,మాకిన్ని అని పంచుకుని మరి పందెలు నిర్వహిస్తున్నారు.సంక్రాంతి పండుగ సందడి చూడాలంటే ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాలకు వెళ్లాల్సిందే. మూడు రోజుల పండుగకు మోడుబారిన పల్లెలు కళకళలాడుతాయి. ప్రతి ఊరు సంబురంతో నిండుతుంది.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర ప్రాంతం >>2





'బాలాజీ రిజర్వాయర్'కు

# ఏదీ మోక్షం?

**తిరుమలకు శాశ్వతనీటి కొరత పరిష్కారానికి అన్వేషణ**

**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణరోజుల్లోనూ లక్షమంది వరకు భక్తులు వస్తున్న కలియుగవైకుంఠం తిరుమలక్షేత్రానికి తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకున్న చొరవ బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం ఆగిఆగి మందకోడిగా సాగుతోంది. పూర్తిగా వర్షాభావ పరిస్థితులు ఎదురైనా శాశ్వత నీటి సమస్యపరిష్కారం కోసం దశాబ్ధకాలం క్రిందటే బాలాజీరిజర్వాయర్ ప్రతిపాదనలు రూపొందించారు. శేషాచలం అటవీప్రాంతంలో రిజర్వుఫారెస్టు అనుమతులు అవసరమయ్యాయి. ఈ అనుమతులకోసం చాలాకాలం కేంద్రప్రభుత్వం నుంచి వేచిచూడాల్సి వచ్చింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలోని పాలకమండలి బాలాజీరిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని చేపట్టింది. అయితే పూర్తిస్థాయిలో పనులు మొదలుకాలేదు. కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను3.082 టిఎంసిల నీటిసామర్థ్యంతో నిర్మిస్తే 1 టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుందని భావించారు. తిరుమలకు వచ్చే భక్తులకు, స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్‌వాసులకు, హోటళ్ళకు, వ్యాపారకేంద్రాలకు నీటి అవసరం ఉంది. ఈ దశలో ఐదు ప్రధాన జలాశయాలతోబాటు కల్యాణిడ్యామ్.తెలుగుగంగ నీటిని తిరుమలకు సరఫరా చేసుకుంటున్నారు. వీటికి అయ్యే ఖర్చుతో బాలాజీరిజర్వాయర్ నిర్మించాలని గత తెలుగుదేశం ప్రభుత్వం భావించింది. 2014లో ఉన్న టిటిడి ధర్మకర్తలమండలి కూడా బాలాజీరిజర్వాయర్ ప్రాజెక్టు >>2



## రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు..

విపక్షాల వదంతులు నమ్మొద్దు: మంత్రి పార్థసారథి

**ఏలూరు/ చాట్రాయి, జనవరి 13 ప్రభాతవార్త:** ఎరువుల కొరత ఎక్కడా లేదని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం నరసింహారావుపాలెం లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల గోడౌన్‌ను, ఎరువుల దుకాణాలను మంత్రి మంగళవారంరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లలో ఉన్న ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను మంత్రి పరిశీలించారు. అక్కడకు వచ్చిన రైతులను వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. చాట్రాయి మండలం, నరసింహారావుపాలెంలో రైతులకు అవసరాలకు సరిపడిన ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఇంకా అవసరమైతే ఎరువులను అందుబాటులోకి తీసుకువస్తామని, ఎరువుల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. కొందరు కావాలని ఎరువుల కొరత ఉందని వదంతులను సృష్టిస్తున్నారని, రైతులు వాటిని నమ్మవద్దన్నారు. రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తుందని, రైతుల సమస్యలను ముందుగానే తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు.

14-1pg2exHMNWJQE.qxd:14-1pg2exHMNWJQE.qxd 1/1/02 6:54 AM Page 1





మంగళవారం నారావారిపల్లెలో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న సిఎం చంద్రబాబు



క్రీడా పోటీలను తిలకిస్తున్న మంత్రి నారా లోకేష్ దంపతులు

# 'స్వర్ణ నారావారిపల్లె' ఆరంభం

>> నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని ప్రారంభించారు. నారావారిపల్లెలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సంజీవని ప్రాజెక్టును ప్రారంభించారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించలతపెట్టిన పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేశారు.నిరుద్యోగ యువతలో ప్రతిభ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించి రూ.1.4 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. తిరుపతి రుయా ఆసుపత్రి ఆవరణలో దివంగత కూరపాటి రామచంద్రనాయుడు, దివంగత సుశీలమ్మ జ్ఞాపకార్థం రూ.45 లక్షలతో నిర్మించిన పేషెంట్ అటెండెంట్ అమీనిటీస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలో మిల్లెట్ టిఫిన్స్, ఫుడ్ బాస్కెట్ ప్రోగ్రామ్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. అంగన్‌వాడీ చిన్నారులు ముఖ్యమంత్రిని నమస్కారం సార్ అంటూ పలకరించడంతో వారితో ఆప్యాయంగా మాట్లాడారు. ప్రైనింగ్ సెంటర్లు పిల్లలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని, పిల్లల్లో ఎదుగుదల కనిపిస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్లు ముఖ్యమంత్రికి వివరించారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని నారావారిపల్లె ప్రాంతంలో ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఎంఎల్‌ఏ పులివర్తి నాని హర్షం వ్యక్తం చేశారు.

## సంక్రాంతి సంబరాలు

>> పెంచింది. అదేవిధంగా టిటిడి కళ్యాణ మండపం వద్ద సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించారు. క్రీడలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన క్రీడాకారులను ముఖ్యమంత్రిదంపతులు అభినందించి బహుమతులను ప్రధానంచేశారు. క్రీడాకారు లందరితో ఫోటోలు దిగి వారిలో ఆనందాన్ని నింపారు. క్రీడలనువిజయవంతంగా నిర్వహించిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులకు సంక్రాంతి బహుమతులు అందజేసి అభినందించారు.

## మూసివేసిన ఎసిబి కోర్టు

>> మంజూరు చేయడంతో 2023 అక్టోబర్ 31న చంద్రబాబు జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత కూడా చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో చంద్రబాబుకు ఊరట లభించింది.

# నూతన వెలుగులతో భోగి

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

**చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:** తెలుగు ప్రజల జీవితాలలో భోగి పండుగ నూతన వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆకాంక్షించారు. సంక్రాంతి సంబరాలకు సొంతూరు నారా వారిపల్లెకు చేరుకున్న ఆయన మంగళవారం రాష్ట్ర ప్రజల నుద్దేశించి సంక్రాంతి ముగ్గులతో అలరారుతున్న తెలుగు లోగిళ్ళలో భోగి పండుగ జరుపుకుంటున్న తెలుగు ప్రజలందరికీ నా హృదయ పూర్వక శుభాకాంక్షలు అన్నారు. దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగు తీసుకురావాలని మనసారా ఆకాంక్షించారు. ఆశావాహ దృక్పథంతో సాగే మీ ఆలోచనలు సాకారం కావాలని , అందుకు మీకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. మీ జీవితం భోగ భాగ్యాలతో తులతూగాలని కోరుకుంటూ మరొక్కమారు ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలుగు ప్రజలకు డిప్యూటి సిఎం పవన్ శుభాకాంక్షలు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ వేళ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో విరాజిల్లాలి అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఆ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు."ఎక్స్" వేదిక శుభాకాంక్షలు పోస్టు చేసారు. ఈ సంక్రాంతి పండుగ వేళపల్లెలు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే సంతోషంగా ఉంది పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని పవన్ కల్యాణ్ అన్నారు.



## మాజీ సిఎం జగన్ శుభాకాంక్షలు



భోగి పండుగ అందరి కుటుంబాల్లో భోగభాగ్యాలు నింపాలి అని వైసిపి అధినేత వైఎస్.జగన్ ఆకాం క్షించారు. బుధవారం భోగి పండుగను పురస్కరించుకొని వైఎస్.జగన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా నన్నారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి.ఈ పండుగ అందరి కుటుంబాల్లో భోగభాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ శుభాకాంక్షలు అని చెప్పారు.

# రోడ్లన్నీ శవాల గుట్టలే!

>> అయితే, ఇరాన్ అధికార యంత్రాంగం మాత్రం ఐదారు వందల మంది మాత్రమే చనిపోయారని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో ఖమేనీ దేశం నుంచి పారిపోయేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇస్లామిక్ దేశాలు ఇరాన్‌కు అండగా నిలిచేందుకు విముఖత చూపుతున్నందున రష్యా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, రష్యాలో ఖమేనీ ప్రాణాలకు భద్రత ఎంత వరకు అనేది నిఘా వర్గాలు చెప్పలేకపోతున్నందున, సుప్రీం లీడర్ తర్జనభర్జన పడుతుననట్లు సమాచారం. అనివార్య పరిస్థితులు ఏర్పడితే, ప్రస్తుతానికి రష్యాకెళ్లి తల దాచుకోవడం మంచిదనే అభిప్రాయం నిఘా వర్గాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. అటు అమెరికా తమ దేశ పౌరులకు అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. తక్షణమే ఇరాన్ విడిచి వెళ్లాలని సూచించారు. మరోవైపు ఇరాన్‌పై సైనిక చర్య కోసం అమెరికా బలగాలు ఖతార్‌లోని అల్ ఉదీద్ వైమానిక స్థావరంలో తిష్ట వేశాయి. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశం కోసం ఎదురుచూస్తున్నట్లు ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఏక్షణమైనా అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడి చేసే అవకాశముందని జర్మన్ చాన్సలర్ మెర్జ్ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తాజా హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ కూడా ప్రతీకార చర్య సిద్ధమవుతోంది. తాము యుద్ధం కోరుకోవడం లేదని, అలా అని తమపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని టెహ్రాన్ ఘాటుగా స్పందించింది. అమెరికాతోపాటు, ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తామని హెచ్చరించింది.

# వడివడిగా 'ఎక్స్‌ప్రెస్‌వే' సొరంగమార్గం పనులు

## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి వైఎస్‌ఆర్ కడప జిల్లాల మధ్య సొరంగం నిర్మాణం

## 6 లేన్ల రహదారిలో భాగంగా వాహనాలు వచ్చేందుకు, వెళ్లేందుకు వేర్వేరుగా 2 సొరంగ మార్గాలు



**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నుంచి బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలో భారతమాల పరియోజన 2వ దశలో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి వైఎస్‌ఆర్ కడప జిల్లాల మధ్య జరుగుతున్న సొరంగమార్గం నిర్మాణ పనులు ఏర్పాటు వేగంగా ముందుకుసాగుతున్నాయి. 518 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న విజయవాడ నుంచి బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ సొరంగ మార్గం సీతారామపురం సమీపంలో ప్రారంభమై కడప జిల్లాలో తెరుచుకోనుంది. జిల్లాలో రహదారి 16 కిలోమీటర్ల నిర్మితం అవుతుండగా అందులో భాగంగానే సీతారామపురం సమీపంలో కొండకు ట్యూబ్ టన్నెళ్లు సైతం నిర్మిస్తున్నారు. 6 లేన్ల రహదారిలో భాగంగా వాహనాలు వచ్చేందుకు, వెళ్లేందుకు వేర్వేరుగా 2 సొరంగ మార్గాలను కూడా నిర్మిస్తున్నారు. ఒక్కో సొరంగం 16.7 మీటర్ల వెడల్పు, 9.8 మీటర్ల ఎత్తులో 3.68 కి.మీ. పొడవున ఉండనున్నాయి. ఈ రహదారి అందుబాటులోకి వస్తే గనక విజయవాడబెంగళూరు మధ్య దూరంతో పాటు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ఈ ప్రాజెక్టు సీతారామపురం మీదుగా వెళ్లే 167 బీజీ, 167బీ నేషనల్ హైవేలతో అనుసంధానించి ఉండగా జిల్లాతో పాటు కడప, ప్రకాశం జిల్లాల వాసులు కూడా సజావుగా ప్రయాణాలు సాగించే అవకాశం ఉంది. శ్రీ సత్యసాయి జిల్లాలోని కోడికొండ వద్ద జాతీయ రహదారి 44 నుంచి మొదలై వైఎస్సార్ కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం వద్ద జాతీయ రహదారి 16లో కలుస్తోంది.

# రాష్ట్ర ఎక్సైజ్ పాలసీలో పలు మార్పులు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఎక్సైజ్ పాలసీలోరాష్ట్ర ప్రభుత్వం పలు ముఖ్యమైన మార్పులు చేసింది. బార్ల వ్యాపారులకు ఊరటనిచ్చేలా బార్లపై విధించిన అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్ఈటీ)ను పూర్తిగా రద్దు చేసింది. 2019 నవంబర్ నుంచి బార్లపై ఉన్న ప్రత్యేక తిళినిగిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది సర్కార్. ఈ మేరకు మంగళవారం.. ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా.. జీఓ ఎంఎస్ నంబర్ 24ను జారీ చేశారు. ఈ మార్పులను అనుసరించి ఇకపై రిటైల్ షాపులు, బార్ల మధ్య ఒకే మద్యానికి రెండు ధరలు ఉండవు. ధరల్లో సమానత్వం పునరుద్ధరణ. ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి బార్లకు సరఫరా చేసే ఐఎంఎఫ్ఎల్(।లీసీలి), ఎఫ్ఎల్(సీలి)పై అదనపు పన్ను విధింపు ఉండకూడదని ఆదేశం. **ఎక్సైజ్ చట్టాల ప్రకారం కొత్త నోటిఫికేషన్ జారీ:** 2025 బార్ లైసెన్స్ నిబంధనల్లో సవరణలు చేస్తూ నిర్ణయం. ఈ నిర్ణయం బార్ల వ్యాపారులకు పెద్ద ఊరటగా మారనుంది. ఇలాంటి మార్పులతో బార్ల వ్యాపారులకు గణనీయంగా ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. డైరెక్టర్ ఆఫ్ ఎక్సైజ్, డిస్టిలరీస్ కమిషనర్, అధికారులు ఈ మార్పుల అమలుకు బాధ్యత వహించనున్నారు. ఈఉత్తర్వులు నేటి నుంచి(2026 జనవరి 13) నుంచి అమలులోకి వస్తాయి. గతంలో బార్లకు రిటైల్ షాపుల కంటే ఎక్కువ ధరకు మద్యం సరఫరా అవుతుండటం వల్ల వ్యాపారంలో ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితితలెత్తేది. ఇప్పుడు ధరల సమానత్వంతో బార్లకు ఊరట లభించిందనుకోవచ్చు

# 'బాలాజీ రిజర్వాయర్'కు ఏదీ మోక్షం?

>> ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు మొదలుపెట్టారు. 2018నాటికి ఈ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అటు ప్రభుత్వం ఇటు టిటిడి యాజమాన్యం భావించినా ఇప్పటికీ పనులు ఆగిపోయాయి. ఈ పనులు ఏ కారణంతో ఆగాయనేది అధికారవర్గాలు సమాచారం ఇవ్వలేకపోతున్నా రిజర్వాయర్‌కు అడుగడుగునా అడ్డంకులు తగిలి ఎండమావిగానే మిగిలిపోయే పరిస్థితి నెలకొంది. 2015లోనూ వర్షాభావ పరిస్థితులు ఎదురై తిరుమలలో నీటి ఎద్దడి ఎదుర్కొన్నారు.

**పుష్కలంగా జలాశయాలు నిండితే ఊసే ఉండదు:** తిరుమలకు తాగునీటికోసం ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార,పసుపుధారతీర్థాలు ఉన్నాయి. ఈ డ్యామ్‌లన్నీ పూర్తిగా నిండితే ఏడాదిపాటు నీటికొరత ఉండదు.గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో ఐదు జలాశయాల్లోకి చేరిన వరదనీటితో ఆరునెలల వరకు సమస్య లేదు. మళ్ళీ వర్షాలు పడితే నీటిసమస్య తలెత్తదు. లేకుంటే మళ్ళీ రానున్న వేసవిలో మార్చి,ఏప్రిల్,మేనెలల్లో పెద్దసంఖ్యలో తిరుమలకు భక్తులు వస్తారు. ఆ సమయంలో తాగునీటి ఎదురయ్యే అవకాశం ఉంటుంది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో 14,304లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం వున్నాయి. దేశవిదేశాల నుంచి వస్తున్న భక్తుల తాగునీటి అవసరాలకు వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటిసమస్య తలెత్తకుండా శాశ్వత సమస్య పరిష్కారానికి అటు రాష్ట్రప్రభుత్వ నీటిపారుదలశాఖ, ఇటు టిటిడి అధికారులు ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తిరుపతికి సమీపంలోని రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం వద్ద బాలాజీరిజర్వాయర్‌నుచేపట్టాలని ప్రతిపాదనలు ,ఆలోచన వచ్చింది. 2014-19 సంవత్సరంలో గత తెలుగుదేశం ప్రభుత్వంలోని పాలకమండలి బాలాజీరిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని చేపట్టింది. అయితే అప్పట్లోనే పూర్తిస్థాయిలో పనులు మొదలుకాలేదు. కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను3.082 టిఎంసిల నీటిసామర్థ్యంతో నిర్మిస్తే 1 టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే అవకాశం ఉంటుందనేది అంచనా. వేసవికి ముందే బాలాజీ రిజర్వాయర్‌కు మోక్షం కల్పించాలనేది తిరుమలవాసుల కోరిక.

# కోళ్లా! కోట్లా?

>> కోలాహలంగా ఉంటుంది. పండుగకు రెండు వారాల ముందు నుంచే సందడి నెలకొనగా ఇక పండుగ మూడు రోజులు అంబరాన్నంటేలా ఒక జాతర మాదిరి ప్రతి ఊరు ఉంటుంది. మహిళలు రంగవల్లులు, పిండివంటలు, ఆటాపాటలతో సందడి చేస్తుంటారు. ఇలా ఎటు చూసినా సంక్రాంతి పండుగతో ఆంధ్రప్రదేశ్ కు ప్రాణం తీసుకువస్తుంది. ఈ పండుగతో ఏపీ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి అందుతుంది. కోడి పందెలు భయంకరమైన వ్యసనం కోళ్ళు బరిలోకి దిగగానే పందెం రాయుళ్లంతా ఇహం మరచి,.పందెం కాస్తారు. ఆస్తులు పోతున్నా లెక్కలు చేయరు. ఈ పందాలు కూడా వేల నుంచి మొదలై.. లక్షల దాకా వెళ్లిపోతుంది. పందెంలో ఓడితే పోయేది కోడి మాత్రమే కాదు.. పరువు కూడా! అందుకోసమే.. పుంజుని బరిలో దించాక పందెంరాయుళ్ల వెనకా ముందు ఏమీ చూసుకోరు. డబ్బులు తీస్తూనే ఉంటారు. అవసరమైతే ఆస్తి పత్రాలు కూడా పందెంలో పెట్టేస్తారు. అందుకోసమే.. ఇన్ని వేల కోట్లు చేతులు మారతాయి. ఇదంతా.. భారీ మొత్తాల్లో ఉండే వ్యవహారం కావడంతో.. ఆన్ లైన్ పేమెంట్లు కూడా అదే స్థాయిలో జరుగుతాయి. పండగ అయిపోయిన తర్వాత కానీ తెలియదు.. ఎంత వచ్చింది? ఎంత పోయింది? అనేది! సంక్రాంతి అయిపోయిన 3 రోజుల తర్వాత దిగుతుంది కోళ్ల పందాల మత్తు పందెం గాళ్ళకు,మిగిలిందో మోదం,లేదో ఖేదం. ఈ పండుగకు అన్నీ కలిపి రూ.3 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పవచ్చు. ఆంధ్రాలో సంక్రాంతి కోడి పందాల్లో పాల్గొనడం.. అంత చిన్న విషయం ఏమీ కాదు. జేబులో వందో వెయ్యో పెట్టుకొని వెళితే.. అక్కడ పందెం కోడి కాదు కదా.. పందాలు చూస్తూ తినేందుకు చికెన్ పకోడీ కూడా రాదు. ఒక్కో కోడి పందెం 5 వేల నుంచి మొదలై.. 5 లక్షలు, 10 లక్షల దాకా ఉంటుంది. కేవలం.. ఆంధ్రా వాళ్లే కాదు.. హైదరాబాద్, చెన్నై నుంచి కూడా పందెం రాయుళ్ల డబ్బు సంచులతో వచ్చి మరీ బరుల్లో తొడగొడతారు.

**విజయవాడ పరిసర ప్రాంతాల్లో రాజధానికి సమీపంలో కోడి పందేలు, పొట్టేళ్ల పందేల కోసం బరులు:** గోదావరి జిల్లాల తరహాలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ కోడి పందేల బరులు సిద్ధమవుతున్నాయి. విజయవాడ పరిసర ప్రాంతాల్లో రాజధానికి సమీపంలో కోడి పందేలు, పొట్టేళ్ల పందేల కోసం బరులను భారీగా సిద్ధం చేస్తున్నారు. ఒకేసారి నాలుగైదు వేల మంది కూర్చునేలా భారీగా వేదికలు సిద్ధమవుతున్నాయి. ప్రేక్షకులు, అతిథులకు ప్రత్యేకంగా టోకెన్లు జారీ చేస్తున్న నిర్వాహకులు అవి ఉన్నవారినే లోపలికి అనుమతిస్తారు. వారికి భోజనాలు, శీతల పానీయాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. మహిళలు, చిన్నారులను ఆకర్షించేలా ముగ్గుల పోటీలు, జెయింట్ వీల్‌తో ఎగ్జిబిషన్లు, ఫుడ్ స్టాళ్లను నిర్వహిస్తున్నారు. క్రీడా మైదానంలా కుర్చీలతో గ్యాలరీలను తీర్చిదిద్దుతున్నారు. కోడి పందేలను జూదంలా కాకుండా పండుగ వినోదంలా, సంప్రదాయబద్ధంగా జరుపుతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. గోదావరి, కృష్ణా జిల్లాల్లో సంక్రాంతి సంబరాలు, కోడి పందేలను చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచీ పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్తున్నారు. ఒక వైపు భారీ హంగులతో బరులను సిద్ధం చేసున్నా, సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణ నేపథ్యంలో జంతుహింస నిరోధక చట్టం1960, ఏపీ జూద నిరోధక చట్టాలను కఠినంగా అమలుచేయాలని ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఏపీ హైకోర్టు అదేశించింది. ముఖ్యంగా తూర్పు, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

# మరో పిటిషన్

>> ఇద్దరి పాత్రలపై మాత్రమే విచారణ జరపాలని ఆదేశించడం వంటి అంశాలను.. సునీత తన పిటిషన్ లో పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రయల్ కోర్టు విచారణ జరపలేదని, తాము లేవనెత్తిన అంశాలకు విరుద్ధంగా పాక్షి క ఆదేశాలు ఇచ్చారని సునీత పిటిషన్‌లో పేర్కొ న్నారు. గతంలో సీబీఐ విచారణ కొనసాగించే అంశంపై మూడు నెలల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టుకు సుప్రీం ధర్మా సనం ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను పాటిం చకుండా ట్రయల్ కోర్టు పాక్షి క ఆదేశాలు ఇవ్వడం సరికాదని సునీత తరఫు న్యాయవాది సుప్రీం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సునీత దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు విచారణ జరిపి, తదుపరి విచారణను వచ్చే ఈ నెల 20

# సంక్రాంతి స్పెషల్

>> తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

# రాష్ట్రానికి రూ.567 కోట్ల గ్రాంటు విడుదల

>> డయాగ్నోస్టిక్ సేవలను మెరు గుపర్చడానికి, బ్లాక్ లెవల్ పబ్లిక్ హెల్త్ లేబరెటరీల ఏర్పాటుకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగిస్తారు.

**2025-26 బడ్జెట్ సమీక్ష:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2025-26) వైద్యారోగ్య శాఖకు కేటాయించబడిన నిధులు, మొదటి 3 త్రైమాసికాల్లో ( ఏప్రిల్ డిసెంబర్ 2025) జరిగిన ఖర్చులకు సంబంధించి మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం సాయంత్రం లోతుగా సమీక్షి ంచారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వివిధ పథకాల కింద కేంద్ర సాయాన్ని పూర్తిస్థాయిలో సాధించడానికి ఆఖరి త్రైమాసికంలో గట్టి కృషి చేయాలని, కేంద్ర నిధులు పొందడంలో ఏమేరకు విఫలమైనా సంబంధిత అధికారులను బాధ్యుల్ని చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా వివిధ పథకాల కింద రావాల్సిన కేంద్ర సాయం, ఇప్పటి వరకు జరిగిన వ్యయం, ఆఖరి త్రైమాసికంలో రావాల్సి ఉన్న కేంద్ర నిధుల గురించిన సమగ్ర సమాచారంతో త్వరలో మరోసారి సమీక్షి స్తానని మంత్రి స్పష్టం చేశారు. **ఫలించిన వైద్యారోగ్య శాఖ కృషి..** సోమవారంనాటి సమీక్ష సందర్భంగా 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మంత్రిత్వ శాఖకు లభించిన నిధులు, ఇంకా రావాల్సిన నిధుల గురించి, ఇప్పటి వరకు వచ్చిన నిధుల వినియోగం గురించి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. వైద్యారోగ్య శాఖకు 2021-22 నుండి 2025-26 వరకు మొత్తం రూ. 2,600 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉండగా సోమవారం నాటికి ఇంకా రూ.567.40 కోట్లు విడుదల కావాల్సి ఉందని అధికారులు తెలిపారు. నిధుల విడుదలలో జాప్యాన్ని గురించి ఆరా తీసి చివరి విడత నిధుల తక్షణ విడుదల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో చర్చించాలని సీనియర్ అధికారులను మంత్రి ఆదేశించారు. సోమవారం వరకు రూ. 2,033 కోట్ల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని, అందులో రూ.1,896 కోట్ల మేరకు వ్యయం జరిగిందని అధికారులు తెలిపారు. మొత్తం విడుదలైన నిధుల్లో రూ. 1,108 కోట్లు(43 శాతం) 19 నెలల కూటమి ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని, గత ప్రభుత్వ హయాంలో 57 శాతం మాత్రమే వచ్చాయని అధికారులు వివరించారు. అదే రీతిన ఇప్పటి వరకు జరిగిన రూ.1,896 కోట్ల ఖర్చులో రూ. 902 కోట్లు (48 శాతం) కూటమి ప్రభుత్వ హయాంలోనే జరిగిందని అధికారులు తెలిపారు. తగు ప్రతిపాదనలతో నిధులు సాధించడంలోనూ, వాటి వినియోగంలోనూ వైద్యారోగ్య శాఖ మంచి పనితీరు కనపరిచినందున మిగిలిన నిధుల విడుదల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో తక్షణమే చర్చించాల్సిన అవసరాన్ని మంత్రి తెలిపారు. యాదృచ్ఛికంగా మంత్రి నిర్వహించిన బడ్జెట్ సమీక్షా సమావేశం సోమవారం నాడు సాయంత్రం 6 గంటలకు ముగియగా అనంతరం అర గంటలో 15వ ఆర్థిక సంఘం ఆఖరి విడత నిధులను కేంద్రం రాష్ట్రానికి విడుదల చేసినట్లు సమాచారం లభించడంతో మంత్రి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# వీధికుక్కలు కరిస్తే రాష్ట్రాలదే బాధ్యత

## పరిహారం చెల్లించాల్సిందే: సుప్రీంకోర్టు స్పష్టీకరణ

## జంతు ప్రేమికులపైనా త్రిసభ్య ధర్మాసనం ఆగ్రహం

**న్యూఢిల్లీ, జనవరి 13:** దేశవ్యాప్తంగా పెరుగుతున్న వీధి కుక్కల దాడి, మరణాలపై మరోసారి సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు, వృద్ధులపై దాడి జరిగితే అందుకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని తేల్చి చెప్పింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. అలాగే జంతు ప్రేమికులపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. జంతువులపై ఉన్న ప్రేమ, మనుషులపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించింది. వీధి కుక్కల దాడిలో ఒక పిల్లవాడు చనిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీసింది. ఒక వేళ కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దీనికి బాధ్యులని, అలాంటి వారు వాటిని తమ ఇళ్లకే తీసుకెళ్లాలని సూచించింది. విద్యాసంస్థలు, ఆసుపత్రుల వంటి చోట్ల నుంచి కుక్కలను తొలగించాలని ఆదేశించింది.వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు రోజువారీ విచారణ కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం నాటి విచారణలో కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారులు లేదా వృద్ధులపై కుక్కలు దాడి చేసి గాయపరిచినా లేదా ప్రాణాలు తీసినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, అందుకు నష్టపరిహారం చెల్లించాలని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. అంతేకాదు, కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా బాధ్యులని, వాళ్లు తమ ఇళ్లకే తీసుకెళ్లాలని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ అన్నారు. కుక్కల సమస్య ఒక భావోద్వేగమైన విషయమని లాయర్ మేనకా గురుస్వామి చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం స్పందిస్తూ "ఇప్పటివరకు భావోద్వేగాలు కుక్కలకే ఉన్నట్లున్నాయి" అని వ్యాఖ్యానించింది. అయితే, తాను కూడా మనుషుల గురించే ఆలోచిస్తున్నానని ఆమె బదులిచ్చారు. కుక్క కాటు ఘటనలు, మరణాలు సంభవిస్తే డాగ్ ఫీడర్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. డాగ్ ఫీడర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరిస్తూ, ఇది లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన అంశమని పేర్కొంది. బాధితులు అవసరమైతే హైకోర్టులను ఆశ్రయించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించింది. కోర్టు ఉత్తర్వులు ఎవరి పట్లనూ వేధింపులకు లైసెన్స్ కాదని కూడా స్పష్టం చేసింది. ప్రభుత్వాల వైఫల్యం వల్లే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎబిసి నిబంధనలను తీవ్రంగా అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది.

# ఉద్యోగుల డిఎ, కాంట్రాక్టర్ల బిల్లులకు రూ.2653 కోట్ల నిధులు విడుదల

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏ, డీఆర్ ఎరియర్స్, కాంట్రాక్టర్ల బిల్లులకు మొత్తంగా రూ.2653 కోట్ల నిధులు విడుదల చేసింది.దీని ద్వారా మొత్తంగా 5.70 లక్షల మందికి ప్రయోజనం కల్పించింది.

అంతేకాకుండా పెండింగులో ఉన్న ఒక డీఏ, డీఆర్ ఎరియర్స్ నిమిత్తం రూ.1100 కోట్లను సైతం విడుదల చేశారు. పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవుల్లో రూ.110 కోట్లు మంజూరు చేశారు.

**నీరుచెట్టు బిల్లులకు రూ.40 కోట్లు :** ఈఏపీ, నాబార్డు, సాస్కి, సీఆర్ఐఎఫ్ పనుల నిమిత్తం రూ.1243 కోట్లను విడుదల చేశారు.

ఇందులోనే నీరుచెట్టు బిల్లులకు గాను ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లను విడుదల చేసింది. నీరుచెట్టు సహా వివిధ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చేపట్టడంతో దాదాపు 19,000 పైగా కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది. మొత్తంగా 5.70 లక్షల మందికి సంక్రాంతి సందర్భంగా కూటమి ప్రభుత్వం బిల్లులు, బకాయిలు చెల్లింపులు జరపడం విశేషం.

## వారం - వర్జ్యం

14-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,ఉత్తరాషాఢ కార్తె
ఏకాదశి సా.5.52
అనూరాధ రా.3.03
వర్జ్యం : ఉ.9.17-11.04
దు.ఉ.11.55-12.40
శుభసమయం: ఉ.9.45-10.45, సా.5.30-6.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు.

**వృషభం:** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం ఇస్తుంది. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి.

**కర్కాటకం :** బాధ్యతాయుతంగా వుంటారు. నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు.సోదరుల కలయిక.

**సింహం:** దూరప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**తుల :** వ్రాతపూర్వక ఒప్పందాలను అనుకున్న విధంగా చేసుకోగలుగుతారు. ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృశ్చికం:** వివాహాది శుభకార్యాలు సానుకూలపడతాయి. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనుస్సు:** ఒకే సమయంలో అనేకమైన పనులు చక్కబెట్టుకోవలసి వస్తుంది. పని విభజనను చేస్తారు.

**మకరం:** సన్నిహిత వర్గం అందుబాటులో ఉండటం వలన పెద్దగా ఇబ్బంది పడరు. దాంభికానికి, దర్పానికి ప్రాముఖ్యత నిస్తారు.

**కుంభం:** గతంలో పొదుపుచేసిన ధనాన్ని ఈ రోజు ఒక శుభకార్య నిమిత్తం ఖర్చు చేస్తారు. పోటీ పరీక్షలలో విజయం.

**మీనం :** నూతన ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. మీ పరపతిని పెంచుకోవడానికి చేసే యత్నాలు ఫలించవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## సార్లంకపల్లె అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.25 వేల ఆర్థిక సాయం

### సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులందరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఏపీ చంద్రబాబు స్పష్టం చేసారు. అగ్ని ప్రమాదంలో ఇళ్ళు కాలిపోయి, నిరాశ్రయులైన బాధితులకు తక్షణం ప్రత్యా మ్నాయం కల్పిస్తామన్నారు. వారికి శాశ్వత గృహాలు నిర్మించి ఇచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సిఎం మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో ఈ అగ్నిప్రమాదం విషాదాన్ని తెచ్చిందన్నారు. గ్రామంలో ఉన్న 38 తాటాకు ఇళ్లు కాలిపోయాయని.. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని హోం మంత్రి అనిత, ఇతర అధికారులు ఆయనకు వివరించారు. తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల నగదు అందజేస్తున్నామని ప్రకటించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అప్పటివరకు వారికి అవసరమైన వసతి, ఇతర సహాయం అందించాలన్నారు. ప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అందే సాయంపై మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిం చాలని సూచించారు.

# ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఏపి

### ఆత్రేయపురంలో జరిగిన సంక్రాంతి సంబరాలలో మంత్రి కందుల దుర్గేష్

### కోనసీమలో వైభవంగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు.

### పడవ పందేల ద్వారా విశ్వవ్యాప్తమైన ఆత్రేయపురం పేరు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 13 (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పర్యాటక రంగానికి పూర్వవైభవం వచ్చిందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు 2026" మరియు బోట్ ఫెస్టివల్ ను మంత్రులు వంగలపూడి అనిత కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. ఆత్రేయపురం గుర్తింపు దేశవ్యాప్తంగా కోనసీమ గొప్పతనాన్ని చాటిచెప్పేలా పడవ పందాలను నిర్వహించడం అభినందనీయం. ఆత్రేయపురం పేరును విశ్వవ్యాప్తం చేయాలన్న ఎమ్మెల్యే సత్యానందరావు కృషిని ప్రతి ఒక్కరూ అభినందించాలని మంత్రి దుర్గేష్ అన్నారు. గత ఐదేళ్లలో కుదేలైన పర్యాటక రంగాన్ని పునరుద్ధరిస్తున్నాం. ఒకప్పుడు పర్యాటకం అంటే కేరళ, రాజస్థాన్ గుర్తొచ్చేవి, కానీ నేడు ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి చిరునామాగా మారిందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందని అన్నారు. పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ..పారిశ్రామిక హోదా.... కల్పించారని, దీనివల్ల పరిశ్రమలకు అందే రాయితీలు పర్యాటక ఇన్వెస్టర్లకు కూడా అందుతున్నాయని తెలిపారు. 202429 ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రముఖ స్టార్ హోటళ్లు, రిసార్టులు రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, అడ్వెంచర్, క్యారావాన్ టూరిజం వంటి విభిన్న పాలసీలతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## రాయచోటికి జరిగిన అన్యాయాన్ని పునర్విభజనలో సరిదిద్దుకుందాం: మంత్రి మండిపల్లి

**రాయచోటి జనవరి 13 ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లా రాయచోటికి జరిగిన అన్యాయాన్ని పునర్విభజనలో సరిదిద్దుకుందాం అని రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారని రాయచోటి జిల్లా సాధన జేఏసీ నాయకులు వార్తకు తెలిపారు. వివరాల లోకి వెళితే : ..మండిపల్లి ని కలిసిన రాయచోటి జిల్లా సాధన జేఏసీ జేఏసీ డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా నని ఆయన జేఏసీ కి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. జేఏసీ నాయకులు మంత్రి మండి పల్లి క్యాంప్ ఆఫీసులో కలిసి 14 మండలాల కేంద్రంగా ఉన్న రాయచోటిని ప్రత్యేక జిల్లా చేయడానికి కృషి చేయాలని రాయచోటి ప్రత్యేక జిల్లా చిత్రపటం తో కలిపి వినతి పత్రం అందజేశారు. 3 లక్షల 49 వేల జనాభాతో పోలవరం, 6 లక్షల 4వేలతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అదేవిధంగా రాయచోటి కేంద్రంగా ఉన్న 14 మండలాలలో 8 లక్షల పైబడి జనాభా ఉన్న రాయచోటిని ప్రత్యేకంగా గుర్తించి జిల్లా చేయడానికి కృషి చేయాలని మంత్రిని జేఏసీ నాయకులు కోరారు. దీనికి స్పందించిన మండి పల్లి అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరు ను తిరుపతిలోనూ రాజంపేట ని కడప లోను మదనపల్లి ను ప్రత్యేక జిల్లా చేయడం వలన భౌగోళికంగా రాయచోటి ఏకాకి అయిందని ఈ పరిస్థితుల దృష్ట్యా రాయచోటిని మదనపల్లిలో కలిపే పరిస్థితి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోయే సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రాయచోటికి జరిగిన అన్యాయాన్ని పూర్తిగా చర్చించి రాయచోటికి ప్రత్యేక గుర్తింపు తెచ్చు కుందామని జేఏసీ నాయకులతో అన్నట్లు వారు తెలిపారు . జేఏసీ వారు ఇచ్చిన 14 మండలాల రాయచోటి ప్రత్యేక జిల్లా చిత్రపటాన్ని తాను పూర్తిగా పరిశీలించానని ఈ విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జేఏసీ నాయకులతో ఆయన అన్నారు. మంత్రిగారిని కలిసిన వారిలో జిల్లా సాధన జేఏసీ అధ్యక్షులు టి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు జేఏసీ నాయకులు,జీవానందం గిరి బాబు యాదవ్, వీరబల్లి శ్రీనివాసులు రమేష్, చంద్రశేఖర్, మారుతి శంకర్, పల్లం తాతయ్య , శివ కుమార్, ఉత్తేజ్ కుమార్, మల్లి కార్జున శ్రీనివాస రాజు, నాగరాజు శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, రాయచోటి చెన్న కృష్ణ, నూరుల్లా జనసేన నాయకులు వినయ్ తుల పాల్గొన్నారు.

## వైభవంగా గోదాదేవి - శ్రీరంగనాథ స్వామి కల్యాణం

**జగ్గయ్యపేట, జనవరి 13, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో అంగరంగ వైభవంగా గోదాదేవి-శ్రీరంగనాథ స్వామి వారి కళ్యాణ వేడుక జరిగింది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర నివాసంలో పూర్తిగా సంప్రదాయ సిద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈవేడుకలో పాల్గొన్న మహిళలంతా సంప్రదాయ దుస్తులతో అలరించారు. స్థానిక ఎంఎల్ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), యువనేత శ్రీరాం ధనుంజయ, పలువురు కౌన్సిలర్లు, ప్రముఖులు ఈవేడుకలో పాల్గొన్నారు. శ్రీభగవద్రామానుజగోష్టి ప్రతినిధుల ఆధ్వర్యంలో జెఆర్‌సి విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు-రుక్మిణి దంపతులు అత్యంత నియమ నిష్టలతో అమ్మవారు స్వామివార్ల కళ్యాణం సోమవారం రాత్రి పొద్దుపోయేవరకు కమనీయంగా నిర్వహించారు. కాగా పట్టణానికి చెందిన గృహిణి మామిడి హర్షిత ధనుర్మాసం పురస్కరించుకుని ముగ్గులతో గోదాదేవి అమ్మవారి కళ్యాణ ఘట్టాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించింది. ప్రకృతిలో లభించే సహజ రంగులను ఉపయోగించి లిఖించిన ఈ రంగవల్లి సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేసింది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కుటుంబ సభ్యురాలైన హర్షిత గత సంవత్సరం జనవరిలో ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రపంచస్థాయి ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో పాల్గొని పలు రంగుల సమ్మేళనంతో శ్రీనివాసుని కళ్యాణ ఘట్టాన్ని పరమాద్భుతంగా ఆవిష్కరించి ప్రధమ బహుమతి రూ.15 లక్షల బహుమతిని గెలుచుకున్నారు. హర్షిత మూడు రోజులపాటు శ్రమించి లిఖించిన ఈ చిత్రం రంగవల్లిలా అనిపించలేదని, ఒక కళాఖండాన్ని తివాచీపై ముద్రించిన రీతిలో చూడగానే భావన కలుగుతోందని పలువురు సందర్శకులు అభిప్రాయం వ్యక్తంచేస్తూ హర్షితను అభినందించారు.



**గోదాదేవి అమ్మవారి రంగవల్లి. (రంగులతో లిఖించిన మామిడి హర్షిత). గోదాదేవి, శ్రీరంగనాథ స్వామి వారి కళ్యాణ వేడుకలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర**

## తెలుగు ప్రజలకు మంత్రి సుభాష్ సంక్రాంతి శుభాకాంక్షలు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్న తెలుగుజాతి ప్రజలందరికీ రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మహా సంక్రాంతి పర్వదినాన ప్రజలందరి మనోవాంఛలు నెరవేరాలని, వారి కుటుంబాల్లో భోగ భాగ్యాలు, సిరి సంపదలు, ఎల్లలు లేని ఆనందం నింపాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నానని అన్నారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని, ఈ పండుగ శుభవేళ రాష్ట్ర ప్రజలందరు, రామచంద్రపురం నియోజ వర్గంలోని ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలుతో నిండి పోవాలని కోరుకుంటున్నానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మంత్రి సుభాష్ గారు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

## అమరావతిలో పలు ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ జరుగుతోంది :మంత్రి నారాయణ

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో పలు ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ జరుగుతోందని ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. అమరావతి మండలంలోని 3 గ్రామాల్లో మొదటి రోజే 1000 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. అంటే మూడు గ్రామాల్లో 25 శాతం ల్యాండ్ పూలింగ్ పూర్తైందని చెప్పుకొచ్చారు. అమరావతి మండలం కర్లపూడిలో మంగళవారం రోడ్డు పనులకు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. నిన్న ల్యాండ్ పూలింగ్ ప్రారంభానికి వెళ్లిన మంత్రిని రోడ్డు వేయాలని రైతులు కోరారు. రైతులు అడిగిన వెంటనే రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించి.. కాంట్రాక్ట్ సంస్థకు పనులు అప్పగించారు. కర్లపూడి నుంచి అనంతవరం వరకు.. 2.9 కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

## ఏప్రిల్ ఆఖరుకల్లా 98 ఎఐ ఆధారిత యూస్ కేసెస్ సిద్ధం : ఐటి ఆర్టీజి శాఖల కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వంలోని ప్రతి శాఖ ప్రజలకు అందించే అన్ని సేవలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనూ, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లోనే అందించాలని ఐటీ, ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలనేది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. దానికి అనుగుణంగా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అయితే ఇప్పటికీ కొన్ని శాఖలు మాన్యువల్‌గా సేవలందిస్తున్నాయని, ఇకపైన ప్రజలకు ప్రభుత్వ శాఖలు అందించే సేవలన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారా, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మాత్రమే అందించాలని కోరారు. ఈ దిశగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగిత పెరిగేలా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. డేటా అనుసంధానం ప్రక్రియ పూర్తైందని, దీనిద్వారా ఆయా శాఖలకు ఉపయోగపడేలా యూస్ కేసెస్ సిద్ధం చేస్తున్నామని ఏప్రిల్ నెలాఖరుకు ఈ యూస్ కేసెస్ అందుబాటులోకి తెస్తామన్నారు. అవేర్ వల్ల బహుళ ప్రయోజనాలు రియల్ టైములో వాతావరణం గురించి తెలుసుకోవడమే కాకుండా బహుళ ప్రయోజనాలుండేలా ఆర్టీజీఎస్ అవేర్ విభాగం పనిచేస్తోందని తెలిపారు. అవేర్‌ను అన్ని శాఖలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. అవేర్ ద్వారా విస్తృత ప్రయోజనాలు కలిగేలా 50 వరకు యూస్ కేసెస్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏ శాఖ అయినా ఈ విభాగాన్ని తమ అవసరాలకు తగ్గట్టు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారితంగా ఉపయోగపడే 98 యూస్ కేసెస్‌ను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా శాఖలు తాము మరింత సులభంగా సరళతరంగా సేవలించడానికి వీలుగా ఎలాంటి యూస్ కేసెస్ కావాలని కోరుకుంటున్నారో తమకు తెలియజేయాలని ఇప్పటికే కోరామని, ఆయా శాఖలు ఆ దిశగా తమ అవసరాలను తెలియజేస్తే ఇప్పుడు సిద్ధం చేస్తున్న యూస్ కేసెస్‌తో పాటు శాఖలు కోరిన విధంగా కూడా యూస్ కేసెస్ సిద్ధం చేసి ఇస్తామని తెలిపారు.

# ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం ఎన్‌డిఎ కూటమి

### - దేవాదాయ మంత్రి ఆనం - ఎంపి వేమిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జనవరి 13, ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండలంలోని మదారాబాద్, కావలి యడవల్లి గ్రామంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన విపిఆర్ అమృతధార మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి ఆనం, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మదారాబాద్‌లో జలజీవన్ మిషన్ కింద 22లక్షలతో చేపట్టిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు.

మదారాబాదు గ్రామంలో నేతలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా పల్లె పండుగ ర్యాలిని నిర్వహించి ఘనస్వాగతం పలికారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా వాటిని అధిగమిస్తూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. సంగం-కలిగిరి రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర రహదారుల శాఖామంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి అనుమతి ఉత్తర్వులిచ్చారన్నారని ఇది చాలా సంతోషకరమైన విషయమన్నారు. త్వరలోనే మంత్రుల సమక్షంలో వైభవంగా భూమిపూజ కార్యక్రమాన్ని నర్విహిస్తామన్నారు. తమ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాలకు సరికొత్త సంక్రాంతి శోభను తీసుకొచ్చిందని మంత్రి ఆనం పేర్కొన్నారు. ఈగ్రామంలోని ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, కళ్యాణ మండపం నిర్మాణానికి కూడా ప్రభుత్వం ద్వారానే నిధులు మంజూరు చేస్తామని ఆనం స్పష్టం చేశారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అన్ని విధాల మేలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసేందుకు విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. విపిఆర్ నేత్ర కార్యక్రమం ద్వారా ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు, సీతారామపురం, ఉదయగిరిలో 15వేల మందికి కంటి పరిక్షలు చేసి 8వేల మందికి ఉచితంగా అద్దాలు అందజేశామన్నారు. అనుభవం ఉన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారథ్యంలో ప్రతి చోటా అభివృద్ధి కన్పిస్తోందన్నారు. ప్రతి వాటర్‌ప్లాంట్ మెయింటైన్ తామే నిర్వహిస్తామన్నారు.

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు వంటి సూపర్‌హిట్ పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఒ పావని, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



**మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన వేమిరెడ్డి**

## లేపాక్షి దుకాణాల్లో కళాకృతుల విక్రయాలపై 30 శాతం రాయితీ

**విజయవాడ.జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** లేపాక్షి దుకాణాల్లో కళాకృతుల విక్రయాలపై 30 శాతం వరకూ రాయితీ అందిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. సంక్రాంతి పండగ దృష్ట్యా రాయితీపై అమ్మకాలు చేపట్టినట్లు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో లేపాక్షి అధికారులతో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖపట్నం, అనంతపురం, కడప లేపాక్షి దుకాణాలు వినియోగదారులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఒక్కో దుకాణానికి రూ.15 లక్షల వరకూ వెచ్చించనున్నట్లు తెలిపారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు మాజీ సివిఎస్ఓ రూ.20లక్షలు విరాళం

**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత ,టిటిడి మాజీ సివిఎస్ఓ దామోదరం కుటుంబంతో 20లక్షలు రూపాయలు చెక్కులను విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణకాంత్, అజయ్‌చౌదరి కుటుంబం సభ్యులు ఈ విరాళాలను మంగళవారం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరికి అందజేశారు.



## 'భర్తమహాశయులకు విజ్ఞప్తి' చిత్రం విజయవంతం

### శ్రీవారి సేవలో చిత్రబృందం

**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ ముందుగానే తెలుగు ప్రేక్షకులను ఆనందంలో ముంచెత్తడానికి మంగళవారం విడుదలైన భర్తమహాశయులకు విజ్ఞప్తి చిత్రం విజయవంతం కావాలని చిత్ర బృందం ఆకాంక్షించింది. చిత్రం నటి ఆషికారంగనాథ్, దర్శకుడు కిశోర్, తమిళనటుడు విజయకుమార్, నటి ప్రీతిహరి, దర్శకుడు హరి కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. మంగళవారం ఉదయం టిటిడి అధికారులు వీరికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన సినీనటులను అభిమానులు చూసి ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు.



## పాదరక్షల భద్రతకు క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక వ్యవస్థ

### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులు తమతమ పాదరక్షలను భద్రపరిచే కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక వ్యవస్థ ఏర్పాటుచేసినట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి తెలిపారు. తిరుమలకు వచ్చిన భక్తులు ఎదుర్కొంటున్న పాదరక్షల నిర్వహణ సమస్యకు శాశ్వత పరిష్కారంగా టిటిడి క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక పాదరక్షల నిర్వహణ వ్యవస్థను విజయవంతంగా అమలుచేస్తోందని వెల్లడించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 వద్ద పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ విధానం అద్భుత ఫలితాలు ఇవ్వడంతో తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది కౌంటర్లను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. భక్తులు తమ పాదరక్షలను కౌంటర్ వద్ద అప్పగించగానే వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన రశీదు ఇస్తారని, ఆ రశీదులో పాదరక్షల సంఖ్య, సైజు, ర్యాక్ నంబర్, నిల్వ చేసిన స్థానం వంటి పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు. భక్తులు తిరిగి వచ్చి ఆ రశీదును స్కాన్ చేయగానే పాదరక్షలు ఉన్న ఖచ్చితమైన స్థానం డిస్‌ప్లే అవుతుందన్నారు. తద్వారా అతి తక్కువ సమయంలోనే భక్తులకు పాదరక్షలు తిరిగి అందజేయడం జరుగుతుందని అదనపు ఇఒ చౌదరి తెలిపారు. ఈ వ్యవస్థ అమలుతో 99శాతం మంది భక్తులు తమ పాదరక్షలను తిరిగి పొందుతున్నారని, గతంలో గుట్టలుగా పడిపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ వినూత్న ప్రాజెక్టును కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ తమ సిఎస్ఆర్ కార్యక్రమంలోభాగంగా పూర్తి స్థాయిలో అమలుచేస్తోందని తెలిపారు. భక్తులు తమ పాదరక్షలను ఎక్కడబడితే అక్కడ వదలకుండా, నిర్దేశిత కౌంటర్లలోనే డిపాజిట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.



## సంక్రాంతికి అదనపు బస్‌చార్జీలు లేవు

### - ప్రైవేట్ బస్‌లు చార్జీలు పెంచి అక్రమ వసూళ్లు చేస్తే సీజ్ చేస్తాం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**సచివాలయం,జనవరి 13,ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్ళకు వెళ్ళే ప్రయాణీకుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం నుండి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పండుగ రద్దీ దృష్ట్యా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం యధావిధిగా కొనసాగుతుందని, సంక్రాంతి సందర్భంగా ఎలాంటి అదనపు చార్జీలు విధించబోమని స్పష్టంచేశారు. ఈ ఏడాది ఆర్టీసీ చార్జీల్లో కూడా ఎలాంటి పెంపు లేదన్నారు. సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారు జాగ్రత్తగా నిబంధనలు పాటిస్తూ క్షేమంగా సొంతూళ్ళకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. సంక్రాంతికి సొంతూళ్ళకు వెళ్ళే ప్రయాణీకులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఇది పండుగ కానుక అని అన్నారు. అదే విధంగా ప్రైవేట్ బస్సుల అక్రమంగా చార్జీలు పెంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక చార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. పండుగను ప్రజలు ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ విభాగం
ఇ-ప్రాక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం.28 TO 30/SDP Grant/EEPIUVSP/2025-26, తేది: 08.01.2026
భీమునిపట్నం సబ్-డివిజన్‌లో, విశాఖపట్నం జిల్లాలో SDP గ్రాంట్ క్రింద రూ.22.00 లక్షల అంచనా ధరకు 3నం.లు AWC బిల్డింగ్‌ల నిర్మాణం. బిడ్ డౌన్‌లోడ్ 22.01.2026 నుండి. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా http://www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్ నం: 9490543902.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, PIU డివిజన్, విశాఖపట్నం.
DIPR.NO. 18797/CL/ADVT/1/1/2022-23 తేది: 13.01.2026

Skill India
భారత ప్రభుత్వం
నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ
నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (NCVET) న్యూఢిల్లీ (నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ యొక్క పాలనా సంబంధిత అధీనంలోని ఒక చట్టబద్ధం కాని రెగ్యులేటరీ అథారిటీ)లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ యొక్క ఒక (01) ఖాళీ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానింపబడుతున్నవి.
అర్హతా ప్రమాణం, నిర్దేశిత నమూనా మరియు ఇతర అవసరమైన సమాచారంతో సహా సవివర ప్రకటన మంత్రిత్వశాఖ యొక్క వెబ్‌సైట్ (http://www.msde.gov.in) వద్ద అందుబాటులో ఉంచడమైనది. ఆసక్తిగల అభ్యర్థులు నిర్దేశిత నమూనాలో అన్ని విధాలా పూర్తి చేసిన దరఖాస్తులను జాయింట్ డైరక్టర్ (E&P వింగ్)కు ecopol-msde@gov.in ఇ మెయిల్ ద్వారా గానీ లేదా పోస్ట్ ద్వారా గానీ 09వ మార్చి, 2026న సా.5.30గం. లేదా ముందు పంపవచ్చును.
సం/-
ప్రదేశం : న్యూఢిల్లీ జాయింట్ డైరక్టర్,
తేదీ : 12వ జనవరి, 2026 నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ.
CBC 63101/11/0013/2526

ఇతరుల సంపాదనను అక్రమంగా ఆశించేవారు నికృష్టులు. తన సంపాదనను అనుభవించేవారు శ్రేష్ఠులు.

-సోక్రటీస్

# చుర్రుమంటున్న 'సర్'!

ఏ వరైతేనేమి దేనికయితేనేం 'సర్' మంట రాజుకుంది. అదిప్పుడిప్పుడే ఆరేట్లు లేదు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, హాజరులో లేని ఓట్ల తొలగింపు వంటి అంశాలకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఎన్నికల కమిషన్ ఈ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ కేటాయించడం ఆహ్వానించదగినదే.కానీఎన్నో విమర్శలను తలకెత్తుకొంది. అనేక ఆరోపణలకు గురైంది. అవేమీ చిన్నాచితక ఆరోపణలు కావు. దేశం మొత్తంమీద రాజకీయ రంగంలో అనేక చిత్ర విచిత్ర సంఘటనలకు కారణమైంది. సమయం సరైనదే అయినా సందర్భం దానికంతగా అనుకూలించలేదు. ఎప్పుడైనా చేసేది చేయాల్సిందే. చేయగలిగిందే. కానీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జాబితాన్ని సమంజసంగా వినియోగించుకోకుండా విపక్ష ప్రధాన నేతల మీద ఒంటికాలుమీద లేచారు. ప్రశ్నించేందుకు మీరెవరు! మేమే అన్నీ! అనే ధోరణితో వ్యవహరించడమే అసలు సమస్య కన్నా మిన్నగా జనం లోకి పోయింది. కేంద్ర ఎన్నికల కమిషన్ స్వతంత్ర్యంగా వ్యవహరించిందా? లేదా! అనే అంశాలపై సందేహాలు కలిగే విధంగా ప్రవర్తించింది. అప్పట్నించే ఈ 'సర్' వ్యవహారం పాకం జీడిలా సాగుతోంది. తాజాగా ఎన్నికల సంఘంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'సర్' తీసివేతలపై ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుత రూపంలోనే ఎన్నికల సంఘం ముందుకెళ్తేఎంతో మంది ఓటు హక్కును కోల్పోతారని ఆమె ఆందోళన. కాంగ్రెస్ పార్టీ చెప్పిందనో, ఎన్నికల సంఘం భారతీయ జనతాపార్టీ కనుసన్నల్లో నడుస్తోందనో ఆరోపణలు చేసుకుంటూ కాలక్షేపం చేయడం కన్నా అసలు లోతుల్ని కనిపెట్టి దాడి చేయడమైనా, బలమైన ఆరోపణలకు 'తెర' తీయడమైనా చేస్తే అందరికీ ఉభయతారకంగా ఉంటుంది. కానీ ఎన్నికల సంఘం తమపై వచ్చే ఎలాంటి ఆరోపణలనూ లెక్క చేయకుండా ముందుకెళ్తోంది. ప్రణాళిక సన్నద్ధత లేకుండా సమర్థ యంత్రాంగం లేకుండానే 'సర్'ను తాత్కాలికంగా అమలు చేసి ఓటర్లను తొలగించేస్తోందని ఆమె పశ్చిమ బెంగాల్ ఓటర్ల తొలగింపుపై నానాయాగీ చేస్తున్నారు. అదే విషయాన్ని మమత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖరాశారు. తీవ్ర అవకతవకలు, విధాన ఉల్లఘనలు లేకుండా పరిపాలనా నిర్వహణ లోపాలను సరిచేసుకుని 'సర్'ను అమల్లోకి తెస్తే ఎవరికీ ఏ విధమైన అభ్యంతరం ఉండదని మమతా బెనర్జీ వెల్ల డిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల తొలగింపువ్యవహారాన్ని ఆమె ప్రజాస్వామ్య పునాదులపై దాడిగా అభివర్ణించారు. ఏకపక్షంగా, లోపభూయిష్టంగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కసరత్తులు నిలిపి వేయాలని ఆమె ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తిచేశారు. ఆమోదయోగ్యం, ఆచరణ సాధ్యంకాని నిబంధనల వలనే 'సర్'లో సమస్యలు తలెత్తుతున్నాయని, నిజానికి 'ఓట్ల' సమీక్షకు తమకేమీ అభ్యంతరం లేదని 'సర్' విధానాలపై ధ్వజమెత్తుతున్న అన్ని రాష్ట్రాలూచెప్పేమాట. బెంగాల్‌లో అవలంబిస్తున్న 'సర్' ప్రక్రియ కోసం విని యోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా సమయంలోనే డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయ ని ఆమె ఆరోపణ. దీని విషయమై ఎన్నికల కమిషన్ ఇంతవరకు స్పందించకపోవడం వల్లనే మమత ఆగ్రహా కారణం. ఇలాంటి అవకతవకల వలన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్‌ప్రక్రియ మొదలైన నాటినుంచి ఆమె ఆవేదనలన్నీ ఇసికిలేఖల రూపంలో చేరుతూనే ఉన్నాయి. తాజా లేఖ ఐదవది. బీహార్‌లో విపక్షాలన్నీ ఈ 'సర్' ప్రక్రియపై ధ్వజమెత్తడం ఎన్నికల కమిషనర్‌తోపాటు సుప్రీంకోర్టు సాధికారికంగా కలుగ చేసుకోవడంతో చాలా సమస్యలు సమసిపోయాయనే అందరూ అనుకున్నారు. కానీ బిఎల్‌ఓల పేరిట కొత్త సమస్యలు తలెత్తాయి. అది వారి వ్యక్తిగతం కాదు. విధాన రూపకల్పనలో వైవిధ్య విధానాలు ఉండడం వల్లే వాటి మీద కూడా విమర్శలు చెలరేగాయి. కృత్రిమ మేధ ఆధారంగా చేపట్టిన2022నాటి ఓట్ల సవరణ కార్యక్రమంలోనూ తప్పులు దొర్లాయి. అవన్నీ సవరింపదగ్గవే.కానీ ఎందుకనో ఎన్నికల కమిషన్, బహిరంగ నోటీసుల ప్రక్రియ ప్రారంభించారు. ఆనాటి ఓటర్ల జాబితాలో తప్పులు చోటు చేసుకున్నందున నేడు సేకరించిన సమాచారంతో కొన్ని సరిపోలలేదు.'డేటామిస్ మేచ్' అనే కొత్త సమస్య తెరపైకి వచ్చింది. తాజా వివరా లతో సరిచేసుకోవచ్చు. కానీ పారదర్శకం కోసమే వాటి సవరణ చోటు చేసుకోలేకపోతోంది. ఉన్న వివరాలు చాలవనే ధోరణిలో ఇ.సి నోటీసులిస్తోంది. తాజాగా నోబెల్ అవార్డుగ్రహీత అమర్త్యసేన్ ఇసి నోటీసులిచ్చింది. ఆయనకు ఆయన తల్లిగారికి మధ్య వయసుతేడా 18సంవత్సరాలుగా ఉందనే కారణంతో అక్కడ లేనిపోని సందేహాలు తలెత్తే స్థాయిలో ఎన్నికల కమిషన్ నోటీసుల ప్రస్తావన ఉంది. విపక్షాల విమర్శలెన్నున్నా వాటికి జవాబు చెప్పేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగాలేదు. రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందనే ఆరోపణల నుంచి బయట పడేందుకు ఏ విధంగానూ ఎన్నికల కమిషన్ ప్రయత్నించడం లేదన్న విమర్శల నుంచి దూరంగా జరిగే పరిస్థితులను కల్పించలేకపోతోంది. సర్‌లో అనుమానిత ఓటర్ల విచారణ యాంత్రికంగా పాత సాంకేతిక డేటా ఆధారంగానే జరుగుతోందితప్ప మానవీయ విలువలను పట్టించుకోవడంలేదంటూ మమత బెనర్జీ తనలేఖలో ఆధారసహితంగా పేర్కొంది. పలురాష్ట్రాల్లో విచారణానంతరం ఎంత మంది ఓటర్లను తొలగించినా వాటిపై సందేహాలను తీర్చడంలో ఇ.సి పారదర్శకతను అనుసరిస్తే సమస్య జటిలం కాదు.

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

మన ప్రవర్తనలో ముందుగా మార్పు వస్తే సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.



షేక్స్పియర్

# పర్యావరణ పరిరక్షకులు మనమే

**పరిశుభ్రత పారిశుద్ధ్యం అనే అంశం కేవలం పారిశుద్ధ్య కార్మికులకు వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో సమాజంలోని ప్రజల భాగస్వామ్యం పరస్పర సహకారంతో బాధ్యతగా ఆధునిక ధోరణితో పర్యావరణ పరిరక్షించే అనేక ప్రక్రియలను ఉపయోగించుకుని మొదట కాలుష్య రహిత పరిసరాలను ఏర్పరచుకున్న తర్వాతనే జీవన అవసరాలకు నిర్ణయాత్మక రూపకల్పన చేసుకునే విధంగా రానున్న రోజుల్లో కాలుష్య నిర్మూలనపై మరింత అవగాహన కలిగే పరిస్థితి ఉంటే మంచిదేమో. అదే విధంగా కాలుష్యనియంత్రణలో వృక్షసంపద కూడాఅత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.అవసరమైన ప్రాంతాల్లో వృక్షాలను పెంచుకునే బాధ్యత కూడా మానవ సమాజంపైఉంది. అత్యధికశాతం అడవులను నరికివేస్తూ అనుకూలమైన సాను కూల జీవన విధానాలకొరకు అనేకరకాలైన టువంటి పద్ధతులను అవలంబిస్తున్న ఆధునిక మానవుడు అవసరమైతేతిరిగి చెట్లను నాటి వాటిని పెంచే విధంగా బాధ్యతను తీసుకుంటే రాబోవు కాలంలో మంచి వాతావరణంతో కూడిన పర్యావరణం ప్రకృతి మానవునికి మేలు చేసే విధంగా ఉంటుందని ఆశించడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో ప్రధాన నగరాలతో పాటు జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో మోతాదుకు మించిన కలుషితమైన పదార్థాలు నిరంతరం మానవాళికి నష్టం కలిగించే విధంగా రూపాంతరం చెందుతూ ఉండడం శోచనీయం. తద్వారా కాలుష్య బారిన పడిపోతున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులతోపాటు అనారోగ్య సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా జీవావరణం చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో వాయు, జల, శబ్దరూపాల్లో వివిధ కాలుష్య కారకాలు ఎక్కువ అవుతున్నాయని గణాంకాలు చెపుతున్నాయి. ప్రధానంగా ఆధునిక జీవన విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మానవుని అవసరాల కోసం ప్రకృతిలో మితిమీరిన స్వార్థపూరిత విధానాలను వినియోగిస్తున్న తీరు అవలంబిస్తున్న పద్ధతులు చాలావరకు పరిసరాల చుట్టూఉన్న పర్యావరణాన్ని పరిరక్షించే రీతిలో లేకుండా ఉండటం ఒక ఎత్తు అయితే పర్యావరణ సమతుల్యంపై కాలుష్యం నియంత్రణపై శ్రద్ధ వహించకపోవడం మరొక ఎత్తు అవుతుందేమో అనిపిస్తుంది. మారుమూల గ్రామీణ ప్రాంతాలు సైతం ఆధునిక పోకడలు సంతరించుకుంటున్న తరుణంలో వ్యవసాయ పద్ధతిలో వినియోగిస్తున్న అనేక రకాలైన కృత్రిమ రసాయన ఎరువుల వాడకంతో పాటు వాహనాల రద్దీ కూడా ఎక్కువ కావడం పెట్రోల్ డీజిల్ లాంటి ఇంధనాలు అవసరాలు పెరిగిపోయి విరివిగా ఇంధనాల నుండి వస్తున్నటువంటి విష పూరిత రసాయనాలు, వ్యర్థాలు వాతావరణంలో పొగ రూపంలో కలిసిపోతుండడం సర్వసాధారణమైపోతున్నది.సమాజంలోని మానవులు అవసరాలకు మించి వన సంరక్షణ లాంటి ప్రదేశాల్లోని చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికి వేస్తూ వాటిని నివాస ప్రాంతాలుగా మారుస్తున్న సందర్భాల్లో పర్యావరణ పరిరక్షణకు దోహదపడే చెట్లను తిరిగి పెంచకుండా పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న తీరుతో మానవ ఆధునిక జీవన విధానాల్లో నిరంతరం వెలువడుతున్న విషపూరితమైన కార్బన్ డయాక్సైడ్ , కార్బన్ మోనాక్సైడ్ లాంటి క్లోరో ఫ్లోరోకార్బన్‌లు వాతావరణంలోకి విస్తరిస్తూ ఉండటం గమనార్హం. జీవావరణం చుట్టూ ఉన్న పరిసరాల్లోని స్వచ్ఛమైన వాతావరణాన్ని హరించే రీతిలో ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ ఉంటున్న మోతాదుకు మించిన కలుషితమైన వ్యర్థాలను నిర్ణీత సమయంలో నిర్మూలించకపోవడం వల్ల కావచ్చేమోకానీ మానవుడు ప్రకృతి ప్రవృత్తికి భిన్నంగావ్యవహరించే తీరులో అడపాదడపా ప్రకృతి నుండి ప్రతిస్పందనగాప్రకృతి విలయతాండవం చేస్తున్న సందర్భాల్లో జనజీవనం అస్తవ్యస్తం అవుతున్న సంఘటనలు గోచరిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రకృతిలో మానవుడు తన భౌతిక అవసరాలకు ఉపయోగించే విధానాలు కొంతవరకైనా పర్యావరణాన్ని నష్టపరిచే విధంగా ఉంటున్నాయా అనే సందేహాలు కలగక మానవు. పట్టణ పరిసర ప్రాంత పరిశ్రమల నుండి వాహనాల నుండి తరచుగా వెలువడుతున్న కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్,సల్ఫర్ డయాక్సైడ్,నైట్రోజన్ ఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్ లాంటి విషతుల్య పదార్థాలు ప్రత్యక్షంగా



పరోక్షంగా వాతావరణంలో కలిసి జీవావరణానికి హాని కలిగించే విధంగా తయారవుతున్నాయి. ఇంధన కాలుష్యాలు దుమ్ము ధూళి కణాలతో కలిసిపోతుండడం మానవాళికి కావాల్సిన ప్రాణవాయువు ఆక్సిజన్ శాతం క్రమక్రమంగా తగ్గిపోతుండటంతో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడడమే కాకుండా కాలుష్య బారినపడి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు లోను అవుతుండడం విచారకరం.ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్థాలు, విష వాయువులు వాతావరణ కాలుష్యాన్ని, జల కాలుష్యాన్ని కలుగచేస్తూనే ఉన్నాయి. తద్వారా అనేక రకాలైనటువంటి బ్యాక్టీరియా వైరస్ లాంటి అతి సూక్ష్మమైన జీవులు మానవులకు హాని కలుగచేస్తూనే ఉన్నాయి. ఈగలుదోమలు వ్యర్థపదార్థాలు పై సంచరిస్తూ అనారోగ్యాలకు ఉపకరణాలుగా మిగిలిపోతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణకు కాలుష్యంవల్ల కలిగే నష్టాలను, వచ్చే ఉపద్రవాలను అనర్థాల గురించి సరైన నిర్ణయాత్మక కార్యాచరణపై క్షేత్రస్థాయిలో సమాజంలోని కాలుష్య నియంత్రణ వ్యవస్థల్లో పౌరులను బాధ్యులుగా చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. మోతాదుకు మించిన వ్యర్థాలను కాలుష్య పదార్థాలను నియంత్రించుకునే విధానాలను ఆచరిస్తూపర్యావరణ పరిరక్షణకు తమ వంతు కర్తవ్యంగా సమాజంలోని ప్రతి పౌరులు విధిగా భావిస్తే తప్ప కాలుష్య నియంత్రణ సాధ్యం కాదేమో. ఆధునిక మానవ నాగరిక సమాజంలో పెట్రోల్ డీజిల్ లాంటి ఇంధన వనరులు అతిగా ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను నివారించడానికి ప్రకృతి పర్యావరణానికి హాని కలిగించనిప్రత్యామ్నాయమైనటువంటి కాలుష్య రహిత సాంప్రదాయ పునరుత్పాదక శక్తి వనరులైన బయోమాస్, సౌరశక్తి జలశక్తి,పవన శక్తిని సమృద్ధిగా ఉపయోగించుకొని రానున్న రోజుల్లో పర్యావరణ పరిరక్షణకు ఆటంకం లేకుండా మానవులు అవసరాలను సులభతరం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణ మండలి అనేకసార్లు అనేకరకాలుగా కాలుష్య నివారణపై శ్రద్ధ వహించే విధంగా పలు సూచనచేస్తున్నప్పటికీ, కొన్ని పరిశ్రమల నుండి విడుదలవుతున్నటువంటి కాలుష్య పదార్థాలు అంతే రీతిలో మానవాళికి అనర్థాలకు కలుగచేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో పర్యావరణ పరిరక్షకులు కాలుష్య నిర్మూలనకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకునే విధంగా కొన్నిప్రాంతాల్లో ప్రయత్నాలు ప్రారంభం కావడం విశేషం.ఏది ఏమైనప్పటికీ కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో మానవాళి సహకారం బాధ్యత అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పరిశుభ్రత పారిశుధ్యం అనే అంశం కేవలం పారిశుద్ధ్య కార్మికులకు వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో సమాజంలోని ప్రజల భాగస్వామ్యం పరస్పర సహకారంతో బాధ్యతగా ఆధునిక ధోరణితో పర్యావరణ పరిరక్షించే అనేక ప్రక్రియలను ఉపయోగించుకుని మొదట కాలుష్య రహిత పరిసరాలను ఏర్పరచుకున్న తర్వాతనే జీవన అవసరాలకు నిర్ణయాత్మక రూపకల్పన చేసుకునే విధంగా రానున్న రోజుల్లో కాలుష్య నిర్మూలనపై మరింత అవగాహన కలిగే పరిస్థితి ఉంటే మంచిదేమో.అదే విధంగా కాలుష్యనియంత్రణలో వృక్షసంపద కూడాఅత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.అవసరమైన ప్రాంతాల్లో వృక్షాలను పెంచుకునే బాధ్యత కూడా మానవ సమాజంపైఉంది. అత్యధికశాతం అడవులను నరికివేస్తూ అనుకూలమైన సానుకూల జీవన విధానాలకొరకు అనేకరకాలైన టువంటి పద్ధతులను అవలంబిస్తున్న ఆధునిక మానవుడు అవసరమైతేతిరిగి చెట్లను నాటి వాటిని పెంచే విధంగా బాధ్యతను తీసుకుంటే రాబోవు కాలంలో మంచి వాతావరణంతో కూడిన పర్యావరణం ప్రకృతి మానవునికి మేలు చేసే విధంగా ఉంటుందని ఆశించడంలో సందేహం లేదు. •

# విద్యావ్యవస్థను కాపాడవల్సింది గురువులే

పురుషోత్తం నారగౌని

ఒకప్పుడు సమాజంలో గురువు స్థానం దైవంతో సమానం. 'బ్రతుకు నేర్పేవాడే బడి పంతులు' అని అంతా నమ్మేవారు. కానీ, మారుతున్న కాలక్రమంలో, విలువల పతనంలో ఆ నానుడి మారుతూ వచ్చింది.నేడు చాలా మంది ఉపాధ్యాయులు బ్రతుకు నేర్పేవారిగా కాకుండా,తమ బ్రతుకు తాము చూసుకునే 'బ్రతుక నేర్చిన పంతులు'గా మారిపోతున్నారన్నది చేదు నిజం. భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన తరగతి గది, నేడు ఉపాధ్యాయుల హక్కుల పోరాట వేదికగా మారుతోందే తప్ప, విద్యా ప్రమాణాల పెంపుదల కేంద్రంగా మారడం లేదు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలోని వేలాది మంది ఇన్‌సర్వీస్ టీచర్లలో (వృత్తిలో కొనసాగుతున్నవారు) మొదలైన ఆందోళన, వారు చేస్తున్న డిమాండ్లు విద్యావ్యవస్థలోని లోపాలను మరోసారి బట్టబయలు చేశాయి. విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) ప్రకారం ఉపాధ్యాయులుగా కొనసాగాలంటే టెట్ (టీచర్ ఎలిజెబులిటీ టెస్ట్) అర్హత తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, పదిహేను, ఇరవై ఏళ్లుగా ఉద్యోగంలో ఉన్న తాము ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయడమేమిటని, తమకు మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు రోడ్డెక్కుతున్నాయి. ఇక్కడ సామాన్యుడికి వచ్చే సందేహం ఒక్కటే. దశాబ్దాల తరబడి విద్యార్థులకు పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయులకు, తమ అర్హతను నిరూపించుకునే ఒక పరీక్ష రాయడానికి భయం ఎందుకు? ఇన్నేళ్ల అనుభవం ఉన్నవారికి ఆ పరీక్ష ఒక ప్రహసనం కావాలే తప్ప, గండం కాకూడదు కదా! సిలబస్‌లో తమకు సంబంధం లేని అంశాలు ఉన్నాయన్నది వారి వాదన. కానీ, మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము అప్‌డేట్ చేసుకోలేనివారు, రేపటి తరం పిల్లలకు ఆధునిక విజ్ఞానాన్ని ఎలా అందించగలరు? అనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.కేవలం ఒకసారి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందంటేచాలు, ఇక జీవితాంతం ఎలాంటి పరీక్షలు లేకుండా, నాణ్యతతో సంబంధం లేకుండా నెట్టుకురావచ్చు అనే ధోరణి వ్యవస్థలో గూడుకట్టుకుపోయింది. వాస్తవానికి ఈ దుస్థితికి కేవలం



ఉపాధ్యాయులను మాత్రమే తప్పుబట్టలేం. ప్రభుత్వాల పాపం కూడా ఇందులో ఉంది. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాల్సిన ప్రభుత్వం, వారిని కుల గణన, ఎన్నికల డ్యూటీలు, పల్స్ పోలియో, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అంటూ రకరకాల పనులకు వాడుకుంటోంది. దీనివల్ల వారి ఏకాగ్రత దెబ్బతింటున్న మాట వాస్తవమే. పైగా పాఠశాలల్లో తనిఖీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఉపాధ్యాయుడు క్లాస్ రూమ్‌లో ఏం చెప్తున్నాడు? విద్యార్థులకు ఎంత అర్థమవుతోంది? అని పర్యవేక్షించే నాథుడే లేడు. దీనికి తోడు ఉపాధ్యాయ బదలీలు, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో బోధన కంటే పైరవీలకే ప్రాధాన్యత పెరిగింది. ఈ వాతావరణమే కొంతమంది ఉపాధ్యాయులను 'పని చేయకపోయినా పర్లేదు' అనే స్థాయికి దిగజార్చింది. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రైవేటు పాఠశాలలు లాభపడుతున్నాయి. ఇప్పుడు కేంద్ర విద్యాశాఖ, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎంతమంది టీచర్లకు టెట్ అర్హత లేదో వివరాలు కోరింది. రాష్ట్రంలో దాదాపు 40 వేల మందికి పైగా ఇలాంటి టీచర్లు ఉన్నట్లు అంచనా. వీరంతా ఇప్పుడు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు వేస్తూ, ప్రభుత్వాలపై ఒత్తిడితెస్తూ మినహాయింపు కోరుతున్నారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. వైద్యరంగంలో ఉన్న డాక్టర్లు ఎప్పటికప్పుడు కొత్త వైద్య విధానాలు నేర్చుకోవాలి, ఐటీ ఉద్యోగులు కొత్త టెక్నాలజీ నేర్చుకోవాలి. మరి సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయులు మాత్రం 'మాకు పాత చదువే చాలు, కొత్త పరీక్షలు వద్దు'అని భీష్మించుకు కూర్చోవడం ఎంతవరకు సమంజసం? 'వృత్తిలో సీనియారిటీ' అనేది గౌరవమే కానీ, అది 'నైపుణ్య లేమి'కి కవచంకాకూడదు. ఇప్పటికైనా ఉపాధ్యాయ లోకం ఆత్మవిమర్శ చేసుకోవాలి. తాము కేవలం జీతాలు తీసుకునే ఉద్యోగులం మాత్రమే కాదు, ఒక తరానికి దిక్సూచిలం అనే బాధ్యతను గుర్తించాలి. టెట్‌వంటి పరీక్షలను ఒక శిక్షగా కాకుండా, తమ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే అవకాశంగా భావించాలి. ప్రభుత్వాలు కూడా కేవలం కోర్టు తీర్పుల అమలుకే పరిమితం కాకుండా, ఉపాధ్యాయులకు తగిన శిక్షణనిచ్చి, వారిని ఇతర పనుల నుంచి విముక్తి చేసి, కేవలం బోధనపైనే దృష్టి పెట్టేలాచూడాలి. లేదంటే, ప్రభుత్వ బడులు కేవలం భవనాలుగా మిగిలిపోతాయి తప్ప,భవిష్యత్తును నిర్మించే కర్మాగారాలుగా మారలేవు. విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సింది కోర్టులు కాదు, ఆ వ్యవస్థలో కీలకమైన గురువులే అని గుర్తించిన నాడు ఏ పరీక్షలూ వారికి అడ్డంకి కావు. •

# మరొకసారి బయటపడిన అమెరికా దాష్టీకం

డాక్టర్ తిరుణహరి శేషు

నార్కో టెర్రరిజానికి పాల్పడుతున్నారనే నెపంతో అమెరికా అబ్జల్యూట్ రిసాల్వ్ ఆపరేషన్‌తో వెనుజులాపై దాడి చేసి ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోని అతని భార్య సిలిమా ఫ్లోరెస్‌ని బందీలుగా తీసుకపోవటంతో ప్రపంచ పోలీస్‌గా పిలవబడుతున్న అమెరికా దాని చర్యతో ప్రపంచమంతా నెవ్వెరపోయింది. అమెరికాలోకి డ్రగ్స్‌ని దిగుమతి చేస్తూ నార్కోటెర్రరిజాన్ని ప్రేరేపిస్తూ ఇంటర్నేషనల్ డ్రగ్స్ కేంద్రంగా వెనుజులా మారిందని ఆరోపిస్తూ మూడు కోట్లకు పైగా జనాభా గల దక్షిణ అమెరికా దేశమైన వెనుజులా దేశంపై అమెరికా డెల్టా ఫోర్స్‌దాడి చేయడంతో 2013 నుండి ఆ దేశాన్ని పాలిస్తున్న నికోలస్ మదురో పాలనకి తెరపడింది. పనామా సైనిక పాలకుడు ఆంటోనీయో నోరిగాను ఏ ఆరోపణలతో అమెరికా 1989లో బందీగా పట్టుకపోయిందో ఇప్పుడు అదే ఆరోపణలతో నికోలస్ మదురోని కూడా అమెరికా బందీగా పట్టుకొచ్చింది.మదురోపై అమెరికా చేస్తున్న ఆరోపణలు ఎలాఉన్నా అవి ఆదేశ అంతర్గత వ్యవహారాలకు సంబంధించినవి కాబట్టి అమెరికా ఎలా జోక్యం చేసుకుంటుంది. వెనుజులా పై అమెరికా చేపట్టిన చర్య అంతర్జాతీయ చట్టాలకి, న్యాయ సూత్రాలకి, ఐక్యరాజ్యసమితి నిబంధనలకి వ్యతిరేకంగానే ఉన్నాయి కదా! అమెరికా మదురోపై దాడికి చూపిస్తున్న కారణాల కంటే ఆ దేశంలో ఉన్న చమురు నిల్వలపై అమెరికా కన్నుపడటమే దాడి వెనుక ప్రధాన ఉద్దేశంగా కనపడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 303బిలియన్ బ్యారెల్స్ చమురు నిక్షేపాలతో వెనుజులా చమురు నిల్వలలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నది. వెనుజులా చమురు నిక్షేపాలు అమెరికా కంపెనీల చేతిలోనే ఉండేవి కానీ 1999లో హ్యూగో చావేజ్ అధికారంలోకి వచ్చిన తర్వాత చమురు నిక్షేపాలను జాతీయం చేయటంతో చమురు నిక్షేపాలపై అమెరికా ఆధిపత్యానికిగండి పడింది. 25 సంవత్సరాల క్రితం వెనిజులా చమురు నిక్షేపాలపై కోల్పోయిన ఆధిపత్యాన్ని తిరిగి సంపాదించాలంటే మదురో నాయకత్వంలోని యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనుజులానిఅధికారం నుండి తొలగించాలనే వ్యూహంలో భాగంమే మదురోని బందీగా తీసుకెళ్లడం.మదురోని బందీగా పట్టుకెళ్ళిన తర్వాత అక్కడ ఎవరు పాలించాలో మేమే నిర్ణయిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇరాక్ లో సద్దాం హుస్సేన్‌ని ఉరితీసి లిబియాలో కల్నల్ గడాఫీని చంపివేసి తమ కీలుబొమ్మ ప్రభుత్వాలను నిలబెట్టినట్లుగానే వెనిజులాలో కూడా తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్టించి చమురు నిక్షేపాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవటమే అమెరికా వ్యూహంగా



కనిపిస్తుంది. దేశ ప్రజలలో మదురోపై ఉన్న వ్యతిరేకత అమెరికాకి కలిసి వచ్చింది. ప్రజల నుండి కానీ, సైన్యం నుండి కానీ పెద్దగా వ్యతిరేకత లేకుండానే అమెరికా మదురోని బంధించగలిగింది. బొలివేరియన్ విప్లవ నాయకుడైన హ్యూగో చావేజ్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో విఫలమైన అమెరికా మదురో విషయంలో మాత్రం విజయం సాధించటానికి ప్రధాన కారణం మదురో వైఫల్యాలే. చమురు నిక్షేపాలను జాతీయ చేయటం ద్వారా వచ్చిన సంపదనివిద్యా, ఆరోగ్యం, గృహవసతి, పేదరిక నిర్మూలన లాంటి సౌకర్యాలపై ఖర్చు చేసి ఛావేజ్ ప్రజల మన్ననలు పొందగలిగారు కానీ చావేజ్‌కి భిన్నంగా మదురో ఎన్నికలలో అక్రమాలు చేసి గెలవటం, ప్రతిపక్ష నేతలను క్రూరంగా అణిచివేయటం తన పాలనలో ద్రవ్యోల్బణం, పేదరికం పెద్ద ఎత్తున పెరిగిపోతున్నా పట్టించుకోకపోవడంతో దేశీయంగా మదురోకి ప్రజల నుండి పెద్దగా మద్దతు దొరకకపోవటంతో అమెరికా సునాయసంగా తన పనిని చక్క పెట్టుకోగలిగింది.వెనుజులా ఉదంతంతో అమెరికా ద్వంద్వ వైఖరి మరొకసారి బట్టబయలైంది.తన అనుకూల దేశాలతో ఒక విధంగా వ్యతిరేక దేశాలతో మరొక విధంగా అమెరికా వ్యవహరిస్తుంది.ఇజ్రాయెల్, పాకిస్థాన్ లాంటి దేశాలకు కొమ్ము కాస్తూ వెనుజులాపై చేసిన ఆరోపణలాగే కొలంబియా, మెక్సికో, క్యూబా, డెన్మార్క్ లాంటి దేశాలపై కూడా చేస్తూ ఆ దేశాలను బెదిరించే ప్రయత్నాలు అమెరికా చేస్తుంది. అమెరికా వెనుజులా అధ్యక్షుడిని బంధీని చేసినట్లుగానే చైనా తైవాన్ అధ్యక్షుడిని, రష్యా ఉక్రెయిన్ అధ్యక్షుడిని బందీగా చేస్తే అప్పుడు అమెరికా వైఖరి ఎలా ఉంటుంది. తన మాట వినని బ్రెజిల్ పైన ఇండియా పైన ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించి అమెరికా మరొక విధంగా తన ఆధిపత్యాన్ని చలాయించే ప్రయత్నం చేస్తుంది. భారత్ రష్యా నుండి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నందుకే భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ చెబుతూ భారత్‌పై ఒత్తిడిపెంచే ప్రయత్నం చేస్తున్నారు. పాకిస్థాన్ కూడా భారత్‌లో ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతుంది మరి ఈ కారణంతో భారత్ పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర ప్రయోగిస్తే అమెరికా ఎందుకు జోక్యంచేసుకుంది.అణువస్త్ర ఆయుధాలు తయారు చేస్తున్నారనే నెపంతోఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తున్నారు. క్యూబాని కూడా బెదిరిస్తున్నారు తమ మాట వినని బ్రెజిల్ ఇండియాలపై పెద్దఎత్తున సుంకాలు విధిస్తున్నారు. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో కరేబియన్ సముద్ర జలాలలో బెల్లా 1, సోఫియా బెల్లా 1చమురు నౌకలను అమెరికా తన ఆధీనంలోకి తీసుకొని రష్యాపై కూడా కాలుదువ్వుతుంది కాబట్టే అమెరికా ఆర్థికవేత్త జఫ్రీశాక్స్ అమెరికాని రోగ్ స్టేట్ (దూర్తదేశంగా)అభివర్ణిస్తూ ట్రంప్ ది మతిలేని దూకుడు ట్రంప్ అదుపు తప్పారని విమర్శిస్తున్నారు. వెనుజులా పట్లఅమెరికా వ్యవహరించిన విధంగానే బలమైన దేశాలు బలహీన దేశా లపైన ఈ విధమైన చర్యలు చేపట్టుకుంటూ రాజరికపు ఆన వాళ్ళైన అశ్వమేధయాగాలు చేసుకుంటూపోతే నానాజాతి సమితి వైఫల్యం రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసినట్లుగానే ఐక్యరాజ్యసమితి వైఫల్యం మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీస్తే ఆ పరిణామాలకి అమెరికానే బాధ్యత వహించాలి. •

# ప్రజావాక్కు



## తెలుగు సబ్జెక్టు తప్పనిసరి

ఈమధ్యతెలుగు మహాసభలు, నిర్విఘ్నంగా నిర్వహించబడ్డాయి. సభకు హాజరైన ఆహ్వానితులు తెలుగు భాష ఔనత్యాన్నిగురించి ఏకరువు పెడుతూ పెద్దపెద్ద ఉపన్యాసాలు యిచ్చారు,వెళ్ళారు.తెలుగు పాఠ్యాంశాలు తప్పక అన్ని విద్యాలయాలలో అమలు చేయాలని ఎవరైనా చెప్పారా?ఆంగ్లభాషమీదమోజు మెకాలే మహానుభావుడి దయవల్లదినదినప్రవర్ధమానమవుతున్నది. ఇంతగా పాతుకుపోయిన ఈజాడ్యం ఇప్పుడు పొమ్మంటే పోతుందా? దేశ భాషలందు తెలుగు లెస్స అనీ, దీన్ని ఇటాలియన్ ఆఫ్ దిఈస్ట్అనిఅంటారనీ లోకోక్తి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ స్కూళ్లలో కూడా ఓ తెలుగు సబ్జెక్టు బోధనను తప్పనిసరి చేయాలి.

- ఎన్.రామలక్ష్మి,సికింద్రాబాద్

## సుంకాల బెడద

అమెరికా సుంకాలు బెడదతో ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థలు కలిగిన రాష్ట్రాలలో ఉద్యోగాలు పోయే పరిస్థితి ఉంది. ముఖ్యంగా వస్త్రపరిశ్రమకు బారి దెబ్బతగిలే అవకాశంఉంది. దాదాపు 32శాతం ఎగుమతులు అమెరికాకు తమిళనాడు నుండి జరుగుతాయి.అయితే ఇప్పుడు కావాల్సి ందిసబ్సిడీలు ముడి సరుకులమీద సబ్సిడీలు ఇవ్వడం యూరప్‌నుఅమెరికాకు బదులుగా మార్కెట్‌గా మార్చడం బ్రిటిష్ కాలం నాటి చారిత్రక నేపథ్యాన్ని మళ్ళీ పునరుద్ధరించడం చేయాలి. వ్యవసాయ రంగం తరవాత చేనేత రంగంమాత్రమే దేశంలో అతిపెద్దరంగంగా ఉన్న నేపథ్యంలో సబ్సిడీలు ఇవ్వడం ద్వారా చేనేత రంగం కుప్పకులకుండా కాపాడడం కేంద్ర ప్రభుత్వం తక్షణ కర్తవ్యం.

- భారత అవినాష్, జనగామ

## కోతుల బెడద

గ్రామాల్లో, పట్టణాలలో కూడా కోతుల బెడద ఎక్కువ అయింది. తోటలలో రైతులు గ్రామాల వైపు గ్రామంలో నుండి తోటలవైపు వాటిని మళ్లిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల ముందు అభ్యర్థులు వాటిని పంపి మెప్పుపొందారు. గెలిచాక ఎవరు పట్టించుకోవడం లేదు. వాటికి ఆహారం లేక ఇండ్లలోకి వస్తున్నాయి. కోతుల బెడద వల్ల కొందరు చనిపోయారుఅన్నవార్తలువస్తున్నాయి.ఇకనైనా ప్రభుత్వం కోతుల బెడదని తగ్గించేందుకుచర్యలు తీసుకోవాలి.

- అగస్త్య, కరీంనగర్

## జీవితాలను మారుస్తున్న సాంకేతికత

డిజిటల్ విప్లవం మన జీవనశైలిని సులభతరం చేసినప్పటికీ, మానవ సంబంధాల మధ్య పెను మార్పులను తీసుకువచ్చింది. ప్రపంచం మన గుప్పిట్లోకి చేరిందన్న సంతోషంలో, పక్కనే ఉన్నమనుషులకి మనం దూరమవుతున్నాం. ఒకేగదిలో ఉన్నా, భోజనటేబుల్ వద్దకూర్చున్నా సంభాషణల కంటే మొబైల్ నోటిఫికేషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నాం. స్నేహితులతో ముఖాముఖి కలిసే సందర్భాలను వీడియో కాల్స్,ఎమోజీలు భర్తీ చేస్తున్నాయి, దీనివల్ల భావోద్వేగాల్లో లోతు తగ్గి సామాజిక వియోగం ఏర్పడుతోంది. వందల కొద్దీ సోషల్ మీడియా స్నేహితులు ఉన్నా, మనసు విప్పి మాట్లాడుకునే వారు కరువవుతున్నారు. సాంకేతికత మనల్ని అనుసంధానించే సాధనంగా ఉండాలి తప్ప, మన జీవితాలను శాసించే శక్తిగా మారకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## సోమనాథ్ - నాగరిక ధైర్యానికి ప్రతీక

సోమనాథ్ ఆలయం భారత నాగరికతకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తూ శతాబ్దాల చరిత్రను తనలో దాచుకుని ఉంది. ఈఆలయం ఎన్నోవిధ్వంసాలను ఎదుర్కొన్నప్పటికీ, ప్రతిసారి పునర్నిర్మాణంతో తిరిగి లేచి నిలబడటం భారత సమాజంలోని ఆత్మవిశ్వాసం, ధైర్యం, సంస్కృతిపట్ల ఉన్న అచంచలమైన నిబద్ధతను స్పష్టంగా చాటిచెబుతుంది. అందుకే సోమనాథ్‌ను నాగరిక ధైర్యానికి ప్రతీక'గా అభివర్ణించడం చారిత్రకంగా సముచితమైన వ్యాఖ్యగా భావించాల్సిఉంటుంది. వారసత్వ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యంఇస్తూ, ఆధునిక సదుపాయాలను సమతుల్యంగా కలపాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.అలా జరిగినప్పుడే ఈ అభివృద్ధి ప్రయత్నాలు సార్థకతను పొందుతాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## మాతృభాషని కాపాడుకుందాం

మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక.ఇంట్లో తల్లిదండ్రులు తెలుగులోనే మాట్లాడితే పిల్లలు కూడా సహజంగా తెలుగును నేర్చుకుంటారు.పిల్లల మనసుల్లో భాషపై ప్రేమ, గౌరవం పెరుగుతుంది.ఇతర భాషలు నేర్చుకోవడం అవసరమే అయినా మాతృభాషను మరిచిపోవడం మంచిది కాదు.తెలుగులో మాట్లాడడం, చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలి.మన భాషను మనమే కాపాడుకుంటేనే దాని ఉనికి నిలుస్తుంది.అందరు తెలుగు పరిరక్షణకు కృషి చేయాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డిజిటల్ అరెస్టుల కట్టడికి కమిటీ

## హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు

## సుప్రీంకోర్టుకు నివేదన.. నెలలోగా నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 13:** డిజిటల్ అరెస్ట్ మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ స్కామ్‌ల ద్వారా వృద్ధులు, యువత, బలహీన వర్గాల ప్రజల నుండి వేలాది కోట్ల రూపాయల కష్టార్జితాన్ని దోచుకున్నారు. దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టుల సమస్యకు సంబంధించిన అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక అత్యున్నత స్థాయి అంతర్ విభాగాల కమిటీని ఏర్పాటు చేసింది. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తున్నది. ఇందులో టెలికం, విదేశాంగ శాఖ, ఆర్థిక, న్యాయ, వినియోగదారుల వ్యవహారాల శాఖలు, ఆర్‌బిఐ అధికారులతోపాటు సిబిఐ, ఎన్‌ఐఎ, ఢిల్లీ పోలీసుల ఐజీ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. గత ఏడాది డిసెంబర్ 26న ఏర్పాటు చేయగా, ఈ కమిటీ ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించింది, వాటిలో తాజా సమావేశానికి గూగుల్, వాట్సాప్, టెలిగ్రామ్ మరియు మరిన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. డిజిటల్ అరెస్ట్ కేసులపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిన నేపథ్యంలో మంగళవారం న్యాయస్థానానికి ప్రభుత్వం ఒక స్టేటస్ రిపోర్టు సమర్పించింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను ఎదుర్కోవడానికి టెలికం, ఆర్‌బిఐ నుండి సమాచారం అందినట్లు అందులో పేర్కొంది. దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యను అంతం చేయడానికి మార్గం సుగమం చేసేందుకు అంతర్ విభాగ మంత్రిత్వ సంప్రదింపులు జరపాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించిన తర్వాత ఐడిసిని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు సమయం కోరింది. కమిటీ సభ్యుల నుంచి పూర్తి స్థాయి వివరాలు సేకరించి, వాటిపై చర్చించి, ఒక సమగ్ర నివేదికను కోర్టు ముందు ఉంచేందుకు తమకు ఒక నెల గడువు కావాలని కమిటీ సుప్రీం కోర్టును అభ్యర్థించింది. అందుకు న్యాయస్థానం అనుమతించింది. డిసెంబర్ 1న, డిజిటల్ అరెస్ట్ స్కామర్లు, వారి సహచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు సిబిఐని ఆదేశించింది. సైబర్ నేరాలకు సంబంధించిన మ్యూల్ ఖాతాలను తెరవడంలో ప్రమేయం ఉన్న బ్యాంకర్లపై అవినీతి నిరోధక దర్యాప్తు ప్రారంభించడానికి దర్యాప్తు సంస్థకు సర్వోన్నత న్యాయస్థానం "పూర్తి స్వేచ్ఛ" ఇచ్చిన విషయం తెలిసిందే.




# సుప్రీంకోర్టుకు చేరిన జననాయగన్ వివాదం

**న్యూఢిల్లీ, జనవరి 13:** తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన జన నాయగన్ సినిమా సెన్సార్ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ జారీపై మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ విధించిన స్టేను సవాల్ చేస్తూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై జనవరి 19న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. జనవరి 9న విడుదల కావాల్సి న ఈ సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) నుంచి క్లియరెన్స్ లభించలేదు. దీంతో నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, సింగిల్ జడ్జి వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశించారు. అయితే, కొద్ది గంటల్లోనే సెన్సార్ బోర్డు అప్పీలు చేయడంతో డివిజన్ బెంచ్ ఆ తీర్పుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిజానికి, తొలుత ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు ఎగ్జామినింగ్ కమిటీ, కొన్ని మార్పులతో 'యు/ఎ-16ప్లస్' సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంగీకరించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసి సినిమాను మళ్లీ సమర్పించారు. కానీ, అదే కమిటీలోని ఒక సభ్యుడు సినిమాలోని కొన్ని సన్నివేశాలు మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రక్షణ దళాలను తప్పుగా చిత్రీకరించారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీబీఎఫ్‌సీ ఛైర్‌పర్సన్ సినిమాను రివైజింగ్ కమిటీకి పంపడంతో విడుదల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ సినిమాపై సుమారు రూ. 500 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు నిర్మాతల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంలో తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరుతూ సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. జనవరి 19న సుప్రీంకోర్టు విచారణ తర్వాత ఈ సినిమా భవితవ్యంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అందరికీ వికాసం 'బ్రిక్స్' లక్ష్యం

### - విదేశాంగ మంత్రి జైశంకర్

### - బ్రిక్స్ 2026 లోగో ఆవిష్కరణ



**న్యూఢిల్లీ, జనవరి 13:** బ్రిక్స్ 2026కు భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బ్రిక్స్ 2026 లోగో, అధికార వెబ్‌సైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జైశంకర్ మాట్లాడుతూ, "ఈ ఏడాది బ్రిక్స్ కూటమి సారథిగా ప్రపంచ సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తాం, కూటమిలోని అన్ని దేశాలను కలుపుకుపోయి ప్రపంచ సంక్షేమానికి కృషి చేస్తాం, అందరికీ వికాసం అనే లక్ష్యంతో ఈసారి బ్రిక్స్ సదస్సు నిర్వహిస్తున్నాం" అని వివరించారు. "ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, చాలా దేశాల నడుమ అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక సంక్షోభాలూ కనిపిస్తున్నాయి. ఈ పరిణామాల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలో కీలకమైన కూటమిగా బ్రిక్స్ ప్రాధాన్యం, బాధ్యత పెరుగుతున్నాయి. తాము సంప్రదింపులను, సహకారాన్ని, ఆచరణాత్మక స్పందనను ప్రోత్సహిస్తాం. ఇక ఇదే సమయంలో దేశాల వికాసం, జాతీయ ప్రయోజనాలపైనా ఫోకస్ పెడతాం" అని విదేశాంగ మంత్రి జైశంకర్ వివరించారు. ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరులో భారత్ వేదికగా బ్రిక్స్ సదస్సు జరిగే అవకాశాలు ఉన్నాయని సూచనప్రాయంగా వెల్లడించారు. జి20 సదస్సు నిర్వహణలో అనుసరించిన విధానాన్నే ఈసారి బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు అనుసరించనున్నట్లు తెలుస్తోంది. 28 రాష్ట్రాలు, తొమ్మిది కేంద్రపాలిత ప్రాంతాలలో సమావేశాలను నిర్వహించనుంది. బ్రిక్స్ నేతల శిఖరాగ్ర సమావేశంతోపాటు 60 నగరాల్లో మంత్రులు, ఫోరమ్‌లు, వర్కింగ్ గ్రూపులతో సహా దాదాపు 100 ఇతర సమావేశాలు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. విదేశాంగ మంత్రుల రెండు సమావేశాలు, ఒకటి జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో, నాలుగైదు షెర్పా లేదా సౌస్ షెర్పా సమావేశాలు, దాదాపు 20 మంత్రివర్గ సమావేశాలు జరిగే అవకాశముంది. దేశ రాజధానితోపాటు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, చండీగఢ్, అహ్మదాబాద్, లక్నో వంటి నగరాల్లో కొన్ని కీలక మంత్రివర్గ సమావేశాలు నిర్వహించనున్నారు.

# భారత్‌లో ఆరోగ్య ఉపద్రవంగా 'డయాబెటిస్'

**న్యూఢిల్లీ, జనవరి 13:** ఆరోగ్య సంక్షోభంగా పరిణమించిన మధుమేహం భారత్ పాలిట ఆర్థిక భారంగా మారుతోంది. డయాబెటిస్ కారణంగా అత్యధిక ఆర్థిక నష్టాన్ని చవి చూస్తున్న దేశాల జాబితాలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచిందని అంతర్జాతీయ పరిశోధనలో వెల్లడైంది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఏకంగా 11.4 ట్రిలియన్ డాలర్ల భారం పడుతోందని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ అప్లైడ్ సిస్టమ్స్ అనాలసిస్, వియన్నా యూనివర్సిటీ పరిశోధకులు స్పష్టం చేశారు. మధుమేహం వల్ల పడే ఆర్థిక ప్రభావాన్ని 2020 నుంచి 2050 వరకు విశ్లేషిస్తూ 204 దేశాలపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందులో 16.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, 11.4 ట్రిలియన్ డాలర్లతో భారత్ రెండో స్థానంలో, 11 ట్రిలియన్ డాలర్లతో చైనా మూడో స్థానంలో ఉన్నాయి. ప్రపంచం లోని మొత్తం బాధితుల్లో నాలుగో వంతు మంది భారత్‌లోనే ఉండటం ఈ తీవ్రతకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. మధుమేహం వల్ల దేశాల జీడీపీలో 1.7 శాతం మేర అనధికార సంరక్షణ వ్యయం రూపంలో వృథా అవుతోందని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా క్యాన్సర్, అల్జీమర్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల కంటే మధుమేహం వల్లే ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ నష్టం వాటిల్లుతోందని వారు హెచ్చరిస్తున్నారు. మధుమేహం కారణంగా పని ఉత్పాదకత తగ్గడం, వైద్యం కోసం భారీ గా ఖర్చు చేయాల్సి రావడం ప్రజల ఆదాయాన్ని గణనీయంగా తగ్గిస్తోంది. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంచాలని పరిశోధకులు సూచిస్తున్నారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు అందరికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు.

# షక్సాగామ్ ఒప్పందం చట్టవిరుద్ధం

### ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది




**న్యూఢిల్లీ,జనవరి 13:** కశ్మీర్ సమీపంలోని షక్సాగామ్ వ్యాలీ తమ దేశంలో భాగమని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి ఖండించింది. షక్సాగామ్ లోయను పాకిస్థాన్, చైనాకు అప్పగించటానికి సంబంధించి 1963లో ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ లోయ తమకే చెందుతుందని ఇటీవల చైనా పేర్కొంది. ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని చేపట్టడంలో తాము పూర్తిగా సరైన మార్గంలోనే ఉన్నామని తెలిపింది. ఈ నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ విధంగా స్పందించారు. షక్సాగామ్ లోయను చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదని ఆయన తేల్చి చెప్పారు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను కూడా తాము గుర్తించబోమని అన్నారు. చైనాపాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌ను ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగా తాము పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. షక్సాగామ్ లోయ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్రం వచ్చిన తర్వాత పాకిస్థాన్ దీనిని ఆక్రమించి, ఆపై చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరో దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. అక్రమించుకున్న ఈ లోయ ద్వారానే చైనాపాకిస్థాన్ మధ్య రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా, పాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌ను నిర్మిస్తున్నారు. షక్సాగామ్ లోయ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని తాము ఎప్పటికీ గుర్తించబోమని భారత్ స్పష్టం చేసింది. షక్సాగామ్ లోయ తమ దేశంలో భాగమేనని భారత్ పునరుద్ఘాటించింది. దీనిపై చైనా స్పందిస్తూ, ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని వాదించింది.

# పాతికేళ్లు పూర్తయ్యాయా.. మీ శిక్షాకాలాన్ని ఎలా లెక్కిస్తున్నారు?

### అబూ సలెంను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జనవరి 13:** తాను భారత్‌లో 25 ఏళ్ల జైలు శిక్ష పూర్తిచేసుకున్నానని 1993 నాటి ముంబయి వరుస పేలుళ్ల కేసులో దోషిగా తేలిన గ్యాంగ్‌స్టర్ అబూసలెం పేర్కొనడాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. 2005 నవంబరులో అతడు అరెస్టయిన సంగతిని గుర్తు చేసింది. అలాంటప్పుడు శిక్షాకాలాన్ని ఏ విధానంలో లెక్కిస్తున్నారని, శిక్ష తగ్గింపు కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారా అని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మా సనం ప్రశ్నించింది. ముంబయి పేలుళ్ల కేసులో మరణశిక్ష గానీ, పాతికేళ్లకు పైగా జైలుశిక్షకానీ విధించబోమన్న హామీపై అబూ సలెంను పోర్చుగల్ నుంచి భారత్ 2005 నవంబర్ 11న వెనక్కి రప్పించింది. సత్ప్రవర్తన కారణంగా తగ్గించే శిక్షా కాలాన్ని కలుపుకుని చూస్తే భారత్‌లో ఇప్పటికే తాను 23 ఏళ్ల జైలు జీవితాన్ని పూర్తి చేసుకున్నట్లవుతుందని, కాబట్టి తనను విడుదల చేయాలని అతడు తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. శిక్షాకాలం పూర్తయినట్లు కనిపించడంలేదంటూ ఆ వినతిని ఉన్నత న్యాయస్థానం నిరుడు జులైలో తోసిపుచ్చడంతో సుప్రీం తలుపు తట్టాడు. అయితే అబూ సలెం టాడా చట్టం కింద దోషిగా తేలిన సంగతిని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం గుర్తుచేసింది. శిక్ష తగ్గింపును ఆ చట్టం అనుమతిస్తుందా అని సందేహం వ్యక్తం చేసింది. దీంతో సంబంధిత నిబంధనలను ధర్మాసనం ముందు ఉంచుతానని అబూ సలెం తరఫు న్యాయవాది విన్నవించారు. అందుకు రెండు వారాల గడువు ఇచ్చి తదుపరి విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ముంబయికి చెందిన ప్రదీప్ జైన్ అనే బిల్డర్‌ను 1995లో హత్య చేసిన మరో కేసులో అబూ సలెంకు ప్రత్యేక టాడా కోర్టులో 2015 ఫిబ్రవరిలో జీవిత ఖైదు విధించారు.

# కెనడాలో భారీ బంగారం దోపిడీ కేసు..

### కీలక నిందితుడు భారత్‌లో!



**ఒట్టావా, జనవరి 13:** కెనడాలోని టొరంటో ఎయిర్‌పోర్టులో బంగారంతో ఉన్న ఓ కంటైనర్‌ను మూడేళ్ల క్రితం కొందరు దుండగులు దోపిడీ చేశారు. ఈ కేసులో ముమ్మర దర్యాప్తు చేస్తోన్న కెనడా పోలీసులు తాజాగా ఓ నిందితుడిని అరెస్టు చేశారు. అతడి పేరు అర్సలాన్ చౌదరీ అని వెల్లడించారు. అతడికి ఓ చిరునామా అంటూ ఏమీ లేదని, దుబాయి నుంచి టొరంటో పియర్సన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగగానే అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే ఈ కేసులో కీలక నిందితుడు సిమ్రన్‌ప్రీత్ పనేసర్ భారత్‌లోనే ఉన్నట్లు సమాచారం. 2023 ఏప్రిల్‌లో స్విట్జర్లాండ్ నుంచి ఓ కార్గో విమానం టొరంటో ఎయిర్‌పోర్టులో దిగింది. అందులోని ఓ కంటైనర్‌లో 400 కిలోల బరువైన 6,600 బంగారు కడ్డీలు ఉన్నాయి. అప్పట్లో వాటి విలువ 20 మిలియన్ కెనడియన్ డాలర్లు. బంగారంతోపాటు కంటైనర్‌లో 2.5 మిలియన్ కెనడియన్ డాలర్ల నగదు కూడా ఉంది. టొరంటోలోని ఓ బ్యాంక్‌లో భద్రపర్చేందుకు వీటిని తీసుకొచ్చారు. విమానం దిగగానే కంటైనర్‌ను ఎయిర్‌పోర్టులోని వేర్‌హౌస్ ఫెసిలిటీలో భద్రపర్చారు. అయితే, ఆ మరుసటి రోజు పోలీసులు వెళ్లి చూడగా.. కంటైనర్‌లోని బంగారం, నగదు మాయమైంది. కెనడా చరిత్రలోనే అతిపెద్ద దోపిడీగా అప్పట్లో ఈ ఘటన పెను సంచలనం సృష్టించింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా నకిలీ పత్రాలతో వేర్‌హౌస్‌లోని సిబ్బందే దాన్ని మాయం చేసినట్లు తెలిసింది. ఘటన సమయంలో ఇద్దరు భారతీయులు సిమ్రన్‌ప్రీత్, పరంపాల్ సిద్ధు వేర్‌హౌస్ ఫెసిలిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పోలీసులు వీరిద్దరితో సహా 9 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే పరంపాల్‌ను అరెస్టు చేయగా.. సిమ్రన్‌ప్రీత్ పరారీలో ఉన్నట్లు కెనడా పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు ఆ బంగారాన్ని పోలీసులు గుర్తించలేదు. కొంత మొత్తం నగదును మాత్రం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# ఉచితాలకంటే ప్రజల స్వయంసాధికారతకు ప్రాధాన్యం

### పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ ఈ కోవలోనివే: కేంద్ర మంత్రి పియూష్‌గోయల్

**రాజ్‌కోట్, జనవరి 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉచిత పథకాల పంపిణీ కంటే ప్రజలను వివిధ పథకాల సాయంతో సాధికారికంగా తీర్చిదిద్దడంపై విశ్వాసం తో ఉన్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల ఈకోవకు చెందినవేనని, వాటిని ప్రధాని స్వయంగా రూపొందించారని, అవి ఆయన ఆలోచనా విధానానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వాలు అందించే ఉచితాలపై ఆధారపడే విధానంపై ప్రధానికి నమ్మకం లేదని గోయల్ స్పష్టం చేశారు. ప్రభుత్వమే అన్నీ చేస్తుందన్న భావన తగ్గి, ప్రజలు కూడా బాధ్యత తీసుకునే విధంగా పథకాలు ఉండాలన్నదే ప్రధాని ఆలోచన అని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రధాని మోదీ పౌరులకు సాధికారత కల్పించారని ఆయన తెలిపారు. ఈ పథకం కింద సౌర ఫలకాల ఏర్పాటు కోసం వినియోగదారుడు కూడా కొంత ఖర్చును భరించాల్సి ఉంటుందని, ఇలాంటి పథకాలలో ప్రజల వ్యక్తిగత భాగస్వామ్యం ఉండాలని ఆయన చెప్పారు. ప్రభుత్వమే అన్నీ చేయాలని ప్రజలు ఆశించకూడదని, ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ఒక పథకం విజయవంతంగా అమలవ్వాలంటే ప్రభుత్వ మద్దతుతో పాటు పౌరుల భాగస్వామ్యం అవసరమన్నారు.

# 'జననాయగన్'ను కేంద్రం అడ్డుకుంటోంది

### రాహుల్ గాంధీ ఫైర్.. ప్రధానిపై విమర్శలు



**న్యూఢిల్లీ, జనవరి 13:** ప్రముఖ నటుడు విజయ్ నటించిన జననాయగన్ సినిమా వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సినిమాను కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. తమిళ సంప్రదాయాలపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని, విజయ్ సినిమా విడుదల కాకుండా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ అడ్డుకుంటోంది. అధి కారంతో తమిళ ప్రజల గొంతును నొక్కాలని ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారు. అది ఎప్పటికీ సాధ్యం కాదు అని రాహుల్ విమర్శించారు. హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్‌కు యు - ఎ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాస్ హైకోర్టుసింగిల్ బెంచ్ ఆదేశాలు జారి చేసింది. కోర్టు ఉత్తర్వులను విజయ్ అభిమానులతో సహా చిత్ర బృందం ఊపిరి పీల్చుకుంది. ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. తీర్పును సవాల్ చేస్తూ సిబిఎఫ్‌సి మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.

## సంక్షిప్తంగా..

### ఇరాన్‌లో నిరసకారునికి మరణశిక్ష



టెహ్రాన్, జనవరి 13: ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఆందోళనల్లో పాల్గొన్నందుకు అరెస్ట్ అయిన 26 ఏళ్ల ఎర్ఫాన్ సుల్తానీ అనే యువకుడికి ఉరిశిక్ష అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలకు సంబంధించి మరణశిక్ష అమలు చేయడం ఇదే తొలిసారి కానుండటంతో సర్వత్ర ఆందోళన వ్యక్తమవుతోంది. టెహ్రాన్ సమీపంలోని కరాజ్ సబర్బ్‌లో నివసించే ఎర్ఫాన్ సుల్తానీని ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నందుకు ఈనెల 8న అరెస్ట్ చేశారు. కేవలం కొన్ని రోజుల్లోనే విచారణ ముగించి అతనికి మరణశిక్ష విధించారు. బుధవారం ఈ శిక్షను అమలు చేయనున్నట్లు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

### బంగ్లాదేశ్‌లో హిందూ ఆటోడ్రైవర్ హత్య

**ఢాకా, జనవరి 13:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకూ ఎనిమిది మంది హత్యకు గురికాదా తాజాగా మరో హిందువును దారుణంగా కత్తులతో పొడిచి చంపారు. ఫెనీ జిల్లాలో సమీర్ దాస్ (27) అనే హిందూ ఆటో డ్రైవర్‌ను దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. దగన్‌భుయాన్ ఉపజిల్లాలోని జగత్‌పూర్ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఆతడి మృతదేహం రక్తపు మడుగులో లభ్యమైంది. ఆదివారం సాయంత్రం సమీర్ దాస్ తన ఆటో రిక్షాతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం పొలాల్లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమీర్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తులతో పొడిచి చంపినట్లు తెలుస్తోంది.

### 'బంగ్లాలో హిందువులకు ప్రత్యేక పోలింగ్ బూత్ కావాలి'



**ఢాకా, జనవరి 13:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో.. ఆ దేశంలోని ప్రముఖ హిందూ సంఘం అక్కడి ఎన్నికల కమిషన్‌తో సమావేశమైంది. ఫిబ్రవరిలో పార్లమెంటరీ ఎన్నికలు జరగన్ను వేళ.. హిందూ ఓటర్లకు ఎన్నికల సంఘం అదనపు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో తమకు రక్షణ లేదని.. ముఖ్యంగా మైనారిటీలపై దాడులు జరుగుతోన్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొంది. సురక్షితమైన ఓటింగ్ కోసం తమకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు.

### ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి నేతలతో చైనా కమ్యూనిస్టుల భేటీ



**న్యూఢిల్లీ,జనవరి 13:** రాజధానిలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలోచైనా కమ్యూనిస్టు ప్రతినిధిబృందం ఉన్నతస్థాయి ప్రతినిధులతో భేటీ అయింది. ఆర్‌ఎస్‌ఎస్‌లో సెకండ్ ఇన్ కమాండ్‌గా ఉన్న దత్తాత్రేయ హోసబాలేతో సమావేశం అయింది. చైనా అంతర్జాతీయ విభాగం పమంత్రి సన్ హైయాన్ అద్యక్షతన ఉన్న బృందం ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో సుమారు రెండుగటలపాటు ఉన్నతస్థాయి ప్రతినిధులతో భేటీ అయింది. ఇది కేవలం మర్యాదపూర్వక కలయిక మాత్రమే అని ఇరువైపులా ప్రకటించారు. చైనీయులవైపునుంచే విజ్ఞప్తిరావడంతో ఆర్‌ఎస్‌ఎస్ మర్యాదపూర్వకంగా స్వాగతించిందని ఆర్‌ఎస్‌ఎస్ నేత అరుణ్‌సింగ్ తెలిపారు. 2014లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి చైనా కమ్యూనిస్టు ప్రతినిధిబృందం ఆర్‌ఎస్‌ఎస్‌నేతలతో సమావేశం కావడం ఇదే ప్రథమం.

# 'మిల్‌బస్' దెబ్బకు పాక్‌ను వీడుతున్న పరిశ్రమలు!



**ఇస్లామాబాద్, జనవరి 13:** పాకిస్తాన్ పారిశ్రామిక, ఆర్థికసేవలరంగంలో సైన్యం పెత్తనం మితిమీరిపోవడంతో విదేశీ సంస్థలు దేశంనుంచి నిష్క్రమిస్తున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లుసైతం సైనిక పెత్తనం భరించలేక దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు విముఖంగా ఉన్నారు. ఎఫ్‌ఎంసిజి దిగ్గజం ప్రాక్టర్ గ్యాంబుల్ పీఅండ్‌జి, ఇంధన రంగంలో ప్రసిద్ధి చెందిన షెల్, టోటల్ ఎనర్జీస్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను విక్రయించి వెళ్లిపోయాయి. టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఫార్మా కంపెనీలు ఫైజర్, బేయర్, ఎలీ లిల్లీ, ఆటోమొబైల్ సంస్థ యమహా, రైడ్ షేరింగ్ యాప్‌లు ఉబెర్, కరీమ్, జర్మన్ ఇంజనీరింగ్ సంస్థ సీమెన్స్ కొనసాగలేమని చేతులెత్తేశాయి. గత మూడేళ్లలో ఫార్మా, టెక్ రంగాలకు చెందిన 21కి పైగా కంపెనీలు దేశాన్ని వీడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దిగుమతులపై ఆంక్షల కారణంగా యమహా తన ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కంపెనీల వలసలకు అనేక ఆర్థిక, రాజకీయ కారణాలున్నాయి. పాకిస్థానీ కరెన్సీ విలువ పడిపోవడం, అధిక ద్రవ్యోల్బణం, విద్యుత్ కోతలు, బలహీనమైన వినియోగదారుల డిమాండ్ వంటివి కంపెనీల లాభాలను దెబ్బతీస్తున్నాయి. రాజకీయ అస్థిరత, పెరుగుతున్న ఉగ్రవాదం, శాంతిభద్రతల సమస్యలు వ్యాపారాలకు పెనుభారంగా మారాయి. అధికార జాప్యం, అవినీతి, తరచూ మారే పన్ను విధానాలు దీర్ఘకాలిక ప్రణాళికలను మారుస్తున్నాయి. 2023లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 1.2 బిలియన్ డాలర్లకు పడిపోయి, పదేళ్ల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఈ సమస్యలన్నింటికీ మూల కారణం పాకిస్థాన్‌లో సైన్యం నడిపే సమాంతర ఆర్థిక వ్యవస్థ. దీనిని మిల్‌బస్ అని పిలుస్తున్నారు. రియల్ ఎస్టేట్, సిమెంట్, ఎరువులు, బ్యాంకింగ్ వంటి కీలక రంగాల్లో సైన్యం వేల కోట్ల డాలర్ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఫౌజీ ఫౌండేషన్ వంటి సైనిక సంస్థలకు పన్ను మినహాయింపులు, నియంత్రణల నుంచి రక్షణ, ప్రభుత్వ కాంట్రాక్టులలో ప్రాధాన్యత లభిస్తున్నాయి. ఇవి విదేశీ కంపెనీలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. సమాన అవకాశాలు లేని ఈ రంగంలోకి ప్రవేశించడానికి విదేశీ పెట్టుబడిదారులు భయపడుతున్నారు. సైన్యం నేతృత్వంలోని స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ కౌన్సిల్(ఎస్‌ఐఎఫ్‌సి కూడా సైనిక అనుబంధ సంస్థలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో పారదర్శకత పూర్తిగా లోపించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మిలిటరైజ్డ్ కామర్స్ కారణంగా పాకిస్థాన్ పెట్టుబడులకు స్వర్గధామంగా కాకుండా, అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా మారిపోయింది. పెట్టుబడిదారులు యూఏఈ, సింగపూర్ దేశాల వైపు చూస్తున్నారు.

14-1Pg6exHMNWJQE.qxd:14-1Pg6exHMNWJQE.qxd 1/1/02 6:23 AM Page 1





## భృంగివాహనంపై శ్రీస్వామిఅమ్మవార్లు

శ్రీశైలంప్రాజెక్టు, జనవరి 13 ప్రభాతవార్త: శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల రెండవ రోజున శ్రీస్వామి అమ్మవార్లు భృంగివాహనంపై ఉరేగారు. ఏడు రోజుల పాటు నిర్వహించబడే బ్రహ్మోత్సవాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో బాగంగానే యాగశాల యందు శ్రీచండీశ్వరస్వామివారికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కలా ్యణం కోసం చతుర్వేద పారాయణలు, జపాలు, రుద్ర పారాయణ చేశారు. తరువాత మండపారా ధనలు, పంచావరణార్చనలు, రు ద్రహోమం కార్యక్రమాలు ఆగమ శాస్త్రాం ప్రకారంగా జరిపించబడ్డాయి. అదేవిధంగా సాయంకాలం ప్రదోశకాలపూజలను, హోమాలను జరిపించి తరువాత జపానుష్టానాలు నిర్వహించారు. వాహనసేవలలో భాగంగా శ్రీస్వామిఅమ్మవారి ఉత్సవ మూర్తులను అక్కమహాదేవి అలంకారమండపంలో భృంగి వాహనంపై వేంచేపు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత గంగధర మండపం నుండి పురవీధుల్లో గ్రామోత్సవం జరిపించబడింది. గ్రామోత్సవములో జానపద కళారూపాల ప్రదర్శన, కోలాటం తదితర కార ్యక్రమాలు నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు దంపతులు, అర్చకులు, వేదపండింతులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఢిల్లీలో సంక్రాంతి సంబరాలు

ఇంద్రకీలాద్రి, జనవరి 13 ప్రభాతవార్త: న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో కొలువైన కనకదుర్గమ్మ వారి ప్రతిరూప ఆలయంలో సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు సంబంధించి అలంకరణ పనులను దుర్గగుడి సూపరింటెండెంట్ జగదీష్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం పరవేక్షిస్తోంది. ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ వారి తరహాలోనే, ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఉన్న ఈ ప్రతిరూప ఆలయంలో కూడా అదే సంప్రదాయ రీతిలో పూజా కార్యక్రమాలు, అలంకరణలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి వేడుకల కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### దుర్గమ్మవారి ఆలయంలో ఆన్‌లైన్ సేవలకు ప్రోత్సాహం

భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ సేవలు నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహిస్తున్న ఏపీ ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ అత్యాధునిక డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని తగ్గించి, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష ్యంగా దర్శన టిక్కెట్లు, సేవా పూజలు మరియు వసతి సౌకర్యా లను ఆన్‌లైన్ ద్వారా పొందే వెసులుబాటును మన మిత్ర వాట్సప్ కల్పించింది. 9552300009 ఈ నంబర్‌కు వాట్సప్ సందేశం పంపడం ద్వారా దర్శనం, ప్రసాదం మరియు ఇతర పూజా సేవల వివరాలను తక్షణమే పొందవచ్చు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపిటెంపుల్స్.ఏపి.జివోవి.ఐఎన్ సందర్శించి ముందస్తుగా దర్శన టిక్కెట్లు, శీఘ్ర దర్శనం మరియు ప్రత్యేక దర్శన టిక్కెట్లు, సేవా పూజలు, శ్రీఅమ్మవారికి నిర్వహించే వివిధ ఆర్జిత సేవలు, వసతి, దేవస్థాన సత్రాలలో గదుల కేటాయింపు సేవలను బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ బుకింగ్‌పై అవగాహన లేని భక్తుల కోసం ఇంద్రకీలాద్రి ప్రాంగణమంతటా ప్రత్యేకంగా ఆన్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ మరియు కార్డ్, నెట్ బ్యాంకింగ్ చెల్లింపుల సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తులు దళారులను నమ్మి మోస పోకుండా, ప్రభుత్వం కల్పించిన ఈ అధికారిక వెబ్‌సైట్ మరియు వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని దేవస్థానం అధికారులు కోరుతున్నారు.

### నిత్య అన్నదాన విరాళ దాతలు

శ్రీ కనకదుర్గమ్మ వారి నిత్య అన్నదాన పథకానికి చీరాలకు చెందిన యం.రామ కౌశిక్, యశస్విని దంపతులు తాత నాగేశ్వరరావు, మనవరాలు ప్రజురాజశ్రీ కుటుంబ సభ్యుల పేరు మీద రూ. 2,00,000/లు విరాళంగా ఈవో శీనా నాయక్‌కు అందించారు. దాతలకు ఆలయ శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, శ్రీఅమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటాన్ని బహుకరించారు. వేదపండితు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

### భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరణ

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన భవనంలో నాణ్యత ప్రమాణాలను ఆలయ పాలకమండలి, అధికారులు తనిఖీ చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు సభ్యులు స్వయంగా భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు మెరుగైన, నాణ్యమైన అన్నప్రసాదం అందించడమే లక్ష ్యంగా ఈ పర్యవేక్షణ చేపట్టామని ఈఓ, ఛైర్మన్ పేర్కొన్నారు.

### సంక్రాంతి ఉత్సవాలకు ముస్తాబు

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఈనెల 14నుండి సంక్రాంతి పండుగను వేడుకగా, వైభవంగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈనెల 14న బోగి పండుగ సందర్భంగా ఉదయం 5 గంటలకు బోగి మంటలు నిర్వహిస్తామని ఇఓ తెలిపారు.

# ఇక కనకదుర్గమ్మ దర్శనానికి ఇబ్బందులుండవు

**అందుబాటులోకి రానున్న సేవల టిక్కెట్ల చెల్లింపుల్లో సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌లు**



విజయవాడ. జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ సేవలో తరించేందుకు భక్తులకు కీలక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి.దుర్గగుడిలో దర్శనాలు, ఇతర సేవల టిక్కెట్ల చెల్లింపుల్లో సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ అందుబాటులోకి రానున్నాయి. ఇకపై అన్నీ సేవలనూ పూర్తిగా డిజిటల్ పేమెంట్లలోకి మార్చేయనున్నారు. కియోస్క్ యంత్రాల ద్వారా భక్తులు టికెట్లు అన్నీ అత్యంత తేలికగా తీసుకునే సౌలభ్యం రాబోతోంది.
కరూర్ వైశ్యా బ్యాంకు ఆధ్వర్యంలో తొలిదశలో 4 యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇవి ఇప్పటికే ఆలయానికి వచ్చేశాయి. ఇకనుంచి భక్తులకు సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌లు, డిజిటల్ చెల్లింపుల గురించి విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా నిరంతరం ఆలయ పరిసరాల్లో కూడా ప్రచారం చేస్తారు. కియోస్క్‌ల వద్ద వాలంటీర్లను నియమించనున్నారు. వారిచే భక్తులకు మార్గనిర్దేశం చేయనున్నారు.
ఇప్పటికే దుర్గగుడిలో సేవలు పూర్తిగా డిజిటల్ రూపంలోకి మార్చారు. క్యూలైన్లలో నిలబడి, చిల్లర కోసం వెతుక్కునే ఇబ్బంది లేకుండా చేశారు. దర్శనం టిక్కెట్లు, ప్రత్యేక పూజలు, ఆర్జిత సేవలు, ప్రత్యక్ష, పరోక్ష సేవలు అన్నింటిని ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకునే సౌకర్యం భక్తులకు కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వసతి గదుల కోసం సైతం డిజిటల్ పేమెంట్ చేయాల్సిందే.
చివరకు కేశఖండన టిక్కెట్లు, ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా డిజిటల్ చెల్లింపులే అందుబాటులోకి తీసుకువచ్చారు. హుండీ కాకుండా, ఆలయానికి ప్రత్యేకంగా ఇచ్చే విరాళాలను కూడా ఇకపై ఆన్‌లైన్ ద్వారానే స్వీకరించనున్నారు. ఈ డిజిటల్ నిర్ణయం వెనుక కూటమి ప్రభుత్వం బలమైన లక్ష్యాన్ని పెట్టుకుంది. టిక్కెట్ల విక్రయాల్లో ఇప్పటి వరకు జరుగుతున్న చిన్న చిన్న అవకతవకలకు అడ్డుకట్ట వేయడమే దీని ప్రధాన ఉద్దేశం. కౌంటర్ల వద్ద భౌతికంగా టికెట్లు ఇస్తుండటంతో, అక్కడక్కడా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి వాటికి ఇకపై చెక్ పెడుతున్నారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్, లిఫ్ట్ ప్రాంతాల్లో భక్తుల రద్దీ ఉండే చోట వీటిని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదించారు. సంక్రాంతి పండగ తర్వాత కియోస్క్‌లను బిగించనున్నారు. దుర్గగుడిలో అన్ని సేవల వివరాలు, ధరలతో సహా టిక్కెట్లను కియోస్క్‌లలో నిక్షి ప్తం చేస్తారు. మొదటగా క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. ఆ తర్వాత అన్నిరకాల ఆన్‌లైన్ పేమెంట్లను చేస్తే, తేలికగా టికెట్లను పొందేలా సాఫ్ట్‌వేర్ సైతం రూపొందించారు. ఈ బాధ్యతను ప్రస్తుతం టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సేవలు అందిస్తున్న డిజిసాఫ్ట్ ఇన్‌సైట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కే అప్పగించారు. తిరుమలలో ఇప్పటికే ఈ కియోస్క్‌ల ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అక్కడ దాతల నుంచి విరాళాల సేకరణకు కూడా టీటీడీ వీటిని వాడుతున్నారు. ఆ తరహాలోనే ఇక్కడ కూడా వీటిని ఏర్పాటు చేయనున్నారు. తొలిగా 4 యంత్రాలను పెట్టి, దశల వారీగా పూర్తిగా డిజిటల్ పేమెంట్లు చేసేలా మార్చనున్నారు. అందుకే ప్రస్తుతానికి డబ్బులు చెల్లించి టిక్కెట్లు కొనేందుకు పరిమితంగా ఒకటి లేదా రెండు మాత్రమే సింగిల్ విండో కౌంటర్లు ఉంచుతారు. సెల్‌ఫోన్‌ను భక్తులు కౌంటర్లలో భద్రపరచడానికి వీలుగా ముందే టిక్కెట్లను తీసుకునే ప్రాంతాల్లోనే ఈ కియోస్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని దేవాదాయశాఖ ఆదేశించింది. భక్తులు సులభంగా చేరుకునేలా, అందరికీ స్పష్టంగా కనిపించేలా రద్దీ ప్రాంతాల్లో వీటిని పెట్టనున్నారు.

# శ్రీకాళహస్తిలో సంక్రాంతి సంబరాలు

**- రోడ్లన్నీ జనమయం... దుకాణాలు కిటకిట - ట్రాఫిక్ సమస్యలు... జనం బేజారు**



శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త: 'రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు నిరుపేదల జీవితాల్లో సంక్రాంతిని సంతరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెంచిన పెన్షన్ నిరుపేదలకు పండగ సంబరాలకు ఊతం ఇస్తుంది. దాంతో నిరుపేదల్లో కొనుగోలు శక్తిని పెంచుతుంది. ఈ ఏడాది సంక్రాంతి వ్యాపారాలు ఆదివారం వరకు వెలవెల బోయినా సోమవారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా పట్టణంలోని ఓ మాల్ ఆఫర్స్‌తో అదుర్స్ కల్గిస్తుంది. దాంతో వందలాది బట్టల షాపుల్లో గతంలో ఇసుకేస్తేరాలనంత రద్దీ ఉండేది. ఈ ఏడాది పానగల్, నెహ్రహూ వీధుల్లో మాల్స్ ఏర్పాటుతో దుకాణాలు వెల వెల బోతున్నాయి. పట్టణంలో రోజు రోజుకు బట్టల షాపుల సంఖ్య పెరుగుతుంది.అయినా రద్దీ తగ్గటం లేదు. మంగవారం పట్టణంలోని నె హ్రూవీధి, పాత నెల్లూరు బసా ్టండు, ఆర్‌టిసి సర్కిల్ వద్ద జనం గుంపులు, గుంపులుగా కనబడ్డారు. శ్రీకాళహస్తిలో పండగల సందర్భంగానే కాకుండా సాధారణ సమయాల్లో కూడా ట్రాఫిక్ స్థంభిస్తుంది. పోలీసులు వన్‌వే ట్రాఫిక్‌ను రకరకాలుగా అమలు చేస్తున్నారు. పాత నెల్లూరుబస్టాండు నుంచి పెద్దమసీదు వీధిలో నుంచి ట్రాఫిక్‌ను మళ్ళించారు. ఇక్కడ ముఖ్యంగా ఓ టోకు నూనె వ్యాపారి, మరో ట్రాన్స్‌పోర్టు తో ప్రతినిత్యం సమస్యగా మారింది. బుధవారం మధ్యాహ్నం రద్దీ సమయంలో నూనె టోకు వ్యాపారి లారీని నడిరోడ్డు మీద నిలబెట్టి అన్‌లోడ్‌చేసుకుంటూ గంటల తరబడీ నిలబెట్టడంతో వాహన చోదకుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. ఇక పెద్దమసీదు వీధి చివరన జయరామారావు వీధి మలుపు వద్ద ఓ బేకరి, మరో ఫ్రూట్ స్టాల్ ఎదురుగా పార్కింగ్ సదుపాయం లేదు. అయితే అక్కడ మలుపు ఇటు అటు వచ్చే వాహనాలు కలుస్తాయి. ఇక దుకాణాలకు పార్కింగ్ లేనందు వల్ల వాహన చోదకులు తలలు పట్టుకుంటున్నారు. మరి పోలీసులు ఈ రెండు దుకాణాల వద్ద ఎందుకు మౌనం వహిస్తారో ముక్కంటీశునికే ఎరుక. ఇలా ప్రతి నిత్యం జనం ట్రాఫిక్‌తో తల్లడిల్లుతున్నారు. బుధవారం పండగ కొనుగోళ్ళకు వచ్చిన జనంతో గందరగోళంగా మారింది.

# గండికోట ఉత్సవాల్లో అంబరాన్నంటిన సంబరాలు

**సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జానపద కార్యక్రమాలు**





కడప, జనవరి 13 ప్రభాతవార్త: గండికోట ఉత్సవాలు 2026లో భాగంగా మూడో రోజు మంగళవారం కార్యక్రమాల కోలాహలం. రఘుకుల తిలకా రామ... అంటూ సాగిన జానపద గానం.. సంక్రాంతి వచ్చిందే.... తుమ్మెద అంటూ.. మహిళలు కోలాటంతో సంక్రాంతి పండుగను ముందుగానే గుర్తు చేశారు. జమ్మలమడుగు అమ్మాయిలు చేసిన డాన్స్ ఆకట్టుకున్నది. గండికోట ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసిన సందర్శకులు, పర్యాటకులు. ఉత్సవాలను తిలకిస్తున్న ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తదితరులు పెద్ద ఎత్తున పర్యాటకులు. గండికోట వైభవం వారి చరిత్ర, రాజ వంశం వివరాలు, సహజ సిద్ధంగా ఉన్న పెన్నానది గండికోటకు రక్షణ నిలిచిన అంశం. గండికోట చరిత్ర, వారి రాజసం, యుద్ధపటిమ, తదితర అంశాలను సౌండ్ అండ్ లైట్ షో ద్వారా తెలియజేశారు.

### పర్యాటకులను ఆకట్టుకొంటున్న డోమ్

గండికోట చరిత్ర వారి రాజవంశం గురించి 3డి షోను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వారి కుటుంబ సభ్యులు తిలకించారు. గండికోట ఉత్సవాలు భాగంగా గండికోట చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే చిత్రకళా పోటీల్లో.. చిత్రలేఖనం, పెన్సిల్ ఆర్ట్, పెయింటింగ్ ద్వారా.. చిత్రీకరించిన చిత్రాలను ప్రత్యేక స్టాళ్లలో ప్రదర్శించారు. ఈ చిత్రాలు సందర్శకులను ప్రత్యేకంగా ఆలోచింపజేయడమే కాకుండా ఆకట్టుకుంటున్నాయి.

### మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డికి ఘన సన్మానం

కడుపుబ్బ నవ్విస్తూ శివారెడ్డి చేసిన మిమిక్రీని పెద్దలు, పిల్లలు ఆస్వాదించారు. నందమూరి తారక రామారావుతో మిమిక్రీ ప్రారంభించి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, తరువాత చిరంజీవి, బాలకృష్ణ వాయిస్, కృష్ణంరాజు, నాగార్జున, కమెడియనులు వాయిస్‌ను మిమిక్రీ చేసి అందరినీ అలరించారు. మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డిని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపేష్ రెడ్డి, జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున పర్యాటకులు పాల్గొన్నారు.

# అనంతపురంలో దౌర్జన్యకాండ

**- ఎగ్జిబిషన్ నిర్వాహకులపై, మద్యం దుకాణం పై దాడి**
**- కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన ఎస్పీ**

అనంతపురం, జనవరి 13 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వర్గీయులు రెండు సంఘటనలో దాడులు చేశారని బలంగా ఆరోపణలు వస్తున్నాయి. ఎగ్జిబిషన్ నిర్వాహకులపైన, ఓ మద్యం దుకాణం పైన దాడి చేసిన సంఘటనలు చర్చనీయాంశంగా మారాయి. నగరంలోని రుద్రంపేట వద్ద నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ నిర్వాకుడు పకృదిన్, ఆయన అన్న కుమారుడు, కార్మికులపై ఎమ్మెల్యే వర్గీయులు దాడి చేసిన సంఘటనలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గన్‌మెన్ షేక్షావలి పై జిల్లా ఎస్పీ జగదీష్ సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ సంఘటనలో ఎమ్మెల్యే వర్గీయులతో పాటు గన్‌మెన్ కూడా బెదిరించారనే కారణంతో, గొడవ జరిగే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో గన్‌మెన్‌పై కూడా జిల్లా ఎస్పీ తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం జరిగిన ఎగ్జిబిషన్ వద్ద జరిగిన గొడవ, వివాదంపై ఎగ్జిబిషన్ నిర్వాకుడు పకృదీన్, బాధితులు ప్రత్యేకంగా నాలుగవ పట్టణ పోలీసులకు, అనంతపురం డిఎస్పికి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పోలీస్ అధికారులు ఈ సంఘటనపై తీవ్రంగా అన్నీ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు డబ్బులు ఇవ్వాలని ఎమ్మెల్యే వర్గీయులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇవ్వనందుకే బెదిరింపులకు పాల్పడుతున్నారని, నేను తెలుగుదేశం పార్టీ పార్టీలో ఉన్నానని, కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేశామని, అయినప్పటికీ ఎమ్మెల్యే వర్గీయులు దాడులు చేయడం ఏంటని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం అనంతపురం నగరంలోని ఓ మద్యం దుకాణానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన సంఘటన అలజడి రేపుతోంది. అనంతపురం నగరంలో జాతీయ రహదారి సమీపంలోని డీమార్ట్ ఎదురుగా ఉన్న నంబూరి వైన్స్ దుకాణాన్ని తెల్లవారుజామున 3గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అక్కడున్న వాచ్‌మెన్ మంటల్ని చూసి అప్రమత్తమయ్యారు. వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. బయట ఉన్న ఆటోను కూడా కాల్చివేసే ప్రయత్నం జరిగినట్టు తెలుస్తోంది. సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందన్న నంబూరి వెంకటరమణ చెబుతున్నారు. ఇది షార్ట్ సర్క్యూట్ వలన కలిగిన ప్రమాదం కాదని.. కుట్రపూరితంగానే జరిగిందని చెప్పారు. తనకు మద్యం దుకాణం తగిలినప్పుడే ఎమ్మెల్యే సన్నిహితుడు గంగారం తనను బెదిరించారని, డబ్బులు కోసం డిమాండ్ చేస్తున్నారని, ఎమ్మెల్యే వర్గీయుల పని అని మద్యం దుకాణం యజమాని నంబూరి వెంకటరమణ చెబుతున్నారు. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, హార్డ్ డిస్క్ చూస్తే ఇది ఎవరి పని అని తెలుస్తుందని చెప్పారు. అయితే మద్యం దుకాణంపై దాడి కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గీయుల దాడి చేశారని పోలీసు ఉన్నతాధికారులకు బాధితులు చెప్పినట్లు సమాచారం. ఈ సంఘటనపై కూడా పోలీసు అధికారులు సిసి పుటేజులు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అనంతపురంలో వరుస సంఘటనలు చర్చనీయాంశంగా మారాయి. అయితే ఎమ్మెల్యే వర్గీయులు మాత్రం ఈ సంఘటనలతో తమకు సంబంధం లేదని, అనవసరంగా కొందరు టిడిపి నాయకులు కుట్ర చేస్తున్నారని, దుష్ప్రచారం చేస్తున్నారని చెబుతున్నారు.

### టిడిపి నేత గంగారం బెదిరించారు అంటున్న బాధితులు

అనంతపురం నగరంలోని రుద్రంపేట బైపాస్ వద్ద ఉన్న ఎగ్జిబిషన్ నిర్వాహకులపై దాడి చేసిన సంఘటన రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రధాన అనుచరుడు గంగారాం వర్గీయులు ఎగ్జిబిషన్ వద్ద బీభత్సం సృష్టించారు అని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఫకృద్దీన్ జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో రాత్రి 8గంటల సమయంలో 10మంది వ్యక్తులు మద్యం సేవించి ఎగ్జిబిషన్ వద్దకు వచ్చారని.. అక్కడ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఎగ్జిబిషన్ సిబ్బంది అడ్డుకున్నారన్నారు. ఈ క్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. ఫోన్ ద్వారా ఎమ్మెల్యే అనుచరుడు గంగారాంతో ఫోన్‌లో మాట్లాడించగా గంగారాం కూడా దుర్భాషలు ఆడారని ఎగ్జిబిషన్ ఓనర్ ఫకృద్దీన్ అన్నారు. ఆ తర్వాత హరి, సాంబ, ఎమ్మెల్యే గన్‌మెన్ షెక్షావలి వచ్చి దాడి చేశారన్నారు. సోమవారం ఉదయం కూడా ఎమ్మెల్యేతో మాట్లాడుకోవాలని బెదిరిస్తున్నారన్నారు. తాను గత కొన్నేళ్లుగా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నా ఎప్పుడూ ఇలాంటివి చూడలేదన్నారు. గత ఏడాది కూడా ఎమ్మెల్యే వర్గీయులు 10లక్షలు డిమాండ్ చేశారని.. ఈ ఏడాది కూడా 10లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు ఫకృద్దీన్ వాపోయారు. అయితే ఎమ్మెల్యే దగ్గుపాటిని రాజకీయంగా దెబ్బతీయడానికి గత కొన్ని రోజులుగా కుట్రలు జరుగుతున్నాయని అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులే మూకుమ్మడిగా గురు అనే వ్యక్తిపై దాడి చేశారని.. వారి కేసు నమోదమవుతుందన్న భయంతో రివర్స్ డ్రామా ఆడారన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి, ఆయన ఎదుగుదలను చూసే ఇలా చేస్తున్నారని.. పార్టీ అధిష్టానం ప్రతిదీ గమనిస్తోందన్నారు.



స్వర్ణముఖి తీరాన పరిశీలిస్తున్న ఛైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు

## శివయ్య భక్తులకు సకల సదుపాయాలు

**- స్వర్ణముఖి ఘాట్ వద్ద తర్పణాలు వదలటానికి ఏర్పాట్లు**
**- ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టెసాయి ప్రసాద్**

శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త: భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టెసాయి ప్రసాద్ ఆలయాధికారులను సూచించారు. మంగళవారం ఆయన తన సహచర బోర్డు సభ్యులతో కలసి సువర్ణముఖి ఘాట్ పరిసరాలను పరిశీలించారు. బిజెపి నాయకుడు రమేష్ ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. నది ఆనకట్ట పై వ్యర్థాలు పొయటంతో అసహ్యంగా ఉండటం గమనించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న స్వర్ణముఖి ఘాట్ వద్ద సంక్రాంతి పండగ, అమావాస్యల సందర్భంగా తర్పణాలు వదలటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ కనీస సదుపాయాలు లేనందువల్ల తర్పాణాలు వదిలే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం విదితమే ఈ అంశాన్ని ఇటీవల బిజెపి నాయకుడు గరికపాటి రమేష్ తదితరులు ఛైర్మన్ కొట్టె సాయికి వినతి పత్రం అందించారు. ఇందులో ప్రధానంగా నదీ ఒడ్డున సరైన సదుపాయాలు లేకపోవటం అలాగే స్థలం లేకపోవటంతో గాలి గోపురం, సన్నిధివీధి, రాఘవేంద్ర స్వామి మఠం పరిసరాల్లో రోడ్లమీదనే తర్పాణాలు వదిలే దుస్థితి చోటు చేసుకుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డు ఓ డస్ట్ డంపింగ్ యార్డుల మారటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాబట్టి ఇక్కడ చెత్తలు వేయకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టెసాయి, సభ్యుడు రాఘవయ్య, పగడాల మురళి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు. ఇక్కడ ఉన్న పరిస్థితిని సమీక్షించారు. దానిని బాగు చేయటానికి చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ దేవస్థానం ఇంజనీరింగ్ విభాగానికి సూచించారు.



## అశ్రునయనాల మధ్య 'గుండ' అంతిమయాత్ర

**- అరసవిల్లిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**
**- తరలివచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు**

శ్రీకాకుళం, జనవరి 13 ప్రభాతవార్త: రాజకీయ దిగ్గజం, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అంత్యక్రియలు మంగళవారం అరసవిల్లి శ్మశాన వాటికలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరిగాయి. ఆయన భౌతికకాయం వద్ద వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా అంజలి ఘటించారు. అనంతరం పోలీస్ దళాలు, బ్యాండ్ పార్టీల మధ్య గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా చితికి నిప్పంటించారు. ఈ అంతిమ సంస్కారాల కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొని నివాళి అర్పించారు. పాలనా యంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మహేశ్వర్ రెడ్డి, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష హాజరై అప్పల సూర్యనారాయణ సేవలను స్మరించుకున్నారు.

### రాజకీయాలకు అతీతంగా నివాళి

అప్పల సూర్యనారాయణకు తుది వీడ్కోలు పలికేందుకు పలువురు శాసనసభ్యులు తరలివచ్చారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు అప్పల సూర్యనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ సభాపతి తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణ ప్రసాద రావు, ధర్మాన కృష్ణదాస్, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తల అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర ముగిసింది.



## ట్రంప్‌ను ప్రపంచ బహిష్కరణ చేయాలి

తిరుపతి, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రపంచ బహిష్కరణ చేయాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ట్రంప్ చర్యలకు వ్యతిరేకంగా మంగళవారం తిరుపతి బైరాగిపట్టెడ కూడలిలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి, అమెరికా తీరును ఖండిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ, ట్రంప్ వ్యవహారిస్తున్న తీరు ప్రపంచాన్నే ఇబ్బందుల్లోకి నెట్టేలా ఉందని మండిపడ్డారు. ప్రజాభీష్టం మేరకు ఎన్నికైన ఒక దేశాధ్యక్షుడిని, అతని భార్యను రాత్రికి రాత్రే కిడ్నాప్ చేసినట్టు వ్యవహరించడం మానవహేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య భారతదేశ ప్రధాని ఇలాంటి యుద్ధోన్మాద చర్యలను ఇప్పటికైనా ఖండించాలని కె.నారాయణ డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలన్నీ కలసి ట్రంప్ చర్యలను ఖండించి ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, ఉదయ్, బండి చలపతి, చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ టి. జనార్ధన్, ప్రజాసంఘాల నాయకులు లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ong-7_ong-7.qxd 1/14/2026 12:17 AM Page 1



# సింహాద్రప్పన్న ఆలయంలో ఉట్టిపడిన సంక్రాంతి శోభ

- రాజగోపురం చెంత రంగురంగుల రంగవల్లికలతో ముగ్గుల పోటీలు



**సింహాచలం, జనవరి 13, ప్రభాతవార్త**

కలియుగ వైకుంఠమైన శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నరసిం హ స్వామి వారి దివ్య క్షేత్రం సంక్రాంతి శోభను సంతరిం చుకుంది. తెలుగు వారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా, మంగళవారం ఆలయ ప్రాంగణం రంగురంగుల రంగవల్లికలతో,భక్తుల కోలా హలంతో కళకళలాడింది.ఆలయ రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో మహిళా భక్తులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. మన సనాతన ధర్మాన్ని, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా భక్తులు తీర్చిదిద్దిన ముగ్గులు, అందులో నింపిన రంగులు చూపరులను, స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన ఇతర భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గొబ్బెమ్మల తో, రంగుల హరి విల్లులతో ఆలయ పరిసరాలు ఆధ్యా త్మికతను సంతరిం చుకున్నాయి.ఆలయ కార్యనిర్వహ ణాధికారి ఎన్ సుజాత వారి ఆదేశాల మేరకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ పోటీల నిర్వ హణలో పర్యవేక్షక అధికారులు బి. సత్యశ్రీనివాస్, సత్య వాణి దగ్గరుండి పర్యవేక్షించారు. జూనియర్ సహాయ కులు గుంపిన కొండలరావు, శైలజ భక్తులను ప్రోత్స హిస్తూ ఏర్పాట్లను సమకూర్చి, పోటీలు విజయవంతంగా జరిగేలా కృషి చేశారు. స్వామి వారి సన్నిధిలో జరిగిన ఈ ముగ్గుల పోటీలు భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి.






## ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

**ఎలమంచిలి, జనవరి 13, ప్రభాతవార్త:**

నియోజకవర్గం రాంబిల్లి మండలం వెంకటా పురం గ్రామంలో నేటి నుంచి కనుమ రోజు వరకు మూడు రోజులు పాటు ఎమ్మెల్యే సుంద రపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాల యం సిబ్బంది తెలిపారు. ఈ సంక్రాంతి సంబరాల్లో బుధవారం ఉదయం ప్రారంభమ య్యే ఈ సంక్రాంతి సంబరాలలో మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా మహిళ లకు ఆటల పోటీలు వం టల పోటీలు, ఫ్లీ ఎగ్జిబిషన్ ఎ్రా్యషన్ పోటీలు ఆట పాటలతో సంక్రాంతి సం బరాలు అంగ రంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంబరాలలో జబర్దస్త్ ఆర్టిస్టులు ప్రత్యేక ఆకర్షణగా ఆకర్షణగా నిలవనున్నారు. ఈ సంక్రాంతి సంబరాల్లో సుమారు 32 రకాల సంబంధించిన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన వారికి బహు మతులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సంక్రాంతి సంబరాల్లో కూటమి నాయ కులు, ప్రజలు అందరూ పాల్గొని విజయ వంతం చేయాలని అన్నారు.



# మహానగర ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఏపీ..

**ప్రభాతవార్త, విశాఖపట్నం**

దేశంలోని ప్రముఖ మహానగర ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే దిశగా కీలక అడుగుగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం ఈ నెల 12, 13 తేదీల్లో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎం ఎం ఆర్)కు రెండు రోజుల అధ్యయన పర్యటనను నిర్వహించింది. ఈ పర్యట నలో ప్రాంతీయ పాలన, భూమి ఆధారిత ఫైనాన్సింగ్, ట్రాన్సిట్ ఓరియెంటెడ్

> కొత్త తరం వృద్ధి కేంద్రంగా విశాఖ అభివృద్ధి..
> ముంబై మెట్రోపాలిటన్
> రీజియన్‌లో రెండు రోజుల అధ్యయనం..
> అధ్యయనం చేసి నపలు అంశాలతో
> ప్రణాళిక సిద్ధం చేస్తున్న ఏపీ బృందం

డెవలప్‌మెంట్ (టీ ఓ డి), మురికివాడల పునర్వికాసం, విస్తృత స్థాయి నగర నిర్మాణానికి సంబంధించిన భారతదేశంలో అత్యంత అభివృద్ధి చెందిన వ్యవస్థలను అక్కడ అధ్యయనం చేశారు. ఈ పర్యటన యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఆంధ్రప్రదేశ్‌లో కొత్త తరం వృద్ధి కేంద్రంగా అభివృద్ధి చేయబడుతున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ (వి ఈ ఆర్) కోసం అమలు చేయదగిన విషయాలను అధ్యయనం చేయడమే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బృందంలో ఎం ఏ అండ్ యూ డి శాఖ, విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వి ఎం ఆర్ డి ఏ), టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరేట్, రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వీరిలో వి ఎంఆర్‌డిఏ నుంచి మెట్రో పాలిటన్



కమిషనర్ ఎన్ తేజ్ భరత్, సంయుక్త కమిషనర్ కె. రమేష్, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, చీఫ్ అర్బన్ ప్లానర్ వి. శిల్ప, ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్. జె. విద్యుల్లత, డి టీ సీ పి అదనపు డైరెక్టర్ వర ప్రసాద్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ఇన్‌చార్జ్ బి. శ్రీ శ్రావ్య, ఎం ఏ అండ్ యూ డీ ప్రిన్సి పల్ సెక్రటరీ, ఓ ఎస్ డీ వ్యాస్, ఏపీ యూఐ ఏఎంఎల్ నుంచి సీనియర్ స్పెషలిస్ట్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) జితేంద్రపాల్ పాల్గొన్నారు. ఈ బృందం మహారాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో విస్తృతంగా సమావేశమైంది. వీరిలో అదనపు ప్రధాన కార్యదర్శి (అర్బన్ డెవలప్‌మెంట్) అసీమ్ కుమార్ గుప్తా, ముఖ్యమంత్రి కి అదనపు ప్రధాన కార్యదర్శి అశ్విని భిడే, ఎం ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సంజయ్ ముఖర్జీ, మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ విజయ్ సింగాల్, సీఐడీసీ ఓ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్లు డా. రాజా దయానిధి, (జేఎండి1) శాంతను గోయెల్, (జేఎండి 2), గణేష్ దేశ్‌ముఖ్ (జేఎండి3), స్లమ్ రిహ్యాబిలిటేషన్ అథారిటీ (ఎస్ఆర్ఏ) సీనియర్ అధికారులు, ఐ ఎస్ ఈ జి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అండ్ సీఈవో శిరీష్ సంకే ఉన్నారు. విశాఖపట్నాన్ని బే సిటీ, మెట్రో రైల్, టీ ఓ డి కారిడార్లు, భోగాపురం ఏరోసిటీ, బ్రౌన్‌ఫీల్డ్ రీడెవలప్‌మెంట్, భారీ స్థాయి హౌసింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రపంచ స్థాయి ఆర్థిక ప్రాంతంగా అభివృద్ధి చేసే కీలక దశలో ఆంధ్రప్రదేశ్ ఉన్నందున, ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకొంది. రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా భూమి, అభివృద్ధి హక్కులు మరియు సంస్థాగత బలంతో ఒక మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని ఆర్థిక వనరులు సమీకరించి అభివృద్ధి చేయవచ్చో ముంబై ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది. ఆర్థిక మాస్టర్ ప్లాన్‌లను పెట్టుబడులకు సిద్ధమైన వృద్ధి యంత్రాలుగా ఎలా మార్చవచ్చో.. భూభాగాల గుర్తింపు, వృద్ధి కేంద్రాల సృష్టి

మిగతా 8..లో

# జేసీగా కె. మయూర్ అశోక్ సేవలు అభినందనీయం

- వీడ్కోలు సభలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రశంసలు - జేసీ దంపతులకు ఉద్యోగుల ఆత్మీయ సత్కారం

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త**

అద్భుతమైన పనితీరుతో అందరి మనసులు గెలుచుకున్న జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సేవలు ప్రశంసనీయం, అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. విశాఖపట్నం జిల్లా సమగ్ర అభివృద్ధిలో, లక్ష్యాల సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని, విధి నిర్వహణలో తనకు వెన్నుదన్నుగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఒక సోదరుడిలా తోడ్పాటు అందించారని గుర్తు చేశారు. దాదాపు రెండేళ్ల పాటు విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన మయూర్ అశోక్ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ కావడంతో, మంగళవారం దస్పల్లా హోటల్‌లో రెవెన్యూ అసోసియేషన్, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జేసీ దంపతులకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భం గా అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది మయూర్ అశోక్‌కు, ఆయన భార్య జీసీసీ ఎండీ కల్పనా కుమారికి పుష్ప గుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. చిరునవ్వులతో ఆత్మీయ వీడ్కోలు పలికారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మయూర్ అశోక్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో ఆయన చురుకైన పాత్ర పోషించారని, మంచి వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఐటీ కంపెనీలకు భూ కేటాయింపులు, సాంకేతిక అంశాల్లోనూ చురుగ్గా వ్యవహరించారని తెలిపారు. యోగాంధ్ర,



సీఐఐ సమ్మిట్ల నిర్వహణలోనూ, వాటి విజయవంతానికి మయూర్ అశోక్ చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. ఒక నమ్మకమైన అధికారి దూరమవుతున్నందుకు కొంచెం బాధగా ఉందని, ఉద్యోగ జీవితంలో ఇవన్నీ తప్పవని అన్నారు. మయూర్ అశోక్ నూతన బాధ్యతల్లో కూడా ఇదే విధమైన పనితీరుతో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపుజీసీసీ ఎండీ కల్పనా కుమారి గురించి మాట్లాడుతూ, ఆమె ప్రతి పనిలో చురుకుగా వ్యవహరిస్తారని, యోగాంధ్ర, సీఐఐ సమ్మిట్ సమయంలో ఆమె పనితీరును దగ్గరగా గమనించానని కలెక్టర్ తెలిపారు. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు



తీసుకురావడంలో ఆమె కీలక పాత్ర పోషించారని, పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. తక్కువ కాలంలోనే జీసీసీలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని ప్రశంసించారు. అనంతరం మాట్లాడిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్.. జేసీ దంపతుల సేవలను కొనియాడారు. మంచి వ్యక్తిత్వం, వృత్తిపట్ల నిబద్ధత కలిగిన అధికారులు అని ప్రశంసించారు.ఉత్తరాంధ్ర కుటుంబం నుంచి దూరమవుతున్నాను : కె. మయూర్ అశోక్వీడ్కోలు సభలో మయూర్ అశోక్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు నాలుగేళ్ల పాటు పనిచేసిన అనుభవం

మిగతా 8..లో

## గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ వేగవంతం..

- గంటా ఆధ్వర్యంలో సమావేశమైన రైతులు

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త:**



తర్లువాడ గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ ను పూర్తి చేసే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన నివాసంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రైతులు ఈమేరకు సంసిద్ధత వ్యక్తం చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ రేటు కంటే ఎక్కువ పరిహారాన్ని ఇవ్వడం సహా ఎకరానికి 20 సెంట్ల భూమి.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగం.. షాపింగ్ కాంప్లెక్స్ లో షాపు.. 3 సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వనున్న విషయం తెలిసిందే. మార్చిలో డేటా సెంటర్ శంకుస్థాపన చేయాలని భావిస్తున్న తరుణంలో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఒప్పించిన గంటా కు రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తమ గ్రామానికి ప్రధాన రహదారి సహా కళ్యాణ మండపాన్ని మంజూరు చేయించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ భూముల్లో చెట్లు పెంచుకున్న 520 మందికి ఇళ్ల నిర్మాణం కోసం 3 సెంట్లు చొప్పున ప్రకటించిన స్థల విస్తీర్ణాన్ని వీలైతే 5 సెంట్లకు పెంచాలని విన్నవించారు. వైసీపీ నాయకులు కూడా తమ భూములు ఇవ్వడానికి ఇప్పటికే ముందుకు వచ్చి సంతకాలు చేశారు. ఇంకా భూమిలివ్వని రైతులు తమ భూములిస్తున్నట్టు సమావేశంలో చెప్పడంతో పాటు రెవిన్యూ అధికారులకు సమ్మతి లేఖలు అందించారు. ఆర్డీఓ సంగీత్ మాధుర్, తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, వైసీపీ నాయకుడు మజ్జి వెంకట్రావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బాలి అయ్యప్ప, మజ్జి శ్రీను, బంకు రాజు, మజ్జి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 29 మంది మినీ అంగన్వాడీలకు పదోన్నతి..

- నియామక పత్రాలు అందజేసిన స్పీకర్ సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

**నర్సీపట్నం, జనవరి 13, ప్రభాతవార్త:**

నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని 29 మంది మినీ అంగ న్వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా పదో న్నతి లభించింది. మంగళవారం నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి మున్సిపాలిటీ కౌన్సిలర్ చింత కాయల పద్మావతి పదోన్నతి పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలోని రెండు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 29 అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో నర్సీపట్నం ప్రాజెక్ట్ పరిధిలోని నర్సీపట్నం మండలంలో ఇద్దరు (02), మాకవరపాలెం మండలంలో ఎనిమిది మంది (08) కార్యకర్తలు ఉన్నారు. అలాగే గొలుగొండ ప్రాజెక్ట్ పరిధిలోని గొలుగొండ మండలంలో ఎనిమిది మంది (08), నాతవరం మండలంలో పదకొండు మంది (11) కార్యకర్తలకు ఈ పదోన్నతి దక్కింది. గతంలో మినీ అంగన్వాడీలుగా వీరు రూ. 7,000 వేతనం పొందుతుండగా, మెయిన్ వర్కర్లుగా పదోన్నతి పొంద డంతో ఇకపై వీరి వేతనం రూ. 11,500లకు పెరగనుంది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ అంగనవాడి కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి చిన్నారులు, తల్లుల ఆరోగ్య పరిరక్షణ లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తమకు పదోన్నతి లభించడం పట్ల అంగన్వాడీ కార్యకర్తలు స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి, పద్మావతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నర్సీపట్నం నాతవరం మండలం టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, సిడిపిఓ జి.వి రమణి, కె శ్రీగౌరి, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



## సెన్సస్-2027 నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధం

:జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త**

విశాఖపట్నం జిల్లాలో సెన్సస్-2027 (జనగణన) కార్యక్రమాలను పూర్తిగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. మంగళవారం అమరావతి నుంచి ఇన్చార్జి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. రావత్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జనగణన కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సెన్సస్ కార్యక్రమం ఆరు నెలల నుంచి ఏడాది వరకు సాగే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని ఇన్చార్జి సీఎస్ చెప్పారు. కాగితరహితంగా, డిజిటల్ యాప్ ద్వారా నిర్వహించాల న్నారు. సెన్సస్ ప్రక్రియను రెండు దశల్లో అమలు చేయనున్నట్లు వివరించారు. స్టేజ్-1లో హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్, ఫేజ్-2లో జనాభా గణన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమా వేశంలో సెన్సస్ డైరెక్టర్ జె. నివాస్ అధికారుల పాత్రలు, బాధ్యతలు, నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో జనాభా లెక్కల అధికారిగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని, అదనపు జనాభా లెక్కల అధికారులుగా తహశీల్దార్లు వ్యవహరిస్తారని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో ప్రిన్సిపల్ అధికారిగా జీవీఎంసీ కమిషనర్ ను నియమించినట్లు తెలిపారు. జెడ్పీలు ఇన్చార్జి జనాభా లెక్కల అధికారులుగా ఉంటారని వివరించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వీసీలో ఆయనతో పాటు వివిధ విభా గాల అధికారులు పాల్గొన్నారు.

## లంకవానిపాలెంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు..

- మహిళల కోసం ప్రత్యేక ముగ్గుల పోటీలు..

- మహిళల ప్రతిభకు వేదికగా లంకవానిపాలెం గ్రామ సంక్రాంతి వేడుకలు

**ప్రభాతవార్త, విశాఖపట్నం**



అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు మండలం, లంకవానిపాలెం గ్రామంలో గతం నుంచి సంప్రదాయబద్ధంగా కొనసాగుతూ వస్తు న్నసంక్రాంతి సంబరాల పరంపరను ఈ ఏడాది కూడా అదే ఉత్సాహంతో కొనసాగిస్తోంది. మహిళల కోసం ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ మహిళల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం, సంక్రాంతి పండుగను గ్రామమంతా ఒక కుటుంబంలా జరుపుకోవాలనే మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం చాలా ఆనందకరమైన విషయమని లంకవానిపాలెం గ్రామ సర్పంచ్ దొరబాబు పేర్కొన్నారు. గతంలో గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కొనసాగింపుగా, ఈ ఏడాది మహిళల ముగ్గుల పోటీలను గ్రామ యువకుడు వర్రీ షణ్ముఖరావు తన సొంత ఖర్చులతో, సేవాభావంతో ముందుకు తీసుకువచ్చి గ్రామ మహిళలకు ఒక మంచి వేదిక కల్పించడం అభినందనీయమని సర్పంచ్ తెలిపారు. లంకవానిపాలెం గ్రామ సర్పంచ్ దొరబాబు సహకారంతో, వర్రీ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఈ సంక్రాంతి సంబరాలు, మహిళల ముగ్గుల పోటీలు గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ ముగ్గుల పోటీలు ఈ నెల 15వ తేదీ న నిర్వహించేందుకు గ్రామ యువతీ-యువకులు, మహిళలు, గ్రామ ప్రజల సమిష్టి సహకారంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారిందని పేర్కొన్నారు. గ్రామ సంస్కృతి, సంప్రదాయాలు, సంక్రాంతి పండుగల ఆనందం ఇలాగే ప్రతి ఇంటికీ చేరాలన్న లక్ష్యంతో గ్రామ పెద్దలు, యువత కలిసి చేస్తున్న ఈ ప్రయత్నం లంకవానిపాలెం గ్రామానికి మరింత మంచి పేరు, ప్రతిష్ట తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**తరువాయిలు**

## మహానగర ఆర్థికవ్యవస్థలలో ఒకటిగా ఏపీ..

ప్రైవేట్ మూలధన ఆకర్షణ ద్వారా, ముంబై అనుభవం స్పష్టంగా చూపిస్తుంది. బాంద్రాకుర్లా కాంప్లెక్స్ (బీ కే సీ)ను ప్రపంచ స్థాయి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌గా అభివృద్ధి చేయడంలో కఠినమైన మాస్టర్ ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చరల్ నియంత్రణలు కీలక పాత్ర పోషించాయని బృందం అధ్యయనం చేసింది. మంచి ప్రణాళికే భూమి విలువ, పెట్టుబడిదారుల విశ్వాసం, దీర్ఘకాలిక ఆదాయంగా మారుతుందని ఇది నిరూపించింది. సీ ఐ డి సీ ఓ, ఎం ఎం ఆర్ డి ఏలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా పనిచేసే అభివృద్ధి సంస్థలుగా ఎలా వ్యవహరిస్తున్నాయో తెలుసుకోవడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మహారాష్ట్ర రాష్ట్ర మంత్రివర్గం విస్తృత ప్రభుత్వ భూములను ప్రాంతీయ అభివృద్ధి సంస్థలకు కేటాయించడం ద్వారా, అవి భూమి, ఎఫ్ ఎస్ ఐ అభివృద్ధి హక్కులను మోనిటైజ్ చేసి మౌలిక సదుపాయాలు, పట్టణ వృద్ధికి స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. సీ ఐ డి సీ ఓ ప్రస్తుతం సుమారు రూ.14,000 కోట్ల వార్షిక బడ్జెట్‌తో పనిచేస్తుండగా, అది ప్రధానంగా భూమి, రియల్ ఎస్టేట్ ఆధారిత ఆదాయాల ద్వారానే నిధులు సమకూర్చుకుంటోంది. ఎం ఎం ఆర్ డి ఏ మెట్రో లైన్లు, టీ ఓ డి కారిడార్లు మరియు ప్రాంతీయ మౌలిక సదుపాయాలను ఎఫ్ ఎస్ ఐ ప్రీమియంలు, భూమి మోనిటైజేషన్, ఇంపాక్ట్ ఫీజులు, స్టాంప్ డ్యూటీకి అనుసంధానిత సర్‌చార్జ్‌ల ద్వారా ఫైనాన్స్ చేస్తోంది. ఎఫ్ ఎస్ ఐ, అదనపు ఎఫ్ ఎస్ ఐ ప్రీమియంలు, పెరిగిన నిర్మాణ విస్తీర్ణంపై ప్రాపర్టీ ట్యాక్స్, స్టాంప్ డ్యూటీ సర్‌చార్జ్‌లు, భూమి, భవనాలపై అభివృద్ధి చార్జీలు, మెట్రో సమీప ఆస్తులపై ప్రీమియంలు వంటి ఆధునిక పట్టణ ఆదాయ నిర్మాణాలను కూడా బృందం అధ్యయనం చేసింది. నగర సాంద్రత తగ్గింపు, పునర్వికాసం, నిలువు వృద్ధిని సాధించేందుకు పాత, అక్రమ భవనాల నియమీకరణ, పునర్వ్యవస్థీకరణ వంటి ధైర్యమైన ప్రణాళికా నిర్ణయాలను ముంబై తీసుకున్న విధానాన్ని కూడా పరిశీలించారు. సీ ఐ డి సీ ఓ అమలు చేస్తున్న నవీ ముంబై, నైనా (నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ నోటిఫైడ్ ఏరియా) నమూనాలు భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ 2.0కు బెంచ్‌మార్క్‌లుగా అధ్యయనం చేయబడ్డాయి. 60:40 టౌన్ ప్లానింగ్ స్కీమ్‌ల ఆధారిత భూభాగ పూలింగ్, 2.5 ఎఫ్ ఎస్ ఐ, వృద్ధి కేంద్రాల సృష్టి మరియు విక్రయయోగ్యమైన భూసంపద ద్వారా, బలవంతపు భూసేకరణ లేకుండా కొత్త నగరాలను నిర్మించడమే కాకుండా మౌలిక సదుపాయాల ఫండింగ్ మరియు దీర్ఘకాలిక ప్రజా ఆదాయాన్ని ఎలా సృష్టించవచ్చో సీ ఐ డి సీ ఓ నిరూపించింది. బామందొంగరి, ఖర్కోపర్‌లో సీ ఐ డి సీ ఓ అమలు చేస్తున్న పి ఎం ఏ వై భారీ హౌసింగ్ ప్రాజెక్టులు.. 67,000కు పైగా ఈ డబ్ల్యూ ఎస్, ఎల్ ఐ జీ గృహాల నిర్మాణంతో, ప్రజా భూమిని వృత్తిపరంగా ప్రణాళిక చేసి మోనిటైజ్ చేస్తే ఆర్థిక ఒత్తిడి లేకుండా గృహాలను పెద్ద స్థాయిలో ఎలా అందించవచ్చో స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ అధ్యయనాల ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం రెండు కీలక సంస్కరణలను తుది దశకు తీసుకువస్తోంది. భూమి విలువ సేకరణ (ల్యాండ్ వేల్యూ కాప్చర్) మరియు భూమి మోనిటైజేషన్ విధానం, అలాగే ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక, సేవా నగరాల సృష్టికి ఉప విధానాలు; మరియు కొత్త స్లమ్ రిహ్యాబిలిటేషన్, క్లస్టర్ రీడెవలప్‌మెంట్ విధానం. ముంబై అనుభవం ద్వారా భూమి, ఎఫ్ ఎస్ ఐ, టీ ఓ డీ, పునర్వికాస హక్కులను వ్యవస్థబద్ధంగా వినియోగించి మౌలిక సదుపాయాలు మరియు గృహాలను ఫైనాన్స్ చేస్తూనే హక్కుల భద్రత మరియు సమగ్ర పట్టణ వృద్ధిని ఎలా సాధించవచ్చో ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టత లభించింది. ఈ అధ్యయన పర్యటనపై ఎం ఏ అండ్ యూ డీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ, ముంబై భూమి, ప్రణాళిక, సంస్థల ఆధారంగా బడ్జెట్లపై మాత్రమే ఆధారపడకుండా, నగరాలను ఎలా నిర్మించవచ్చో ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టమైన కార్యాచరణ బ్లూప్రింట్‌ను అందిస్తుందని తెలిపారు. ఎం ఎం ఆర్ డీ ఏ, సీ ఐ డీ సీ ఓ లకు ఇచ్చిన అధికారాలు, ప్రభుత్వ భూముల మోనిటైజేషన్, ఎఫ్ ఎస్ ఐ టీ ఓ డీ ద్వారా మెట్రో మరియు హౌసింగ్‌కు నిధుల సమీకరణ, బీ కే సీ వంటి ప్రపంచ స్థాయి జిల్లాల సృష్టి.. ఇవన్నీ వి ఈ ఆర్, బే సిటీ, టీ ఓ డీ కారిడార్లు, రాష్ట్రవ్యాప్తంగా కొత్త వృద్ధి కేంద్రాల అభివృద్ధికి ప్రత్యక్ష మార్గదర్శకంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వి ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ ముంబై నమూనా ఒక ప్రాంతీయ అధికారం భూమిని దీర్ఘకాలిక ఆర్థిక ఇంజిన్‌లుగా ఎలా మార్చగలదో చూపిస్తుందని అన్నారు. అదే సూత్రాలపై మాస్టర్ ప్లాన్ చేసిన వృద్ధి కేంద్రాలు, టీఓడి ఆధారిత సాంద్రీకరణ, బ్రౌన్‌ఫీల్డ్ పునర్వికాసం, భూమి ఆధారిత ఫైనాన్సింగ్, విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను రూపకల్పన చేస్తున్నామని, తద్వారా వైజాగ్ గ్రాంట్లపై ఆధారపడే నగరంగా కాకుండా స్వయం సమృద్ధి మెట్రోపాలిటన్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని తెలిపారు. ఈ ముంబై అధ్యయన పర్యటన ఆంధ్రప్రదేశ్ పట్టణ సంస్కరణల ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. విశాఖ ఎకనామిక్ రీజియన్ దృక్పథం నుంచి అమలుకు మారి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, గృహాలు, ఉపాధి అవకాశాలను అందించగల పెట్టుబడులకు సిద్ధమైన, ప్రపంచ స్థాయి వృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకునే దిశగా ఇది మార్గం సుగమం చేసింది.

## జేసిగా కె.యయూర్ అశోక్ సేవలు అభినందనీయం

మరువలేనిదన్నారు. విశాఖపట్నంతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని చెప్పారు. అధికారులు, సిబ్బంది అందించిన సహకారంతో విధి నిర్వహణ విజయవంతంగా సాగిందని పేర్కొంటూ, అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర కుటుంబం నుంచి దూరమవుతున్నానని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మార్గదర్శకత్వం, సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా జీసీసీ ఎండీ కల్పనా కుమారి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వివిధ బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించిందని, విశాఖలో హౌసింగ్ జేసీగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. అన్ని విభాగాల అధికారుల సహకారం మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాథుర్, హౌసింగ్ పీడీ సత్తిబాబు, కలెక్టరేట్ ఏవో రాణి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్, వీఆర్వో అసోసియేషన్, రేషన్ దుకాణాల అసోసియేషన్ ప్రతినిధులు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, రెవెన్యూ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయం కోసం మండలధికారులకు వినతి

**గాజువాక,జనవరి 13,ప్రభాతవార్త**



గ్రేటర్ విశాఖపట్నం నగర పరిధిలో భూముల విలువ పెరుగుతుండటంతో కబ్జారాయుళ్ల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. చట్టబద్ధంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న భూమిపైనే"మాకు హక్కు ఉంది" అంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఘటన గాజువాక మండలం దువ్వాడ సమీపంలోని మంగళపాలెం ప్రాంతంలో కలకలం రేపుతోంది. దువ్వాడ గ్రామం సర్వే నెం.130/6లోని భూమిని ఈ ఏడాది మార్చి 19న సుమారు 800 చదరపు గజాల మేర సిరసపల్లి అప్పారావు, అమరపిన్ని తాతారావు, వెంకట రమణ, మడక వరహాలు చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. భూమి కొనుగోలు ముందు పూర్వపు లావాదేవీలు, నకలు, ఈసీ ఇతర రెవెన్యూ పత్రాలను పరిశీలించి లీగల్ వెరిఫికేషన్ అనంతరం రిజిస్ట్రేషన్ చేసినట్టు బాధితులు స్పష్టం చేస్తున్నారు. అయితే, ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు వెళ్లిన సమయంలో గంట్ల ముసలయ్య వారసుల మంటూ రమణమూర్తి సహా మరికొందరు వ్యక్తులు అడ్డుకుని బెదిరింపులకు దిగారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పూర్వంలో అమ్మేసిన భూమిపై మళ్లీ హక్కు ఉందని చెప్పడం నేరపూరిత చర్యేనని వారు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై గత డిసెంబర్ 8న బాధితులు కమిషనర్ ఆఫ్ పోలీస్ను ఆశ్రయించగా, పత్రాలు పరిశీలించిన అనంతరం స్థానిక సీఐకి ఫోన్ చేసి రెవెన్యూ తహసిల్దార్ ద్వారా 145 నోటీసులు జారీ చేయాలని సీపీ ఆదేశించినట్లు తెలిపారు. రెవెన్యూ సర్వేలో భూమి తమదేనని తేలినా, కబ్జారాయుళ్ల వేధింపులు మాత్రం ఆగడం లేదని వాపోతున్నారు.ఇటీవల జనవరి 3న తీర్థయాత్రకు వెళ్లిన సమయంలో, తమ గైర్హాజరీలో రాత్రివేళల్లో వచ్చి అక్రమంగా సిమెంట్ ఫోల్స్ వేసి గుండాయిజానికి పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. భయాందోళనకు గురై వెంటనే 112కు ఫోన్ చేయగా, స్పందించిన దువ్వాడ లా అండ్ ఆర్డర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.113/1976కు ముందు నుంచే అమ్మకాలు జరిగి, పలు రిజిస్ట్రేషన్లు నమోదైన భూమిపై మళ్లీ వారసులమంటూ దౌర్జన్యం చేయడం తగదని, బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పష్టమైన నివేదికలు ఉన్నప్పటికీ కబ్జారాయుళ్లపై కఠిన చర్యలు లేకపోవడమే ఇలాంటి అక్రమాలకు ఊతమిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## వెస్ట్ జోన్ నూతన కార్యాలయానికి కమిషనర్ స్థల పరిశీలన

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త:**



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ వెస్ట్ జోన్ నూతన కార్యాలయం నిర్మించేందుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం నగరంలోని ఐ.టి.ఐ. జంక్షన్, గోపాలపట్నం చేపల బజారు, సింహాచలం రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలోని స్థలాలను వెస్ట్ జోన్ జోనల్ కమీషనర్ బి.రాముతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కొరకు జీవీఎంసీ 8 జోనులను 10 జోనులుగా మార్పు చేసిందని, అందులో భాగంగా ప్రస్తుతం జ్ఞానపురం వద్ద వున్న వెస్ట్ జోన్ ప్రజలకు అందుబాటులో లేనందున వెస్ట్ జోన్ కార్యాలయం నూతనంగా నిర్మించేందుకు ఐ.టి.ఐ. జంక్షన్ వద్ద 4500 చదరపు అడుగులు, గోపాలపట్నం చేపల బజార్ వద్ద 2500 చదరపు అడుగులు, సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద 9000 చదరపు అడుగులు కలిగిన స్థలాలను పరిశీలించామని తెలిపారు. ఈ మూడు ప్రాంతాలకు సంబంధించి ఒక చోట వెస్ట్ జోన్ కార్యాలయం నిర్మించేందుకు అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జివిఎంసి పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్, డిసిపి రామమోహన్, ఏసిపి రామలింగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల పనితీరును మెరుగుపరచడానికి ఈనారీలు నియామకం

**పద్మనాభం, జనవరి 13, ప్రభాతవార్త**



మండలంలో పలు గ్రామాలలో ఉన్న డ్వాక్రా సంఘాల పనితీరును మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఈనారీలను నియమించినట్లు సెర్ప్ ప్రాజెక్టు మేనేజరు కె.వరప్రసాదు అన్నారు. మంగళవారం ఆయనతో పాటు డిపిఎం వైదేహి రెడ్డిపల్లి డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడుతూ ప్రతి పది డ్వాక్రా సంఘాలకు ఒక ఈ నారీను నియమించినట్లు ఆయన అన్నారు. ఈ ఈనారీలు సంఘాల రికార్డులను రాస్తారని, అలాగే సంఘాలలో ఎటువంటి మోసాలు జరగకుండా చూస్తారని అన్నారు. మండలంలో 201 మంది ఈనారీలను నియమించినట్లు అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బి వి రమణ పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ సెక్రటరీ గుండెపోటుతో మృతి

**ఆరిలోవ, జనవరి 13, ప్రభాతవార్త**



తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ శివాజీ నగర్ 2, సచివాలయం 9 లో టౌన్ ప్లానింగ్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న చందక ఉదయ్ కుమార్ (44) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విధులు నిర్వహిస్తుండగా ముడసర్లోవ రోడ్డులో గుండెపోటు రావడంతో ఆయన ఒక్కసారిగా కుప్పు కూలిపోయారు. తోటి సిబ్బంది సహాయంతో హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికి ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సింహపురి కాలనీ పేస్ 2 లో నివాసముంటున్నారు. రెండేళ్ల క్రితం వివాహం జరిగింది.

## ఆకట్టుకున్న ముగ్గులు పోటీలు

**ఆరిలోవ, జనవరి 13, ప్రభాతవార్త**



చినగదిలి నార్త్ షిరిడి సాయి బాబా ఆలయంలో సంక్రాంతి పురస్కరించుకొని సోమవారం రాత్రి ఆలయ కమిటీ నిర్వహించిన ముగ్గులు పోటీలు సరదాగాసాగింది. ఈ పోటీల్లో సరోజ, జె.అరుణ, జి సరళ ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల్లో సరోజ, జె.అరుణ, జి సరళ ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల్లో ప్రథమ ద్వితీయ తృతీయ విజేతలతో పాటు పాల్గొన్న వారికి కూడా బుధవారం భోగి పండుగ రోజు బహుమతులు ప్రధానం చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. ఈ ముగ్గుల పోటీలో విజేతల ఎంపికకు న్యాయ నిర్ణేతలగా ఆర్ మహిత పాత్రో, డి శ్రీదేవి, ఐ. వీణ వ్యవహరించారు. భోగిరోజు శబరిమలైలో జ్యోతి దర్శనం ఇచ్చే సమయంలో బాబా ఆలయంలో పూజలు జరిపి అయ్యప్ప జ్యోతి కి నీరాజనంగా ఆకాశ దీపాన్ని గగనంలో వదులుతామని ఆలయ కమిటీ తెలిపింది.

## సంక్రాంతి సందర్భంగా కొత్త లోకాలకు

**విశాఖపట్నం, జనవరి 13 ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగ సందర్భంగా విశాఖలో సరికొత్త థీమ్స్ తో వైజాగ్ ఎక్స్పో 2026 గ్రాండ్ వెల్కమ్ చెప్పంది. ప్రతీ సంవత్సరం లానే ఈ ఏడాది మరింత థ్రిల్ గా ఫుల్ ఫన్ ఎంటర్టైన్మెంట్ మరియు ఎగ్జైట్మెంట్ కాన్సెప్ట్స్ అలరించనున్నాయి ఇండియాలోనే ఫస్ట్ టైం ఎక్స్‌క్లూజివ్ డూమ్ 360, మై థాలజీ, గరుడపురాణం కాన్సెప్ట్ ఎలివేషన్ తో స్వర్గం నరకం కాన్సెప్ట్ తో భారీ యమలోకం సెట్, రోబోటిక్ యానిమల్స్, పిల్లలకు పెద్దలకు ఎంతగానో అలరించే భారీ ఎమ్యుజ్మెంట్ రైడ్స్, చేనేత కళాకారులు ఉత్పత్తులు ,గేమ్ అండ్ టాయ్స్ స్టాల్స్ ఫుడ్ ఐటమ్స్ ఇలా 100 కు పైగా స్టాల్స్ తో ఉత్తరాంధ్ర ప్రజలకు, పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకునేలా గ్రాండ్ వెల్కమ్ చెప్తుంది వైజాగ్ ఎక్స్పో 2026 విశాఖ సాగర తీరంలో... పోలీస్ మెస్ వెనుక ఉన్న ఏ యూ గ్రౌండ్స్ లో భారీ విద్యుత్ దగదగల మధ్య ప్రతీ రోజు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్వహకులు రాజారెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా విశాఖ వేదికగా ప్రతీ సంవత్సరం కొత్త కొత్త కాన్సెప్టుతో వైజాగ్ ఎక్స్పో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని...పిల్లలకు పెద్దలకు ఎంటర్టైన్మెంట్ తో పాటు కొన్ని నెలలపాటు వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు.

## 17న ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్ ప్రవచనం

**విశాఖపట్నం జనవరి 13 ప్రభాతవార్త**



వరంగల్ దరి మార్క్యాపురం జిల్లా పొదిలి గ్రామం శ్రీ మంజునాథ ఫంక్షన్ హాల్ నందు హైదరాబాద్ శ్రీ కుసుమ హరనాథ ప్రచార సంస్థ కమిటీ వారిచే మూడు రోజులు పాటు 81వ ఆనంద మేళోత్సవాలను సంకీర్తనలు, ప్రవచనాలు, ఏకాహం, శ్రీ కుసుమహరనాథుల లీలా కళ్యాణ మహోత్సవంతో ఘనంగా నిర్వహించనున్నారు. విశాఖ నగరానికి చెందిన దువ్వాడ శ్రీ కుసుమహరనాథ ఆశ్రమ కమిటీ సభ్యులు, శ్రీ కుసుమ హరనాథ నామప్రచార సంఘం గౌరవ సలహాదారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ కి ఆధ్యాత్మిక ప్రసంగం చేయమని ఆహ్వానం లభించింది. విశాఖ నుంచి వీరు ఒక్కరే పాల్గొంటున్నారు. 2026 జనవరి 17 ఉదయం 11 గంటలకు " శ్రీ హరనాధుని అవతార విశిష్టత భగవన్నామం యొక్క ప్రాముఖ్యత " అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారు. ఆనందమేళోత్సవంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేయటానికి వెళుతున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్‌కి పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నగర ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన నగర మేయర్, జీవీఎంసీ కమిషనర్

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త**





నగర ప్రజలకు మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ తెలుగు ప్రజల ముఖ్య పండుగలలో సంక్రాంతి పండుగ ముఖ్యమైనదని, తెలుగు ప్రజలు ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ పిల్లలు పెద్దలు కలిసి ఈ పండుగ దినాలలో తమ సొంత గ్రామాలు చేరుకొని ఈ మూడు రోజులు ఆనందంగా గడుపుతారని వారు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగర ప్రజలు ఈ పండుగను సుఖ సంతోషాలతో ఆనందదాయకంగా జరుపుకోవాలని కోరుకున్నట్లు వారు పేర్కొన్నారు.

## రోడ్డు విస్తరణలో ఆస్తి కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందించిన నగర మేయర్

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త:**

విశాఖ నగర అభివృద్ధికి సహకరిస్తూ రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందించడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెందుర్తిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, బల్ల శ్రీనివాసరావు లతో కలిసి వేపగుంట నుండి పినగాడి రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి నష్టపరిహార చెక్కులను అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించడం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, అందులో భాగంగా నగరంలో ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. వేపగుంట నుండి పినగాడి వెళ్లే మార్గం లో మాస్టర్ ప్లాన్ ప్రకారం



విస్తరణ పనులు చేపట్టామని, అందులో ఆస్తులు కోల్పోయిన 37 మందికి సుమారు 30,44,905/ రూపాయల చెక్కులను నష్టపరిహారాన్ని పెందుర్తి శాసనసభ్యులతో కలిసి అందించామని తెలిపారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యులు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని వేపగుంట నుండి పెందుర్తి వెళ్లే మార్గంలో ఎన్నో సంవత్సరాల నుండి రోడ్డు విస్తరణ చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడడంతో పాటు రోడ్డు చాలావరకు మరమత్తులకు గురైందని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన 37 మందికి సుమారు రూ. 30.5 లక్షలు నష్టపరిహారాన్ని అందించామని శాసనసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోనల్ కమిషనర్ హెచ్.శంకర్రావు, డిసిపి రామలింగేశ్వర రెడ్డి, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సచివాలయం కార్యదర్శులు పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సతీష్ కుమార్‌కు 7వ డాన్ బ్లాక్ బెల్ట్ : అభినందించిన సినీ హీరో సుమన్, బీజేపీ నేత కేఎన్ఆర్

**గాజువాక,జనవరి 13,ప్రభాతవార్త**



కరాటేలో సిహెచ్. సతీష్ కుమార్ 7వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈ సందర్భంగా విశాఖ హెచ్‌బీ కాలనీలోని డ్రాగన్ ఫోర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో వొడాకాయ్ కరాటే దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభలో ప్రముఖ సినీ హీరో, మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా పాల్గొని సతీష్ కుమార్‌ను సత్కరించారు. బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ కరణం రెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) విశిష్ట అతిథిగా హాజరయ్యారు. సుమన్ మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే అవసరమన్నారు. నరసింగరావు ఖేలో ఇండియా ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం అందుతోందన్నారు.మార్చిలో జరగనున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, బీజేపీ నేత బొత్స సురేష్,కోచ్‌లు గంటా నూకరాజు, కిషోర్, అగస్త్యతో పాటు పలువురు కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు.

## శిక్షణ పొందిన మధ్యవర్తులకు సర్టిఫికెట్ల ప్రదానం

**- హాజరైన న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ, విశాఖ సీపీ బగ్చీ ..**

**విశాఖపట్నం, జనవరి 12, ప్రభాతవార్త**



శిక్షణ పొందిన తొలి మధ్యవర్తులుగా ఏపీలోనే డాక్టర్ వికాస్ పాండేతో పాటు 12వ సీఆర్‌సీ బృంద సభ్యులు గుర్తింపు పొందారు. దీంతో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార రంగంలో ఈ రాష్ట్రం ఒక మైలురాయిని సాధించినట్టయిందని పలువురు వక్తలు కొనియాడారు. వికాస్ పాండేతో పాటు కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సీఆర్‌సీ)కు చెందిన న్యాయవాది డాక్టర్ ఆర్. శ్రీరాములు, డాక్టర్ త్రినాథ్, సుకన్య ప్రియ, డాక్టర్ దొడ్డి చంద్రశేఖర్, శరత్ చంద్ర, కె.అవినాష్, శంకర్, దివ్య భారతి, ముజీర్, రాజేంద్ర ప్రసాద్, రామకృష్ణ.జి, షంవీర్ చౌహాన్ శిక్షణ పొందిన వారిలో ఉన్నారు. ఈ శిక్షణను సీఆర్‌సీ, ఐఏఎంసీ సంయుక్తంగా అంతర్జాతీయ ఆర్బిట్రేటర్, మధ్యవర్తి ఏజే జవాద్, నిపుణుల బృందం మధ్య పూర్తయినట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ, విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీతో పాటు సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణులు హాజరై మాట్లాడారు. మధ్యవర్తిత్వ సేవల ద్వారా ప్రజల వివాదాల్ని పరిష్కరించే అవకాశం ఉంటుందని వికాస్ పాండే తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99636 33653నంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు. సీఆర్‌సీ వెబ్‌సైట్‌ను కూడా ఆశ్రయించొచ్చన్నారు.

## 34 బస్సులపై కేసులు నమోదు: రూ.95,100 అపరాద రుసుము వసూల్

**మాధవధార, జనవరి 13, ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ బస్సులు ప్రయాణికులు నుంచి అధిక ఛార్జీలు వసూల్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఉప రవాణా కమీషనర్ ఆర్‌సి హెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా బస్సు ఛార్జీలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన వెంటనే సంబంధిత ప్రైవేట్ బస్సు యజమానులతో అధికారులు సమన్వయం చేసి, ఛార్జీలను తక్షణమే తగ్గించి నియంత్రించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఆర్ టి సి నిర్దేశించిన ఛార్జీలపై గరిష్టంగా 50 శాతం మాత్రమే అదనంగా వసూలు చేయాలని స్పష్టం చేస్తూ, దానికంటే ఎక్కువ ధరకు టికెట్లు విక్రయిస్తే సంబంధిత బస్సు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 24 7 హెల్ప్‌లైన్ నెంబర్ – 92816 07001 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గత ఐదు రోజులుగా జరుగుతున్న ఈ తనిఖీలలో అధిక ఛార్జీలు వసూలు చేసిన 1 బస్సుపై కేసులు నమోదు చేసి రూ.5000 జరిమానా విధించామని, అలాగే పన్ను,పర్మిట్ వంటి ఇతర నిబంధనలు ఉల్లంఘించిన 33 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.90100 జరిమానా విధించినట్లు తెలిపారు.ఈ ప్రత్యేక తనిఖీలు 18వరకు కొనసాగుతాయన్నారు.

## వరుసగా చోరీలు నివారణపై అవగాహన కలిగిస్తున్న పట్టించుకోని ప్రజలు..

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**



నగరంలోని దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా ఈ దొంగతనాలు జరుగుతున్నాయి. క్రైం పోలీసులు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ, జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న నగర వాసులు ఆ సూచనలను తిప్పి కొడుతున్నారు. చోరీల నివారణపై క్రైమ్ పోలీసులు పోలీస్ కమిషనరేట్ సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా ప్రచారం చేస్తుంది. బయట ఊర్లకు వెళ్లే ప్రజలు విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులు బ్యాంకు లాకర్స్ లో దాచుకోవాలని సూచిస్తున్నప్పటికీ ప్రజలు వాటికీ విరుద్ధంగా తమ వెంట పట్టుకు వెళ్లి చోరులకు అవకాశం కలిగిస్తున్నారు. తీరా నేరం జరిగిన తర్వాత బాధితులు పోలీసుల ముందు న్యాయం చేయాలంటూ లబోదిబోమంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లోని ఆదివారం జరిగిన రెండో చోరీలకు సంబంధించి పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు బృందాలుగా వీడి పోయి నిందితుల కోసం గాలిస్తున్నారు. జగదాంబ సెంటర్ సమీపంలోని లక్కీ షాపింగ్ మాల్ లోని ఓ యువకుడు, యువత ఈ కలిసి ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్ ను కట్ చేసి అందులో ఉన్న బంగారు వస్తువులను ఎత్తుకెళ్లారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలలో కూడా నమోదయ్యాయి. ఈ దొంగ తనాలు ఇతర రాష్ట్రాలకు చెందినవారా లేక స్థానికంగా ఉన్న పాత నేరస్తుల పని అని పోలీ సులు అనుమానిస్తున్నారు. అదే విధంగా సోమవారం రాత్రి గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా చైన్ స్నాచింగ్ జరిగినట్టు తెలిసింది.ఓ పక్క నేరాలు, మరోవైపు జాగ్రత్తలు పాటించాలని,క్రైమ్ పోలీసులు అవగాహన కలిగిస్తున్నప్పటికీ ప్రజలు పట్టించుకోకపోవడంతో వారంతా ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

## ముగ్గుల పోటీలకు మహిళల నుండి విశేష స్పందన

**పద్మనాభం, జనవరి 13, ప్రభాతవార్త**



అనంతపద్మనాభస్వామి పుణ్యక్షేత్రంలో వేంచేసియున్న కుంతీమాధవస్వామి ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ఉత్సవకమిటీ ఆధ్వర్యములో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుండి విశేష స్పందన లభించింది. గ్రామం నుండి ఎనభై మంది మహిళలు హాజరై పలు రకాల రంగులు,గొబ్బెమ్మలతో వేసిన ముగ్గులతో ఆలయ ప్రాంగణం సంక్రాంతి పండుగ శోభ సంతరించుకుంది.గత మూడు సంవత్సరాల నుండి ఆలయం ముందు ఈ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్దు ,ఎర్రినాయుడు, పైడిరాజు, బుగత రాము, కాళ్ల శ్రీను పాల్గొన్నారు.

## వైకుంఠం మందిరాన్ని దర్శించిన సినీ హీరో సుమన్

**ఆనందపురం, జనవరి 13, ప్రభాతవార్త:**



మండలంలోని గంభీరంలో ఉన్న హరే కృష్ణ వైకుంఠం మందిరాన్ని ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ మంగళవారం దర్శించారు. ఈ సందర్భంగా శ్రీ రాధాకృష్ణ, శ్రీకృష్ణ బలరాములు, వైకుంఠ శ్రీనివాసుని దర్శించుకున్నారు. వారికి హరే కృష్ణ మూమెంట్ అధ్యక్షులు డాక్టర్ నిష్కించిన భక్తదాస స్వాగతం పలికి తీర్థ ప్రసాదములు అందజేశారు. జరిగింది. మందిరాన్ని దర్శించిన వారిలో జీవీఎల్ నరసింహారావు, కరణం నర్సింగరావ పాల్గొన్నారు.


**వార్త CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, VAIBAGULA LAKSHMI W/O SRINU, previously called VYBAGULA LAXMI R/O 17-10-342/139, SANJAY NAGAR, KAKINADA, now changed my name from VYBAGULA LAXMI to VAIBAGULA LAKSHMI. Henceforth I will be called as VAIBAGULA LAKSHMI for all purposes.

(Ro.No. 38597)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ong-6_ong-6.qxd 1/14/2026 12:18 AM Page 1






# పోలీసుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**అరకులోయ, జనవరి 13, ప్రభాతవార్త :**
అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అరకులోయ పోలీస్ స్టేషన్ ఎదుట ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ పాల్గొన్నారు. మగ్గుల పోటీలలో సుమారు 50 మంది పోలీసులు మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, రెండో మరియు మూడో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సాంప్రదాయ దింసా నృత్యం చేసి అందరిని అలరించారు. అనంతరం భోగి మంటను వెలిగించి పండుగ శుభారంభం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు ప్రజలందరూ సంక్రాంతి పండుగను తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని, అలాగే జిల్లాలోని ప్రజలందరికీ మరియు పోలీస్ కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, అరకు సీఐ ఎల్. హిమగిరి, మరియు ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.

## మూడు గ్రామాల్లో రగ్గులు పంపిణీ

**రాజవొమ్మంగి, జనవరి 13, ప్రభాతవార్త**



అగాపే లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వారు మూడు గ్రామాల్లో రగ్గులను మంగళవారం పంపిణీ చేశారు. మినస్ట్రీస్ డైరెక్టర్ రెవ.అరవింద్, హెప్సిబా (రాజమండ్రి) వారు కలిసి కొయ్యూరు, బడదనాంపల్లి, సుబ్బంపాడు గ్రామాల్లో 150 కుటుంబాలకు రగ్గులను అందించారు. చలి తీవ్రత రీత్యా రగ్గులను అందించిన సంస్థ వారికి మూడు గ్రామాలవారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రెవ.అరవింద్, పాస్టర్ సంతోష్ కుమార్, పాస్టర్ సురేష్, పాస్టర్ రక్షణానందం,మూడు గ్రామాలవారు పాల్గొన్నారు

## సంక్రాంతి పండుగను సాంప్రదాయంగా జరుపుకోవాలి: ఎస్.ఐ

**రాజవొమ్మంగి, జనవరి 13, ప్రభాతవార్త**



ప్రజలు సంక్రాంతి పండుగను సాంప్రదాయ క్రీడలతో ఆనందంగా జరుపుకోవాలని రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ ఎస్సై శివకుమార్ కోరారు. మంగళవారం ఎస్. ఐ శివకుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట, చిత్తులాట, గుండాట వంటి జూద క్రీడల్లో పాల్గొంటే ఆర్థికంగా దెబ్బతింటారన్నారు. అందువల్ల ప్రజలు ఎవరూ జూద క్రీడల్లో పాల్గొనకుండా ఉండాలని సూచించారు. జూద క్రీడల్లో పాల్గొంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పొలం గట్లపై వెదురు పెంచడం లాభదాయకం.. ఏ. ఓ చక్రధర్

**రాజవొమ్మంగి, జనవరి.13, ప్రభాతవార్త**
పొలాల్లో గాని గట్లమీద రక్షణ పంటలుగా గాని వెదురు వేసుకోవడం వలన తక్కువ పెట్టుబడితో వేసిన 3 సంవత్సరాల నుండి 40 ఏళ్ల వరకూ అధిక ఆదాయం పొందవచ్చునని రాజవొమ్మంగి మండల వ్యవసాయాధికారి చక్రధర్ రైతులకు తెలియజేస్తున్నారు. వెదురు సరుగుడు కంటే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఐటీడీఏ రంపచోడవరం ఉద్యానవన శాఖ ద్వారా నర్సరీలో వెదురు పెంచడం జరుగుతోందన్నారు. వెదురును పొలం గట్లపై వెయ్యాలనుకున్న రైతులు సమీప గ్రామ సచివాలయంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుడుకు తమ వివరాలు తెలియచేయాలన్నారు.

## అడ్డతీగలలో ఘోర రోడ్డు ప్రమాదం - ఒకరు మృతి

**అడ్డతీగల జనవరి 14 ప్రభాతవార్త**



మండలంలోని చిన్న ఒడిశ కర్ర సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వై. రామవరం నుండి వస్తున్న కారును, ఎదురుగా వస్తున్న బైక్ బలంగా ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న వెదుళ్ళ కొండ గ్రామానికి చెందిన కురసం సూరిబాబు (40), కుంజం అబ్బాయి దొర (32)లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రులను వెంటనే అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలోనే కురసం సూరిబాబు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్రంగా గాయపడిన కుంజం అబ్బాయి దొర పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ఘటనా స్థలంలో ఉన్న గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## అడ్డతీగల మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**అడ్డతీగల, జనవరి 14, ప్రభాతవార్త**



మండల ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలను మండల జడ్పిటిసి మద్దాల వీర్రాజు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రయాణాలు చేసే వారు వాహనాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, ఎంపీటీసీలు మరియు సర్పంచులు పాల్గొన్నారు

## సురేష్ కుమార్‌ను అభినందించిన ఏంపీ తనుజరాణి

**పాడేరు, జనవరి 13, ప్రభాతవార్త**



వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు వైఎస్సార్సీపీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ తెడబారికి సురేష్ కూమర్ కి అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజ రాణి,అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యామలరావ్ లు సురేష్ కుమార్ కు శాలువా కప్పి,పుష్ప గుచ్చాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ తనూజ రాణి మాట్లాడుతూ వైసిపి బలోపేతానికి పార్టీ పటిష్టతకు కృషి చేసి గ్రామ స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఏంపీ తనూజ రాణి సూచించారు.

## మండల కేంద్రం ఎస్ రాయవరంలో సంక్రాంతి సంబరాలు

**ఎస్ రాయవరం జనవరి 13 ప్రభాతవార్త**





మండల కేంద్రమైన ఎస్ రాయవరం మండల కార్యాలయం ఎదురుగా రెడ్డి కల్యాణ మండపంలో మంగళ వారం సంక్రాంతి సంబరాలు డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వివిధ శాఖ అధికారులు. కూటమి నాయకులు పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఆనందంగా సంక్రాంతి సంబరాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోగి మంటలు. ముగ్గుల పోటీలు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జే రమేష్ బాబు, వెలుగు ఎపిఎం శివప్రసాద్, వ్యవసాయ అధికారి సౌజన్య, మరియు మండల పార్టీ అధ్యక్షుడు అమలగంటి అబద్ధం, బొలిశెట్టి గోవిందరావు, ఎన్. వెంకట్రాజు, కోన అప్పలరాజు, తుంపాల నాగేశ్వరావు, గుర్రం రామకృష్ణ నాయకులు. కార్యకర్తలు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 19 నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు..

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా పశుసంవర్ధక అధికారి డా వి జయరాజ్**

**పాడేరు,జనవరి13, ప్రభాతవార్త:**
జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెల 19వ తేదీ నుంచి 31వ తేది వరకు నిర్వహించడం జరుగుతోందని జిల్లా పశుసంవర్ధక అధికారి డా. వి జయరాజ్ తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్ ను విడుదల చేసారు. రాష్ట్రంలోని పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుకు ప్రభుత్వం చేయూతను అందిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి, రైతుకు ఆర్థిక అండను కలగచేయడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెటర్నరీ డిస్పెన్సరీ, వెటర్నరీ ఆసుపత్రి పరిధిలో అన్ని మండలాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. శిబిరాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో పశువైద్యులు పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో అనేక కార్యక్రమాలను రైతులకు వివరించడం జరుగుతుందని, పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కొరకు దగ్గరలోని పశు వైద్యశాలలు లేదా రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చున్నారు.

## పారిశుద్ధ్య కార్మికు లకుటుంబాలకు వస్త్రాలను అందజేత

**పాడేరు,జనవరి 13, ప్రభాతవార్త:**



అల్లూరి సీతారామ రాజు జిల్లా కేంద్రం పాడేరు మేజర్ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి సందర్భంగా కార్మికుల కుటుంబాలకు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి,టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము నాయుడు, ఈఓ రమేష్ కుమార్,మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య దొర చేతులు మీదుగా వస్త్రాలను అందజేశారు.పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలు సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలని వారి కుటుంబాలకు వస్త్రాలను పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ ఉషారాణి పేర్కొన్నారు.

## బస్కి గ్రామంలో వైభవంగా రామ ఉయ్యాల పండగను రాష్ట్ర పండగగా ప్రకటించాలని వినతి

**అరకులోయ, జనవరి 13, ప్రభాతవార్త**







అరకులోయ మండలంలోని బస్కి పంచాయతీ కేంద్రంలో రామ ఉయ్యాల పండగ గిరిజన ఆచార సాంప్రదాయాల మధ్య, రామ ఉయ్యాల పండగ కమిటీ కన్వీనర్ కె రామారావు , సభ్యులు బుజ్జిబాబు, ఎస్ కృష్ణమూర్తి , ఎస్ లైచోన్, గిరిజన సంఘం నాయకులు పొద్దు బాలదేవ్, పంచాయతీ సర్పంచ్ రమేష్ తదితరుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఏడు సంవత్సరాలకు ఒకసారి జరిగే రామ ఉయ్యాల పండగను బస్కి రామ ఉయ్యాల పండగ కమిటీ ఆచార సాంప్రదాయాలను అనుసరించి, పెద్దలు సలహాలు సూచనల మేరకు అత్యంత వైభవంగా నిర్వహించింది. పండగను పరిష్కరించుకొని గ్రామానికి చెందిన నలుగురు పిల్లలను రామ, లక్ష్మణ, భరత శత్రుఘ్న లుగా భావించి వేషాధారణతో మేళ తాళాలతో పండగ జరిగే ప్రాంగణానికి తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉయ్యాలలో ఊగించారు. రామ ఉయ్యాల పండగను స్వయంగా తిలకించేందుకు అల్లూరి జిల్లా నుండి వేల సంఖ్యలో బస్కి గ్రామానికి గిరిజనులు తరలి వచ్చారు. దీంతో బస్కి గ్రామం మొత్తం జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ జపంతో మారుమ్రోగింది. కన్నుల పండగగా జరిగిన రామ ఉయ్యాల పండగను రాష్ట్ర పండగ ప్రకటించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పూర్వీకుల కాలంనాటి ఆచార వ్యవహారాలకు విలువిస్తూ, సంప్రదాయాలను గౌరవిస్తూ ఈ ఉత్సవాన్ని కొనసాగిస్తున్నట్లు గ్రామ పెద్ద లు గోపాల నాయుడు, రామ్మూర్తి లు చెప్పారు. గిరిజనుల్లోని అన్ని తెగల వారు భాగస్వాములయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం లో వైభవంగా జరిగిన రామ ఉయ్యాల పండగ లో తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటు ఇన్చార్జి తేజోవతి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, అరకులోయ నియోజకవర్గం ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర, సిపిఎం రాష్ట్ర నాయకుడు కిల్లో సురేంద్ర, వైసిపి నాయకులు మండల వైస్ ఎంపీపీ కే రామన్న, వార్డు సభ్యుడు కిరణ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని రామ ఉయ్యాల పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండగ విజయవంతంలో కమిటీ సభ్యులు అర్జున్, రాజేశ్వరరావు , ప్రహ్లాదు, పరశురాం, లలిత్, దాసు బాబు, రామ దాసు, రామనాయుడు, చంటి, కళ్యాణ్, నాని, గురు, భీమరాజు, రాజ్ కుమార్, కొమ్ములు, మధు, శ్రీను తదితరులు తీవ్రంగా కృషి చేశారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు

**చింతూరు, ప్రభాతవార్త**



కమ్యూనిటీ పోలీసులు భాగం గా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చింతూరు పోలీసుల ఆధ్వర్యంలో మహిళ లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చింతూరులోని శ్రీ భాస్కర విద్యా నికేతన్ ఆవరణ నిర్వహించిన ఈ కార్యక్రమానికి చింతూరు ఏఎస్పీ బొడ్డు హేమంత ఆయన సతీమణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ పర్యవేక్షణలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు

## రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో 13 మంది పై బైండోవర్ కేసులు

**రాజవొమ్మంగి, జనవరి 13, ప్రభాతవార్త**
రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం సంక్రాంతి నేపథ్యంలో ముందస్తుగా 13 మంది పై బైండోవర్ కేసులు పెట్టి రాజవొమ్మంగి తహసీల్దారు ముందు హాజరు పర్చి నట్లు ఎస్. ఐ లు శివకుమార్, చినబాబు తెలిపారు. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది మందిని హాజరు పర్చామని, ఇప్పటి వరకూ 28 మంది పై బైండొవర్ కేసులు పెట్టడం జరిగిందని ఎస్. ఐ శివకుమార్ అన్నారు. జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో 12 మందిపై బైండోవర్ కేసులు పెట్టడం జరిగిందని ఎస్. ఐ చినబాబు తెలిపారు.

## జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్మరణ్ రాజ్

**రంపచోడవరం, జనవరి 13 : ప్రభాతవార్త**



పోలవరం జిల్లా, రంపచోడవరం నూతన జాయింట్ కలెక్టర్ గా అదనపు బాధ్యతలు స్వీకరించిన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పదవి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి ఛాంబర్ లో రెండు గంటల 55 నిమిషాలకు పోలవరం జిల్లా రంపచోడవరం నూతన జాయింట్ కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని వివిధ రకాలైన గిరిజన సమస్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ సమస్యలు ఎప్పటికప్పుడు పరివేక్షించి ఆయా సమస్యలు ప్రభుత్వం నిబంధన ప్రకారం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. జిల్లాలోని వివిధ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది కొత్త జిల్లా అభివృద్ధి చేయుటకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. నూతన జాయింట్ కలెక్టర్ వారితో సీటీసీలలో ఏపీఓ జనరల్ డి ఎన్ వి రమణ సంతకాలు చేయించడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతన జాయింట్ కలెక్టర్గా పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందించే విధంగా ఎప్పటికప్పుడు పరివేక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు .నూతన జిల్లా జాయింట్ కలెక్టర్ వారికి మర్యాదపూర్వకంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, పీహెచ్ఓ దేవదానం, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత, ఈఈలు ఐ. శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఎస్ ఓ మార్తమ్మ, డిప్యూటీ తహసిల్దారులు స్వామి, రవీంద్రబాబు, విశ్వనాథ్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## గ్రామాల్లో పేకాట శిబిరాలపై దాడులు

**రాంబిల్లి జనవరి 13 ప్రభాతవార్త**



రాంబిల్లి మండలం లోవపాలెం, వాడపాలెం గ్రామాల్లో మంగళవారం పేకాట శిబిరాలపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసామని సీఐ, సిహెచ్. నరసింగరావు తెలిపారు, నిందితుల నుంచి 20వేల 380 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు, గ్రామాల్లో జూదం, పేకాట, బెట్టింగులు వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువత చెడు మార్గంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు, అలాగే గంజాయి మాదకద్రవ్యాల వంటి మత్తు పదార్థాలు వల్ల యువత పాడైపోతుందని అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు, అసాంఘిక కార్యక్రమాలతో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించినట్లయితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## చోడవరంలో ఆరకు కాఫీ కేంద్రం ప్రారంభం

**చోడవరం, జనవరి 13, ప్రభాతవార్త**



దేశవ్యాప్తంగా పేరుపొందిన అరకు కాఫీ కేంద్రాన్ని మంగళవారం చోడవరం లో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. వెలుగు ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే అరకు కాఫీకి ఎంతో ప్రాముఖ్యత ఉందని అలాంటి కాఫీ కేంద్రం మన చోడవరం ప్రారంభించడం శుభ పరిణామం అని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు అధికారులతో పాటు విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, అనకాపల్లి బిజెపి ఉపాధ్యక్షులు కందర్ప రమణమూర్తి, మాజీ ఎంపీపీ జీ వి సత్యనారాయణ, షుగర్స్ మాజీ చైర్మన్ జి మల్లు నాయుడు, కాఫీ ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు

## గౌరీ పరమేశ్వర ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

**- ఎస్ఐ విభూషనరావు**

**ఎస్ రాయవరం, జనవరి 13, ప్రభాతవార్త**



శనివారం జరగబోయే గౌరీ పరమేశ్వర ఉత్సవం సందర్భంగా ఎటువంటి గొడవలు లేకుండా, ప్రజలందరూ ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రామంలో యువకులు ఎటువంటి తప్ప తాగి అల్లర్లు చేస్తే కేసులను నమోదు చేస్తామని. ఈ పండగను జరుపుకోవాలని సూచించారు.

## వారసత్వ వ్యవసాయ భూములకు స్థిర స్టాంప్ డ్యూటీ..

**- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖపట్నం, జనవరి 13, ప్రభాతవార్త**
పార్టిషన్ (విభజన) డీడ్ల రిజిస్ట్రేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సౌలభ్యం కల్పిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ద్వారా సంబంధిత నోటిఫికేషన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. వారసత్వ వ్యవసాయ భూములపై స్టాంప్ డ్యూటీ సరళీకరణ ఇండియన్ స్టాంప్ యాక్ట్, 1899 లోని సెక్షన్9 ప్రకారం ఆర్టికల్40 కింద స్టాంప్ డ్యూటీ విధానాన్ని ప్రభుత్వం సవరించిందని పేర్కొన్నారు. వీలునామా లేకుండా (ఇంటెస్టేట్ డెత్) వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములపై పార్టిషన్ డీడ్లు నమోదు చేసే సందర్భంలో మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షలు మించకపోతే రూ.100 స్థిర స్టాంప్ డ్యూటీ, మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షలు మించితే రూ.1,000 స్థిర స్టాంప్ డ్యూటీ మాత్రమే వసూలు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రమాదస్థాయిలో ఉన్న వంతెనను అధికారులు పరిశీలన

**రాజవొమ్మంగి, జనవరి 13, ప్రభాతవార్త**



కింద్ర గ్రామం నుండి కింద్రకాలనీ గ్రామానికి వెళ్ళడానికి మడేరువాగుపై నిర్మించిన రోఫ్ వే వంతెన ప్రమాదకరంగా ఉన్న రీత్యా మంగళ వారం రాజవొమ్మంగి ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, తహసీల్దార్ ఏ. సత్యనారాయణ, ఎస్. ఐ శివకుమార్ లు పరిశీలించారు. వంతెనపై వాహనాలతో వెళ్ళవద్దని, ఎక్కువమంది ఒకేసారి వెళ్లకుండా తగు జాగ్రత్తలను పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వంతెనకు ఇరుప్రక్కల ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## సంస్కృతి, ఐక్యతను గుర్తు చేసే వేడుక సంక్రాంతి పండుగ : ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల,జనవరి 13, ప్రభాతవార్త



సంస్కృతి, ఐక్యతను గుర్తు చేసే వేడుక సంక్రాంతి పండుగ అని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. డెంకాడ మండలం చింతలవలస గ్రామంలో గల ఎం. వి. జి. ఆర్ కాలేజీ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను బంగార్రాజు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగలు మన సంస్కృతి, ఐక్యతను గుర్తు చేసే వేడుకలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్,మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు , చిల్ల పద్మ ,చీకటి సుహాసిని ,పిన్నింటి రమేష్ నాయుడు , సవరవిల్లి అప్పలనాయుడు , బూర్లె రవి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## ముగిసిన జనసేన క్రీడా వేడుకలు : విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే నాగ మాధవి

నెల్లిమర్ల , జనవరి 13, ప్రభాతవార్త



జనసేన నియోజకవర్గ క్రీడా సంబరాలు అంగ రంగ వైభవంగా ముగిసాయి. విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి చేతులమీదుగా అందజేశారు. రాష్ట్ర జనసేన పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు పూసపాటిరేగ మండలంలోని కందివలస సమీపంలో ఉన్న మైదానంలో జనసేన నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు సారధ్యంలో పది రోజులు పాటు ఉత్కంఠ భరితంగా జరిగాయి. క్రికెట్ పోటీలకు నియోజకవర్గ నలుమూలల నుంచి 85 టీములు పాల్గొనగా, వాలీబాల్ పోటీలకు 56 టీములు పాల్గొన్నాయి. ఈ పోటీలో చివరి వరకు ఉత్కంఠ భరితంగా ఉత్సాహంగా సాగగా వాలీబాల్ పోటీల్లో విన్నర్స్ గాను, రామతీర్థం రన్నర్స్‌గా విజేతలుగా నిలిచారు. క్రికెట్ పోటీలు కూడా రసవత్తరంగా సాగగా ఫైనల్ పోటీలకు కొవ్వాడ, గొర్లిపేట జట్లు తుదిపోరు సాగాల్సి ఉండగా సమయం చాలకు పోవడం వలన తుది పోరును మంగళవారానికి వాయిదా వేశారు. ఇప్పటివరకు జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, జనసేన జిల్లా నాయకుడు లోకం ప్రసాద్, కోట్ల రఘు, నగదు ప్రోత్సాహకాలతో పాటు, ట్రోఫీలను, అదేవిధంగా బ్రాంజ్ మెడల్స్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు, బాణాసంచా వాతావరణం మధ్య బహుమతులను అందుకున్నారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించగలరు అన్న ఆత్మస్థైర్యం ఈ క్రీడల ద్వారా రుజువైందన్నారు. క్రీడల పోటీలకు విశేష స్పందన లభించడం ఎంతో సంతోషంగా ఉందని కోట్ల అభిప్రాయం వ్యక్తం చేశారు. జనసేన నాయకులు బాలరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షురాలు బాసి దుర్గ, జనసేన మండల కన్వీనర్ జలపారి శివ, జమరాజు, పార్టీ నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

## కళ తప్పిన కార్మిక వాడ- కానరాని సంక్రాంతి శోభ

### గతమెంతో ఘనం..నేడు బోసిపోయిన గరివిడి

గరివిడి జనవరి,13 ప్రభాత వార్త




కార్మిక వాడ కళ తప్పింది. గతం ఎంతో ఘన కీర్తి కలిగిన గరివిడి నేడు బోసిపోయింది. సంక్రాంతి శోభ కానరాని పరిస్థితి ఏర్పడింది. శ్రమజీవులు కంట కన్నీరొలికే పరిస్థితి కనిపించింది.ఆకలి పెనవేసుకునే దైన్య స్థితి ఏర్పడింది. పట్టెడు మెతుకులు కోసం పరితపించే పరిస్థితి నెలకొంది. కార్మిక లోకానికి అర్ధాంతరంగా ఉపాది కోల్పోయే పరిస్థితి ఉత్పన్నమైంది. ఎంతో ఘన కీర్తి కలిగిన గరివిడి నేడు కళా విహీనమై అటు కార్మికులు, ఇటు వ్యాపార వర్గాలు,సామాన్య ప్రజానీకంలో నిస్తేజం చోటుచేసుకుంది. ఫేకర్ అల్లాయిస్ పరిశ్రమ అర్థాంతరంగా మూసివేతతో 50 నుండి 55 ఏళ్ల లోపే కార్మికులకు ఉపాది దూరమైంది. నష్ట పరిహారం ఇచ్చినా పని లేక,వేరే చోట పని లభించక నిరాశ,నిస్పృహ,నిర్లిప్తత త,నిర్వేదాల వలయం లో కొట్టుమిట్టాడే పరిస్థితులు నెలకొన్నాయి. బెంగ, దిగులుతో జీవనాన్ని గడిపే పరిస్థితి ప్రస్ఫుటించడం తో అటు శ్రమజీవులు కళ్ళల్లో కన్నీళ్లు,సామాన్య ప్రజల్లో దిగాలు చోటు చేసుకునే పరిస్థితులు ఏర్పడటం బాధాకరం..సంక్రాంతి సంబరాలు పిల్లా పాపలతో ఆనందంగా జరుపుకునే పరిస్థితికి దూరంగా నేడు శ్రామిక వర్గం నెట్టివేయ బడింది. సంక్రాంతి వేళ గరివిడి బోసిపోయింది. స్థానికంగా పని లేదు,ఉపాది కరువు, ఉసూరుమంటూ పరాయి ఊళ్లకు పరుగులు పెట్టే స్థితిలో ఇక్కడ ప్రజలు ఉండటం బాధాకరం. గత వైభవాన్ని,,ఖ్యాతి ని,కీర్తిని తలచుకుని కాలం గడిపే పరిస్థితుల్లో కళావిహీనమైన గరివిడిలో సంక్రాంతి శోభ వన్నె తగ్గడం బాధాకరమే..నాటి రోజులు స్మరణకే పరిమితం అవడం విచారకరమే..

## అమ్మ ప్రేమాలయంను ప్రారంభించిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కరుగు వెళ్లి జనవరి 13ప్రభాతవార్త



పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామంలో జట్టు ట్రస్ట్ ఆధ్వర్యం లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు తోయక జగదీశ్వరి "అమ్మ ప్రేమాలయం"ను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సమాజ సేవ, వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వామి వివేకానంద ఆలోచనలు యువతకు మార్గదర్శకమని, సేవాభావంతో ముందుకు సాగితే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు. అమ్మ ప్రేమాలయం ద్వారా అవసరమై న వారికి సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. జట్టు ట్రస్ట్ ప్రతినిధి డి.పారినాయుడు, తోటపల్లి దేవస్థానం చైర్మన్, ఎంపిటిసి సభ్యులు సింహాచలం స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు సేవాభావంతో సజావుగా కొనసాగింది.

## జిల్లా ప్రజలకు భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

పార్వతీపురం, జనవరి 13, ప్రభాతవార్త :



సంక్రాంతి పండుగ ప్రతి ఇంటిలో కొత్త వెలుగులు నింపాలి అని జిల్లా కలెక్టర్ డా. ప్రభాకర్ రెడ్డి అన్నారు. భోగి, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరూ భోగి, మకర సంక్రాంతి మరియు కనుమ పండుగలను సంతోషంగా, సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటిలో కొత్త వెలుగులు నింపాలని, రైతులు పండించిన పంటలతో పాడిపంటలు వర్ధిల్లాలని కోరారు. మన సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగను కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఈ మకర సంక్రాంతి జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులను, అభివృద్ధిని తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జిల్లా యంత్రాంగం తరపున ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కందులపదం గ్రామంలో పొలం పిలుస్తుంది : ఏఓ శిరీషా

సాలూరు జనవరి 13 ప్రభాతవార్త



సాలూరు మండలం కందులపదం గ్రామంలో మంగళ వారం ఉదయం మండల వ్యవసాయ అధికారి శిరీషా ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిం చారు.అందులో భాగంగా డ్రోన్ ఉపయోగించి అక్కడ రైతు తెగులు ఉన్న పొలంలో పిచికారి చేయించారు. అనంతరం మాట్లాడుతు డ్రోన్ తో పది నిమిషాల్లో ఒక ఎకరా వరకు స్ప్రే చేయొచ్చని అలాగే మందు వృధా తక్కువ ఇంకా సమయంతో పాటు కూలిఖర్చులు కూడా తగ్గుతుందని క్లారిటీ ఇచ్చారు.అలాగే తోణాంలో బంగా రమ్మ గ్రూప్ కి సబ్సిడీపై డ్రోన్ అందజేశామని తెలిపా రు.అంతేకాకుండా ఈ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించు కోవాలని స్పష్టం చేశారు. యూరియా వాడకం తగ్గించి నానో యూరియా వాడాలని అలాగే రబి ఈపంట కూడా పరిశీలించారు. రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు ఆలయాలలో చోరీ

బొండపల్లి డిసెంబర్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన బొండపల్లి గ్రామంలో గల లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం, మల్లికార్జున మాధవ లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ రెండు ఆలయాలలోని హుండీలతోపాటు చిన్న వస్తువులను పట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. హుండీలలో ఎక్కువ మొత్తంలో నగదు లేకపోవడంతో ఆలయ పరిసరాలలోని తుప్పలలో హుండీలను విసిరి వేశారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

## శత్రుచర్లను కలిసిన వైరిచర్ల

కురుపాం, జనవరి13ప్రభాతవార్త.



మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్ర దేవ్ పరామర్శించారు. మంగళవారం చిన్నమేరంగి శత్రుచర్ల కోటకు కిశోర్ చంద్ర దేవ్ వెళ్ళి పరామర్శించారు. ఇటీవల విజయరామరాజు ఆరోగ్యం బాగులేదని తెలుసుకున్నా కిశోర్ దేవ్ వెళ్ళి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు కొంత సేపు యోగా శేమలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. వీరివెంట అభిమానులు ఉన్నారు.

## లక్ష రూపాయలు విలువైన చీరలు దుప్పట్లు పంపిన చేసిన దాన కర్ణుడు - విజయ భాస్కర్ రావు

రామభద్రపురం, జనవరి13ప్రభాతవార్త.



రామభద్రపురం మండలం పరిధిలో గల ఇట్లమామిడి పల్లి గ్రామం లో సంక్రాంతి పండగ సందర్భంగా దుప్పట్లు చీరలు పంపిన చేసిన టిడిపి మండల అధ్యక్షుడు కర్ణం విజయ భాస్కర్ రావు ఉదరాత చాటుకున్నాడు లక్ష రూపాయలు విలువైన చీరలు దుప్పట్లు దుస్తులు రెండు వందల మందికి మండల తెదేపా అధ్యక్షుడు కర్ణం భాస్కర్ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు పంపిణీ చేస్తున్నానని ఆయన అన్నారు ఇవి కాకుండా తన సొంత ఆస్తిని పాఠశాలకు స్థలం ఉచితంగా ఇచ్చారు గ్రామం లో కమ్యూనిటీ హాల్ లక్షలు విలువైనది కట్టి గ్రామం నకు సదుపాయం కలిపించారు ఇవన్నీ తన ఉదరాతకు నిదర్శనం.

## ఏ వెంకంపేటలో సంక్రాంతి సంబరాలు ..సంబరాల్లో పాల్గొన్న మంత్రి గుమ్మడి ..బొబ్బిలి శాసనసభ్యులు

మక్కువ జనవరి 13 ప్రభాతవార్త:



మక్కువ మండలంలో ఏ వెంకంపేట గ్రామంలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీ.శే. జన్ని ముత్యాలు (మాజీ ఎమ్మెల్యే, సాలూరు) జ్ఞాపకార్థంగా మక్కువ మండలం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణు నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగిన సంప్రదాయ ఎడ్లబండి పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతి సంబరాల్లో సంప్రదాయ దుస్తులు, ముత్యాల ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్వం సంప్రదాయాలను బ్రతికిస్తున్నారని ప్రజలు కొనియాడారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి, అందరితో కలిసి భోజనాలు చేసారు. వాలీబాల్, ఎడ్ల బండ పందేలలో గెలుపొందిన వారికి మంత్రి బహుమతులను అందజేశారు.

## సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు

వేపాడ, జనవరి 13, ప్రభాతవార్త



చిన్నారుల్లో హిందూ సంప్రదాయం, నైతిక విలువలు పెంపొం దించడమే ధ్యేయంగా అంగన్వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యవతి తెలిపారు. మంగళవారం వేపాడ మండలం ఎన్.కె.ఆర్ పురం రెండో అంగన్వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త రమాబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేంద్రానికి చెందిన తల్లులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను పిల్లలకు వివరించడంతో పాటు సంప్రదాయ కార్యక్రమాలు, ఆటపాటలు ఘనంగా నిర్వహించారు.

## సంక్రాంతి సందర్భంగా రావుపల్లిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

### గ్రామ పంచాయతీ బొంతాడ మహేశ్వరరావు(మహేష్) - జెసిబితో పరిసరాలు పరిశుభ్రం... సర్పంచ్ బొంతాడ మహేష్

గరుగుబిల్లి, జనవరి 13, ప్రభాతవార్త



సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధి లోని రావుపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం పరిసరాలు పరిశుభ్రతకు గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా వీధులలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు పరిసరాలు పరిశుభ్రతకు అవసరమైన చర్యలు చేప ట్టడం జరిగిందని గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేష్ తెలిపారు. అదే విధంగా గ్రామాల పరిధిలోని పలుచోట్ల రహ దారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను జెసిబితో తొలగించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచా యతీలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని గ్రామ పంచా యతీ సర్పంచ్ బొంతాడ మహేష్ పేర్కొన్నారు. మంచినీటి బోరు బావులు రక్షిత మంచినీటి పథకాల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా సమీపంలోని కాలువలోకి మళ్లించడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీలోని ఆయా వీధులలో ఎక్కడ చెత్త చెదారం లేకుండా ఉండేలా పరిసరాలు పరిశు భ్రం చేయడం జరిగిందని తెలిపారు. దోమల నివారణకు కాలువల్లో ఎప్పటి కప్పుడు ఆయిల్ బాల్స్ వేయడం జరుగు తోందని పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేష్ తెలిపారు.

## మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న మద్యం బాటిల్లు స్వాధీనం

### ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ వెల్లడి - 42 మద్యం బాటిల్లు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

గరుగుబిల్లి, జనవరి 13, ప్రభాతవార్త



స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారం మేరకు పార్వతీపురం శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలోని మండలశిలోని పిట్టలమెట్ట జంక్షన్లో మోటారు సైకిల్ పై అక్రమంగా తరలిస్తున్న 42 మద్యం సీసాలును మంగళవారం స్వాధీనం చేసుకున్నామని మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ షేక్ ఫకృద్దీన్ తెలిపారు. పాలకొండకు చెందిన రత్నాల దినేష్ కుమార్ అక్రమంగా 42 మద్యం బాటిల్స్‌ను తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందిందన్నారు. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సీసాలును మోటారు సైకిల్పై తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వ హించి మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నామ న్నారు. ఈ మేరకు 42 మద్యం సీసాలను స్వాధీ నం చేసుకుని సీజ్ చేశామన్నారు. అదేవిధంగా కేసు నమోదు చేసి ముద్దాయిని పార్వతిపురం కోర్టుకు తరలించనున్నామని ఎస్ఐ షేక్ ఫకృద్దీన్ పేర్కొన్నారు.ఎస్ఐ షేక్ ఫకృద్దీన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో నాటు సారాను విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏ గ్రామంలోనైనా మద్యం బాక్సులను నిల్వ చేసినట్ల యితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## బొంతలకోటికి ఘన సత్కారం

గజపతినగరం, జనవరి 13 (ప్రభాతవార్త)

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు,రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ బొంతలకోటి శంకర్రావుకు మరో ఘన సత్కారము అందుకున్నారు.ఇటీవల ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొంది,వరల్డ్ బుక్కు అఫ్ రికార్డు లో స్థానం సంపాదించుకొని,మహారాష్ట్ర విద్యారంగంలో ఉపాధ్యాయులకు కళాబోధనను అమలు చేసినందుకు గాను సహాయస్ఫూర్తి ఫౌండేషన్ బొంతల కోటి శంకర్రావు మాస్టారును ఘనముగా సత్కరించింది. కళా ప్రక్రియల ద్వారా దేశంలో జానపద కళారూపాలతో పాఠ్యాంశాలను బోధించి, వినూత్నమైన బోధన పద్ధతుల అమలు చేసి,ఐదు వేల పాటల రచించి, ఒత్తిడి ఆందోళన లేని విద్యా విధానాన్ని అమలు చేసి జానపద కళా ప్రక్రియలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణను అందించి 370 అవార్డ్స్ సాధించి గాను సహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్. వై .వి. సాయి రేవంత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు,లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, శంకర్ ఫౌండేషన్ డైరెక్టర్ కె. రాధాకృష్ణ, అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చింత. శారదా చేతులు మీదుగా అవార్డు అందుకొని ఘన సత్కారం పొందడం ఆనందంగా ఉందని బొంతలకోటి మాస్టారు ఈ సందర్భంగా అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బొంతలకోటిని లైన్స్ క్లబ్, చైతన్య భారతి, జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యం నాయుడు, ఉపావిద్యాశాఖధికారి కె. మోహనరావు, ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరామారావు అభినందించారు.



## అపరాలలో రైజోబియం విత్తన శుద్ధి

పాచిపెంట జనవరి 13ప్రభాతవార్త



అపరాల విత్తనాలను రైజోబియంతో శుద్ధి చేస్తే నాణ్యమైన అపరాల దిగుబడి పెరుగుతుందని యూరియా వంటి నత్రజని ఎరువుల ఖర్చు తగ్గుతుందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. కేసలి గ్రామంలో పొలం బడి కార్యక్రమంలో వరి పంటలో అంతర పంటల ప్రయోగం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరి పంటలో ఐదు నుండి ఆరు రకాల అంతర్ పంటలు ఎకరానికి 10 కిలోలు బురద పదునులో చల్లుకుని విత్తనాలు మొలకెత్తే వరకు కేవలం పదును మాత్రమే ఉండేటట్లుగా చూసుకుంటే కలుపు సమస్య తగ్గుతుందని ప్రకృతి సేద్య పద్ధతులలో కలుపు నివారణ అతిపెద్ద సమస్య కాబట్టి ఈ విధానంలో కలుపును నివారించుకోవచ్చు అని తెలిపారు. అపరాల పంటలను రైజోబియంతో విత్తన శుద్ధి చేసుకుంటే అపరాల వేర్ల పై ఉన్న బుడిపే లతో రైజోబియం సహజీవనం గడిపి గాలిలో ఉన్న నత్రజని నేలలో స్థిరీకరించి పంటకు అందించడం వలన రసాయన యూరియా వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. వి ఏ ఏ రాకేష్ క్లస్టర్ ఇంచార్జ్ సురేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## బొంతలకోటికి ఘన సత్కారం

గజపతినగరం, జనవరి 13 (ప్రభాతవార్త)



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ బొంతలకోటి శంకర్రావుకు మరో ఘన సత్కారము అందుకున్నారు. ఇటీవల ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొంది, వరల్డ్ బుక్కు అఫ్ రికార్డులో స్థానం సంపాదించు కొని, మహారాష్ట్ర విద్యారంగంలో ఉపాధ్యాయులకు కళాబోధనను అమలు చేసినందుకు గాను సహాయస్ఫూర్తి ఫౌండేషన్ బొంతల కోటి శంకర్రావు మాస్టారును ఘనముగా సత్కరించింది. కళా ప్రక్రియల ద్వారా దేశంలో జానపద కళారూపాలతో పాఠ్యాంశాలను బోధించి, వినూత్నమైన బోధన పద్ధతుల అమలు చేసి,ఐదు వేల పాటల రచించి, ఒత్తిడి ఆందోళన లేని విద్యా విధానాన్ని అమలు చేసి జానపద కళా ప్రక్రియలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణను అందించి 370 అవార్డ్స్ సాధించిగాను సహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్.వై.వి.సాయి రేవంత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, శంకర్ ఫౌండేషన్ డైరెక్టర్ కె.రాధాకృష్ణ, అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చింత. శారదా చేతులు మీదుగా అవార్డు అందుకొని ఘన సత్కారం పొందడం ఆనందంగా ఉందని బొంతలకోటి మాస్టారు అన్నారు. డాక్టర్ బొంతలకోటిని లైన్స్ క్లబ్, చైతన్య భారతి, జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, ఉపావిద్యాశాఖధికారి కె.మోహనరావు, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరామారావు అభినందించారు.

## కార్మికుల సేవలు గుర్తించి నిత్యావసరాలు : చైర్ పర్సన్

సాలూరు జనవరి 13 ప్రభాతవార్త



సాలూరు పట్టణ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్ పర్సన్ ఈశ్వరమ్మ చేతులు మీదుగా పారిశు ధ్య కార్మికులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఏటా పారిశుధ్య కార్మికులకు బట్టలు, సబ్బులు, నూనెలు అందజేస్తారు. అలాగే వారితో పాటుగా కాంటాక్ట్ కార్మికులకు మొట్ట మొదటిసారిగా నిత్యవసరాలు పంపిణి చేసారు.చైర్ పర్సన్ మాట్లాడుతు ఎప్పుడు లేనివిధంగా ఔట్సోర్సింగ్ కార్మికులకు బట్టలు నూనెలు, సబ్బులు అందజేయడం సంతోషంగా ఉన్నారు. వైస్ చైర్మన్ అప్పలనాయుడు,కమీషనర్ టిటి రత్న కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, డిఈ ప్రసాద్, మేనేజర్ శివప్రసాద్, టీపీఓ ఝాన్సీ ఇంకా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఉపాధి హామీ పథకమే కీలకం ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట,జనవరి13,ప్రభాతవార్త



గ్రామాల్లో జరిగే అత్యధిక అభివృద్ధి కార్యక్రమాలు ఉపాధి హామీ పథకం నిధులతోనే సాధ్యమవు తున్నాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళ వారం ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు,ఇంజనీరింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల మధ్య సమన్వయం పెరగాలని రఘురాజు సూచించారు.పంచాయతీ కార్యదర్శులు అన్ని శాఖల పనులను సమన్వయం చేసుకోవాలని వాలంటీర్ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రస్తుతం కొంత ఇబ్బంది తలెత్తుతోందని దీనిని అధిగమించి ముందుకు వెళ్లాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 60% వేతనాలు,40% మెటీరియల్ నిష్పత్తి వల్ల పనులు ఎలా ముందుకు సాగుతాయో వేచి చూడాలని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు,స్థానిక అధికారులు,సర్పంచులు,ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## యువత క్రీడలవైపు అడుగులు వేయాలి

కురుపాం , జనవరి 13ప్రభాతవార్త.



యువత క్రీడల వైపు అడుగులు వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి. అనిల్ అన్నారు. మంగళవారం సం క్రాంతి పండుగను పురస్క రించుకుని ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలం జి. శివడ పంచాయితీలో మంగళవారం నుండి నిర్వహించనున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను పంచాయతీ కార్యదర్శి ఎం. ధనంజయతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయను ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఆరిక గంగారావు, యువత పాల్గొన్నరు.

## నేడు బుధ రాయవలసలో పౌర సన్మానం

మెరకముడిదాం, జనవరి 13ప్రభాతవార్త



మండలంలో బుధ రాయవలస గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం సర్పంచ్ సారికి తమ్మి నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రభుత్వ కొలువులు సాధించిన 72 మందికి పౌర సన్మానం జరపనున్నట్లు సర్పంచ్ తెలిపారు. బుధ రాయవలస గ్రామంలో జన్మించి కఠోర శ్రమ చేసి ప్రభుత్వ కొలువులు సాధించిన గ్రామానికి సంబంధించిన వారికి ఈ సన్మానం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామానికి యువతకు ప్రేరణగా నిలవడం కోసమే ఈ సన్మాన కార్యక్రమాలు చేపట్టి నట్లు అయన తెలిపారు. సన్మాన గ్రహీతలు విధిగా హాజర అవ్వాల్సిందిగా, అందరికీ ఆదర్శంగా నిలవాల్సిందిగా సర్పంచ్ కోరారు.

నూతన సంవత్సర & సంక్రాంతి శుభాకాంక్షలు
అధికారులకు, విద్యుత్ ఖాతాదారులకు, ప్రజాప్రతినిధులకు,
మరియు విద్యుత్ సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు
A/D, A/Eలు, మరియు సిబ్బంది ఏపీఈపీడీసీఎల్, బొబ్బిలి
బి.రఘు EE
ఆపరేషన్ ఏపీఈపీడీసీఎల్, బొబ్బిలి


## రోగులకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు



కవిటి, జనవరి 13 ప్రభాతవార్త: రోగులకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం నాడు రామయ్యపుట్టుగాలో ఎమ్మెల్యే ఆఫీస్ నందు పలువురు రోగులు కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్‌లు అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు బెందాళం రమేష్, పొందల కృష్ణారావు, జిల్లా రైతు సంఘ కార్యదర్శి పుల్లటి సంతోష్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## అభివృద్ధికి చిరునామా చంద్రబాబు : ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



కవిటి, జనవరి 13 ప్రభాతవార్త అభివృద్ధికి చిరునామా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటూ ప్రభుత్వ విప్ డా.బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలం జగతి గ్రామంలో 30 లక్షల ప్రభుత్వ నిధులతో హోమియో ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం వైద్య సేవలు అందించాలనే ధ్యేయంతో పాటు హోమియో వైద్యం కూడా అందించాలనేది ఆయన ధ్యేయం అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి ప్రసాద్‌తో పాటు మాజీ జడ్పీటీసీలు బెందాళం రమేష్, పొందల కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, పిఎస్ సిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్, మాజీ ఎంపీటీసీ నారాయణమూర్తితో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగ పేరుతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయొద్దు : ఎస్ఐ మధుసూదనరావు



పాతపట్నం, జనవరి 13 ప్రభాతవార్త : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా పాతపట్నం పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. పండుగ సంబరాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.మధుసూదన రావు హెచ్చరించారు. పండుగ ముసుగులో పేకాట, డొక్కాట, పిక్కాట మరియు కోడిపందాలు వంటి జూద క్రీడలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని వారిపై కేసులు నమోదు చేయబడతాయని ఆయన సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పండుగ సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు తమ విలువైన బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదును ఇంట్లో ఉంచవద్దన్నారు. వాటిని వెంట తీసుకెళ్లడం లేదా సురక్షిత ప్రాంతాలలో భద్రపరుచుకోవాలని తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు తాళం వేసిన ఇంటి సమాచారాన్ని పోలీసులకు తెలపాలన్నారు. రద్దీ ప్రదేశాల్లో చైన్ స్నాచింగ్, ముఖ్యంగా ద్విచక్ర వాహనాల దొంగ తనాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు పార్కింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాల న్నారు. బ్యాంక్ లావాదేవీల నిమిత్తం నగదు బ్యాగుల్లో లేదా బైక్ కవర్లలో పెట్టి తీసుకెళ్లేటప్పుడు నేరగాళ్లు అనుసరించే ప్రమాదం ఉందన్నారు. పరిసరాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అందరూ చట్టానికి సహకరిస్తూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పాతపట్నం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటోలో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా పండుగ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## పెద్దలక్ష్మీపురంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



పాతపట్నం, జనవరి 13 ప్రభాతవార్త: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి మరియు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఉమామహేశ్వరరావు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన సంస్కృతిని కాపాడుకుంటూ గ్రామాభివృద్ధిలో అందరం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలందరూ కలిసి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.

## సాంప్రదాయాలకు ప్రతీక ముగ్గుల పోటీలు: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని



ఆమదాలవలస, జనవరి 13 ప్రభాతవార్త: సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించడం సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంద ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొని ముగ్గులను వేసి బహుమతులు గెలుచుకున్నారు. మొదటి బహుమతి హిమబిందు, రెండవ బహుమతి నారు రవణమ్మ, మూడవ బహుమతి మచ్చ పూజిత గెల్చుకున్నారు. మహిళలకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వలన పూర్వీకుల సాంప్రదాయాలను మరల ప్రతిబింబవచ్చునని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి కానుక అందజేత



కవిటి, జనవరి 13 ప్రభాతవార్త: కవిటి మేజర్ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తోన్న పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ పూడి లక్ష్మణరావు సంక్రాంతి సందర్భంగా సంక్రాంతి కానుకగా బట్టలు, స్వీట్లు మరియు కిరాణా సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ముఖి రవి, పంచాయతీ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీమంత్రి 'గుండ'కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే 'మామిడి'



పాతపట్నం, జనవరి 13 ప్రభాతవార్త: మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సందర్శించి నివాళులర్పించారు. మంగళవారం శ్రీకాకుళం పట్టణంలో జరిగిన అంతిమ యాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా, మంత్రిగా అప్పల సూర్యనారాయణ ప్రజల మన్ననలు పొందారని, ఆయన సేవలు జిల్లా రాజకీయ చరిత్రలో చిరస్మరణీయని, వారి మరణం రాజకీయ రంగానికి, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాకు తీరని లోటని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న గుండ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



కంచిలి, జనవరి 13 ప్రభాతవార్త: ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అశోక్ బాబు సహకారంతో కంచిలి మండలం కుత్తుమ గ్రామానికి చెందిన ఇప్పిలి విఘ్నేశ్వరరావు మరియు బురదపాడు గ్రామానికి చెందిన పైల నీలమ్మకు ఆరోగ్య ఖర్చులు నిమిత్తం రూ.51వేలు మరియు రూ.45వేలు చెక్కును అందించడమైనది. మాదిన రామారావు, పురుషోత్తం, రామారావు, ఆనంద్, కామేష్ పాల్గొన్నారు.

## పండగ పూట వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



సీతంపేట, జనవరి 13 ప్రభాతవార్త : సంక్రాంతి పండగ దృష్టిలో పెట్టుకొని వాహనాలు మీద స్వగృహానికి వచ్చినవారు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడపాలని సీతంపేట ఎస్సై వై.అమ్మనారావు స్పష్టం చేశారు. మంగళవారం కుసిమి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని త్రిబుల్ రైడ్ చేయకుండా ఉండాలని స్పష్టం చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని అన్నారు. వాహనాలల్లో ఎటువంటి మాదక ద్రవ్యాలు రవాణా చేయవద్దని స్పష్టం చేశారు.

## జిల్లా ప్రజలకు భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు

### సంక్రాంతి పండుగ ప్రతి ఇంటిలో కొత్త వెలుగులు నింపాలి : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి



వీరఘట్టం, జనవరి 13 ప్రభాతవార్త: భోగి, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరూ భోగి, మకర సంక్రాంతి మరియు కనుమ పండుగలను సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటిలో కొత్త వెలుగులు నింపాలని, రైతులు పండించిన పంటలతో పాడిపంటలు వర్ధిల్లాలని కోరారు. మన సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగను కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ సమయాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా భోగి మంటల సమయంలో మరియు ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పండుగ వేడుకల్లో పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను వాడకుండా, ప్రకృతిని గౌరవిస్తూ వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మకర సంక్రాంతి జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులను, అభివృద్ధిని తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జిల్లా యంత్రాంగం తరపున ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శ్యాంప్రసాద్ రెడ్డికి సన్మానం



ఇచ్ఛాపురం, జనవరి 13 ప్రభాతవార్త: ఇచ్ఛాపురం మండలం సర్పంచ్‌లు, ఎంపిటీసిలు, కార్యకర్తలు, ఎంపిపి బోర పుష్ప, మండల పార్టీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డిల ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డిని అభినందనలు అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం సమన్వయ కర్తగా నియమించడం అదృష్టం అని, దీనిని నిలుపుకోవడానికి నిరంతరం శ్రమిస్తామని ఇచ్ఛాపురం నియోజకవర్గానికి వైఎస్ఆర్సీపీ కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించడానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి కల్పించిన ఈ గౌరవానికి ఎమ్మెల్యేని గెలిపించి జగన్మోహన్ రెడ్డికి బహుమతిగా ఇచ్చి రుణం తీర్చుకుంటామని మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. శ్యాంప్రసాద్ రెడ్డి వివాదాలు లేని సమర్థుడైన యువకుడని, వర్గాల ఊసు లేని తెల్లకాగితం లాంటి వారని తనని నడిపించాల్సిన భాద్యత మనమే తీసుకొని నడిపించాలని రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దక్కత నూకయ్య రెడ్డి, వైస్ ఎంపిపిలు దువ్వు వివేకానంద రెడ్డి, దున్న గురుమూర్తి, సర్పంచ్‌లు దుక్క ధనలక్ష్మి, కారింగి త్రినాథ్ రెడ్డి, నీలాపు సారధి రెడ్డి, సర్పంచ్ ప్రతినిధులు ఆశి దాలయ్య రెడ్డి, ఇసురు తులసీరాం రెడ్డి, వలపల వెంకటరమణ, పిట్ట బాలరాజు, గొందేశి ప్రియా, లిట్టు పాడి, ఎంపిటిసి ప్రతినిధి ఆశి పురుషోత్తం రెడ్డి, పిట్ట విశ్వనాథం, మాజీ సర్పంచ్‌లు లోపింటి దీనబంధు రెడ్డి, బదకల మోహన్ దాసు, నీలాపు చంద్రయ్య, బాకి లక్ష్మీనారాయణ, మండల పార్టీ నాయకులు ఆశి కృష్ణారెడ్డి, రంగాల జానకిరాం రెడ్డి, నగిరెడ్ల చిరంజీవి, దక్కత శ్రీరాములు, వడ్డిన తేజ, సప్ప వంశీ, పాలిన ప్రవీణ్, బొబ్బిలి దేవరాజు, అనపాన శ్రీరాంరెడ్డి తదితర పార్టీ కార్యకర్తలు శ్యాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలియజేసారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ



ఇచ్ఛాపురం, జనవరి 13 ప్రభాతవార్త: రామయ్యపుట్టుగలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు అందజేశారు. దుర్గాశి జానకమ్మకి 40వేల రూపాయలు, మట్టా శ్రీరాములుకి 81,700 రూపాయలు చెక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పత్రి తవిటయ్య, నందిగాం కోటేశ్వరరావు, కాళ్ళ జైదేవ్, ఆశి ధర్మరాజు, దుర్గాశి వాసుబాబు రెడ్డి, దుర్గాశి శంకర్ రెడ్డి, దుక్క లక్ష్మణ్ రెడ్డిలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రభుత్వ విప్ అశోక్ బాబుకి శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మరియు కౌన్సిలర్ ఆశి లీలారాణి ధన్యవాదాలు తెలియజేసారు.

## హేబిటేట్ రైట్స్ మరియు రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై అవగాహన సదస్సు



మెళియాపుట్టి, జనవరి 13 ప్రభాతవార్త: మెళియాపుట్టి మండలం కేరాశింగి పంచాయితీ కేరాశింగి గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఇందులో ముఖ్యముగా అటవీహక్కుల చట్టం 2006 ప్రాప్తికి ఆదివాసులకు ఉండే హక్కులు, అటవీ భూమిపై చట్టం ప్రాప్తికి హక్కులు పొందాలంటే ఉన్న సెక్షన్లు, అటవీ హక్కుల కమిటీలు చేయవలసిన పనులు, కమిటీల విధులు, భాధ్యతలు గురించి తెలిపారు. అలాగే హేబిటేట్ హక్కులు, రికార్డ్స్ ఆఫ్ రైట్స్ గురించి మాట్లాడుతూ ఇంతవరకు వ్యక్తిగత హక్కులు పొందడం జరిగింది. ఇంకా హేబిటేట్ హక్కులు పొందవలసి ఉందని, అలాగే హేబిటేట్ రైట్స్ అంటే ఏమి, ఉపయోగాలు గురించి, రికార్డ్స్ అఫ్ రైట్స్ అంటే ఏమి, ఉపయోగాలు గురించి చెప్పారు. పి వి టి జి.ఆదివాసులకు ఆవాసపు హక్కు చాలా అవసరమని, తప్పనిసరి హక్కు కల్పించాలని ప్రభుత్వం చెబుతుంది. అందుకే సోమవారం ఐ. టి.డి.ఎ దర్బారులో హేబిటేట్ హక్కు గురించి ధరఖాస్తు గ్రామం నుంచి వెళ్లి ఇవ్వాలని తెలిపారు. గిరి భూమి పోర్టల్‌లో వ్యక్తిగత పట్టాలు నమోదు చేసుకొనే విధానం, నమోదు లేకుంటే జరిగే నష్టాలు గురించి చెప్పారు. ఈ సదస్సులో కేరాసింగి గ్రామము నుండి 60 మంది వరకు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఏ సి ఓలు ఎ.చిరంజీవిరావు, ఎ.నాగరాజు మరియు రంగారావు సి ఓ, మొబలైజర్సు హరిచ్చంద్రుడు, కల్యాణిలు పాల్గొన్నారు.

## మరణించిన రైతు కుటుంబాలకు చెక్కులు అందజేత



కంచిలి, జనవరి 13 ప్రభాతవార్త: కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామపంచాయతీ విశాఖ డెయిరీ పార్టీ రైతు మార్పు జగ్గయ్య మరణించగా నామిని అయిన మార్పు జయమ్మకు 30 వేల రూపాయలు చెక్కు మాదిన సూరమ్మ మరణించాక వాళ్ళ కుమారుడు మాదిన రాజారావుకు 30వేల రూపాయల చెక్కు ఎంపీటీసీ మాదిన విమల రామారావు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. గ్రామ పెద్దలు గురుమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## పాలవలస రాజశేఖరం సేవలు చిరస్మరణీయం - ఎంపీపీ ధమలపాటి వెంకటరమణ నాయుడు



వీరఘట్టం, జనవరి 13 ప్రభాతవార్త : వైకాపా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ పాలవలస రాజశేఖరం ఈ ప్రాంతానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ ధమలపాటి వెంకట రమణ నాయుడు అన్నారు. రాజశేఖరం ప్రధమ వర్ధంతి సందర్భంగా మండలంలోని చిదిమి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రాజకీయంలో ఎంతోమంది శిష్యులను తయారు చేసి ఆయా ప్రాంతాల అభివృద్ధికి కారకులుగా నిలిచారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లోనే తామంతా పయనిస్తున్నామని, వైకాపా పార్టీ అభివృద్ధికి రాజశేఖరం తనయుడు, ఎమ్మెల్సీ విక్రాంత్‌తో కలిసి తామంతా కృషి చేస్తున్నామన్నారు. వైకాపా పార్టీ సీనియర్ నేతగా, ఈ ప్రాంతంలో గురువుగా పిలుచుకొని ఎంతో పేరుగాంచిన ఆయన నేడు మన మధ్య లేకపోవడం పార్టీకి ఎంతో లోటుగా కనిపిస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలకొండ నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షులు దమలపాటి ఉమామహేశ్వరరావు డిఈఈ ధమలపాటి రవికుమార్ గ్రామ కమిటీ అధ్యక్షులు డి.చిన్నం నాయుడు, గ్రామ యువజన అధ్యక్షుడు వెలగాడ దినేష్, మాజీ ఎంపీటీసీ సామంతుల వేణుగోపాల్ నాయుడు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన రావాడ సీతారాం



వీరఘట్టం, జనవరి 13 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యునిగా రావాడ సీతారాం మంగళవారం అమరావతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ మరియు కమిషన్ కార్యదర్శి చిన్న రాముడు, ఐఏఎస్ సమక్షంలో సీతారాం ప్రమాణ స్వీకారం గావించారు. నేటి నుండి ఏపీ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యాలయంలో అధికారిక చాంబర్‌ను రావాడ సీతారాంకు కేటాయించడంతో, ఆయన పదవీకాలం మరియు అధికారిక విధుల ప్రారంభానికి నాంది పలికినట్లైంది. ఈ నియామకం ఉత్తరాంధ్ర ప్రాంతానికి శుభ పరిణామంగా పరిగణించింది. రాష్ట్ర కమిషన్‌లో ప్రాంతీయ ప్రాతినిధ్యం బలోపేతం కావడంతో పాటు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ మరియు సంక్షేమ కార్యక్రమాలపై మరింత కేంద్రీకృతంగా పనిచేసే అవకాశాలు పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ కమిషన్‌లో రావాడ సీతారాం నియామకం ద్వారా, కమిషన్ కార్యకలాపాలకు మరింత బలం చేకూరడంతో పాటు, ఉత్తరాంధ్రలోని షెడ్యూల్డ్ కులాల సమస్యలకు రాష్ట్రస్థాయిలో తగిన ప్రాధాన్యం లభిస్తుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## కూటమి ప్రభుత్వంలో రహదారులకు అధిక ప్రాధాన్యత : మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, జనవరి 13 (ప్రభాతవార్త): కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధితో పాటు రహదారులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవ సాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం మండలంలోని నిమ్మాడ సాలిపేట గ్రామాల మధ్య రహదారి, సాలిపేటలో సీసీ రోడ్డు, హరిశ్చంద్రపురంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి త్రాగునీరు, చిన్నహరిశ్చంద్రపురం బాపన్నపేట రహదారి, బాపన్నపేట సీసీరోడ్డులను ప్రారంభించారు. అలాగే చిన్న వెంకటాపురం రహదారిలో మని వంతెన నిర్మాణానికి, హరిశ్చంద్రపురం బాపన్నపేట రహదారిలో మిని వంతెన నిర్మాణానికి, చిన్నహరిశ్చంద్రపురం గ్రామం నుంచి స్మశాన వాటిక రహదారి పనులకు, హరిశ్చంద్రపురం వింజాంపాడు గ్రామాలకు తారురోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే హరిశ్చంద్రపురం, కొత్తపేట పంచాయతీలలో పారిశుద్యపనులు స్వచ్ఛసేవ కోసం రెండు ట్రాక్టర్లును ప్రారంభించి అందజేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ రహదారిపై తట్టెడు మట్టి వేసిన పాపన పోలేదని, ఆ ఐదేళ్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని ఆయన ఆరోపించారు. అన్ని గ్రామాలకు, గ్రామాల్లోని వీధులకు రహదారులు, మంచినీటి సౌకర్యం కల్పించటం జరుగుతుందని, వచ్చే మార్చి లోపల అన్ని గ్రామాల్లో సిసిరోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, టెక్కలి ఆర్‌డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి, దేశం నేతలు పూజారి శైలజ సత్యన్నారాయణ, బోయిన రమేష్, హనుమంతు శేషగిరి, ఉప్పాడ జయరాం, నంబాళ శ్రీనివాస్, సాసుమంతు ఆనంద్, కర్రి అప్పారావు, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## ఎస్సైకి ఘన సన్మానం



వీరఘట్టం, జనవరి 13 ప్రభాతవార్త వీరఘట్టం ఎస్ఐ ఎస్.షణ్ముఖరావును మంగళవారం జనసేన పార్టీ బృందం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు గుర్తుగా మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, వీరఘట్టం మండలం జనసేన నాయుకులు మత్స పుండరికం, టౌన్ జనసేన అధ్యక్షులు సరిపల్లి అచ్యుతరావు, సిరాపు నాగరాజు(సూపర్), ఉదయాన చరణ్, సంతనర్సిపురం జనసేన అధ్యక్షులు బొత్స కార్తీక్, బంగారు ప్రశాంత్, బంగారు యాకోబు, పడాల జనార్దన్, గోపాలపురం జనసేన నాయుకులు వెంకంపేట టీడీపీ యువ నాయుకులు రాయిపిల్లి గౌరి, వాన లక్ష్మణ్ రావు మరియు కూటమి నాయుకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా నగర సంకీర్తనలు



సరుబుజ్జిలి, జనవరి 13 ప్రభాతవార్త: మండల కేంద్రం సరుబుజ్జిలిలో ధనుర్మాసం అంటే ధనుష్ సంక్రాంతి నుండి మకర సంక్రాంతి వరకు నెల రోజులు. విష్ణువుకు ప్రీతికరమైన ఈ నెల రోజులు సనాతన ధర్మ మేలుకొలుపులు ఆచరించడం హిందూ ధర్మ సాంప్రదాయం అని, హిందువులకు పవిత్రమైన మాసము ధనుర్మాసము. హిందూ సాంప్రదాయ పద్ధతిలో ఈ ధనుర్మాసం మొదలు పల్లెటూరులో ప్రాతః కాలంలో లేచి బ్రహ్మ ముహూర్తంలో తలంటు స్నానం చేసి నగర సంకీర్తనలు చేయటం ఆనవాయితీ అని సరుబుజ్జిలి గ్రామం భక్తులు తెలియజేస్తున్నారు. ఈ విధంగా చేస్తే శరీర దాడుద్యము జ్ఞాపక శక్తి, భక్తి అభివృద్ధి చెందును. ఈ మాసమంతా హరినామ స్మరణలు వైకుంఠ ద్వార లేదా ఉత్తర ద్వారా దర్శనములు చేసినచో ముక్తి కలుగునని తెలియజేస్తున్నారు. ఈ నెలలో మండలంలోని అన్ని గ్రామాలలోనూ అన్నదాన ప్రసాదాలు జరుపుకుంటారని తెలియజేశారు.

## పండగ పూట వెలగని సెంటర్ లైటింగ్



సీతంపేట, జనవరి 13 ప్రభాతవార్త సంక్రాంతి పండగ దృష్టిలో పెట్టుకొని సీతంపేటలో జనాలు కళకళ లాడుతున్నప్పటికీ సీతంపేట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో కారు చీకటిగా ప్రధాన రహదారి మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ సెంటర్ లైటింగ్ మరమ్మత్తులు గురి కావడంతో వీటిని నివారించలేని పరిస్థితి ఏర్పడింది. తరచూ కారు చీకట్లలో సెంటర్ లైటింగ్ కష్టాలు తప్పడం లేదు. మరో ప్రక్క సీతంపేట మన్యం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో సెంటర్ లైటింగ్ లైట్లు వెలగకపోవడం కారు చీకటిగా ఉండడంతో పర్యటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు .. సంక్షేమం - అభివృద్ధి - సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం.. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి.. రూ. 3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మంత్రి



టెక్కలి, జనవరి 13 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ పంచాయతీలు సమగ్రంగా అభివృద్ధి చెందుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించి రూ.3కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సీసీ రహదారుల ప్రారంభం, శంకుస్థాపనలు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, సువరిపాలన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

### పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవి:

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు బట్టలను, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. సంబంధిత శ్రామిక వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కరోనా వంటి సంక్లిష్ట సమయంలో కూడా ప్రాణాలను లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు.

### సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన :

నియోజకవర్గ కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్సు పనులకు శంకుస్థాపన చేశారు. స్థానికుల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణించిన మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ఇక్కడ సులభ్ కాంప్లెక్సు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తూ సంబంధిత పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతానికి వచ్చే ప్రయాణికులు సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎంతగానో ఉపయోగపడనుంది. శంకుస్థాపన నేపథ్యంలో పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి అచ్చెన్న ఆదేశాలు ఇచ్చారు. మంత్రి అచ్చెన్న చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం, జనవరి 13 ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, పాతపట్నం మాజీ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అని, మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతిబింబమని ఆమె అన్నారు. ఈ భోగి మంటలు మనలోని అజ్ఞానాన్ని తొలగించి, కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ప్రతి ఇల్లు కళకళలాడాలని, ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని ఆమె కోరుకున్నారు. కళకళలాడే ఇంటి ముంగిట రంగవల్లులు, బసవన్నల ఆటపాటలు, హరిదాసుల కీర్తనలు మనకే సొంతమైన ఈ గొప్ప ఆచారాలు ప్రజలందరికీ మధురమైన సంతోషాన్ని పంచాలన్నారు. కష్టాలను దహించే భోగి మంటలు, ధాన్యపు రాశులతో నిండిన గదులు, గోపికలను సూచించే గొబ్బెమ్మలు మరియు గుమగుమలాడే పిండి వంటలతో ఈ పండుగ వాతావరణం ప్రతి ఇంటా వెల్లివిరియాలని, ఈ పండుగ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నియోజకవర్గ ప్రజలకు రెడ్డి శాంతి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.



జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సంతకవిటి గ్రామ యువతతో ఎస్సై ముచ్చటించారు. వారి ఆశయాలు, సవాళ్లు మరియు దేశ నిర్మాణంలో వారిని శక్తివంతం చేయడానికి గల మార్గాల గురించి చర్చించారు. ప్రభాతవార్త-సంతకవిటి

14-1P8exHMNWJQE.qxdo/p:14-1P8exHMNWJQE.qxd 1/1/02 7:02 AM Page 1



## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరో అంతర్జాతీయ గౌరవం

### కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించాలని ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** మాజీమంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావుకు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం లభించింది. మంత్రిగా ఆయన హయాంలో చేసిన అసాధారణ కృషిని, తెలంగాణను ప్రపంచ పటంలో సమున్నత స్థాయిలో నిలిపిన తీరును గుర్తిస్తూ, అంతర్జాతీయ వేదికలపై తన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. సాంకేతికత, పాలన, సుస్థిర అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై ఆయనకున్న లోతైన అవగాహన ప్రపంచవ్యాప్తంగా విద్యా, విధాన నిర్ణేత, వ్యాపార వేదికలపై బలమైన ముద్ర వేసింది. ఈ క్రమంలో, న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్(సిబిఎస్)లో ఏప్రిల్ 4, 2026న జరగనున్న 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ (ఐబిసి)లో ప్రసంగించాలని కెటిఆర్‌కు ఆహ్వానం అందిం చింది. ఈ సదస్సును నిర్వహించే విద్యార్థి విభాగం సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్ (ఎస్ఎబిఎ) ఈ మేరకు ఆయనను ఆహ్వానించింది.

భారతదేశ వ్యాపార, ఆవిష్కరణ, విధాన నిర్ణయ రంగాలపై మేధోమథనం జరిగే ప్రపంచంలోని అత్యున్నత వేదికల్లో ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ ఒకటి. గత 21 యేళ్లుగా న్యూయార్క్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సు, ప్రపంచ ఆర్థిక వ్యవ స్థలో భారతదేశం పోషిస్తున్న పాత్రపై చర్చించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రవాస భారతీయులకు ఒక వేదికగా నిలుస్తోంది. 2026 ఎడిషన్ కాన్ఫరెన్స్‌లో జెరోధా వ్యవస్థాపకుడు నిఖిల్‌కామత్ ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. గతంలో కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సిఇఒ నికేష్ అరోరా, డ్రీమ్ 11 సహ వ్యవస్థాపకుడు హర్ష్ జైన్ వంటి ప్రముఖులు ఈ వేదికపై ప్రసంగించారు. ఇటీవలే హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం అందిన తరుణంలోనే, ఇప్పుడు కొలంబియా బిజినెస్ స్కూల్ నుండి కూడా ఆహ్వానం రావడం విశేషం. కేటీఆర్ నాయకత్వం, విజన్ పట్ల అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం.

గత ఏడాది కూడా ఆయన ఆక్స్‌ఫర్డ్ ఇండియా వీక్ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించి, తన స్పష్టమైన ముందుచూపుతో కూడిన ప్రసంగంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. కేటీఆర్‌ను విశిష్ట వక్తగా ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



ప్రజాభవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 285

**హైదరాబాద్ (బేగంపేట), జనవరి 13, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 285 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 74 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 27 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 146 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 36 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా. జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.జి.హరగోపాల్. చిత్రంలో లక్ష్మణ్, నారాయణరావు తదితరులు

## క్రాంతిచైతన్య, ఇన్నయ్యను విడుదల చేయాలి

### పౌర హక్కుల సంఘం డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్యపై పోలీసులు అక్రమంగా కేసు పెట్టి అరెస్టు చేయడాన్ని తెలంగాణ పౌర హక్కుల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే క్రాంతి చైతన్య, ఇన్నయ్య, దుగ్గనేని మోహన్‌కృష్ణలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్ పౌర హక్కుల సంఘం నాయకులు ప్రొ. గడ్డం లక్ష్మణ్, ఎన్. నారాయణరావు, గుంటి రవి, మాదన కుమారస్వామి, తిరుమలయ్య మాట్లాడుతూ ఎపి పౌర హక్కుల సంఘం 20వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని తిరుపతిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న క్రాంతి చైతన్యపై పోలీసులు అక్రమంగా కేసుపెట్టి అరెస్టు చేశారని, అలాగే వందలాది మంది చిన్న పిల్లలను చేరదీసి చూస్తున్న ఇన్నయ్యను కూడా పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం




మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ నియామకపత్రాలను అందజేస్తున్న వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ, తదితరులు

### రెండేళ్లలో 9,572 ఉద్యోగాలు భర్తీ చేశాం

### త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇస్తాం

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చిడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 9,572 ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 7,267 ఉద్యోగాల భర్తీ చివరి దశలో ఉందన్నారు. త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1,257 మందికి మంత్రి మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఒకేసారి 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు (గ్రేడ్-2) నియామక పత్రాలను అందజేత కార్యక్రమం మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దామోదర్ రాజ నర్సింహ.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా ఈ నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. 2024 సెప్టెంబర్ 11న నోటిఫికేషన్ విడుదల చేయగా, 2025 నవంబర్ నాటికి నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మొత్తం 23,323 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 1257 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. డీఎంఈ పరిధిలో 764, డీపీహెచ్‌లో 300, టీవీవీపీలో 180, ఎంఎన్‌జేలో 13 మందికి పోస్టింగ్స్ ఇచ్చామన్నారు. ఒకప్పుడు రోగి లక్షణాలను బట్టి వైద్యం చేసేవారని, కానీ నేడు రోగ నిర్ధారణ జరిగిన తర్వాతే చికిత్స ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇందుకు ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే రిపోర్టులే డాక్టర్లకు ప్రామాణికమన్నారు. వైద్య వ్యవస్థకు ల్యాబ్ టెక్నీషియన్లు కళ్లు, చెవుల్లాంటి వారని, వారి రిపోర్టుల్లో కచ్చితత్వం ఎంతో ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ల్యాబ్స్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్లు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని మంత్రి దామెదర్ రాజనర్సింహ గుర్తుచేశారు. ఒక్క ఆరోగ్య శాఖలోనే ఇప్పటివరకు 9,572 పోస్టులను భర్తీ చేశామని, మరో 7,267 పోస్టుల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ఆర్థిక శాఖ అనుమతి ఉన్న మరో 996 పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన మంత్రి.. అదనంగా 2,344 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, ప్రతీ జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్స్, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు, ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్స్, గాంధీ ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలోనే నూతన హెల్త్ పాలసీని రూపొందించి, అమలు చేయబోతున్నామని మంత్రి దామెదర్ రాజనర్సింహ తెలిపారు.

## తెలంగాణ స్ఫూర్తిప్రదాత మర్రి చెన్నారెడ్డి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### ప్రజల మనిషి మర్రి చెన్నారెడ్డి: హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



డాక్టర్ మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 107 జయంతి సందర్భంగా ఇందిరాపార్కు లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి రాక్‌గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ మర్రి చెన్నారెడ్డి ఆనాడు తెలుగు రాష్ట్రాలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన లో ఆయన పాత్ర కీలకమైనదని, తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన తన సొంత పార్టీని సైతం వ్యతిరేకించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో, ప్రతి సంవత్సరం ఆయనను స్మరించుకుంటూ ఆయన కుటుంబసభ్యులు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి ప్రజల మనిషి అని, పార్టీలకు అతీతంగా అందరూ ఆయనను అభిమానిస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, బీసీ కమీషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, మర్రి శశిధర్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు భరత్‌గౌడ్, రమేష్‌రాం, మహేందర్ బాబు, మర్రి చెన్నారెడ్డి కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొని, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద, ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

## పిఎంశ్రీ నిధులు సక్రమంగా వినియోగించాలి

### నిధుల దుర్వినియోగానికి పాల్పడిన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వానికి బిటిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** పిఎంశ్రీ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్న నిధులను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని బహుజన టీచర్స్ ఫెడ రేషన్(బిటిఎఫ్) డిమాండ్ చేసింది. నిధులను దుర్వినియోగం చేస్తున్న ప్రధానోయపాధ్యా యులపై చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్పదర్శి చైతన్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం పాఠశాల విద్య డైరెక్టర్‌కి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని 832 పిఎంశ్రీ ప్రభుత్వం పాఠశాలలకు కేటాయించిన నిధులను కొంత మంది ప్రధానోపాధ్యాయులు దుర్వినియోగం చేస్తున్నారని, అట్టి ప్రధానోపాధ్యాయులపై సమగ్రమైనా విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం కొరకు సక్రమంగా ఉపయోగించేలా చర్యలు ఉండాలన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టంగా చెప్పట్టిన పిఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని మౌలిక వసతుల కల్పించి సర్వోన్నతంగా తీర్చిదిద్దాలని, పాఠశాలల నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు 5 సంవత్సరాలకు కోటిన్నర రూపాయలు కేటా యించి అన్ని రకాల మౌలిక వసుతుల కల్పన కోసం చెప్పట్టిన ఒక గొప్ప కార్యాచరణతో ముందుకు పోవాలని చూస్తుందన్నారు. కాని ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో కొన్ని పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిధులను దుర్వి నియోగం చేస్తున్నట్లు అనేక సంఘటనల ఆధారంగా తెలుస్తుందన్నారు. అలా నిధులను దుర్వినియోగం చేసిన ప్రధానో పాధ్యాయులపై సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల విద్య డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో సర్వశిక్ష అభియాన్ ఏఎస్‌పిడికి వినతిపత్రం సమర్పించినట్టు చైతన్య తెలిపారు.

## కర్ల రాజేష్ మృతిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



ముషీరాబాద్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** అక్రమ నిర్భంధానికి గురై, లాకప్ డెత్ అయిన కర్ల రాజేష్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మందకృష్ణమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, ఆయన ఈనెల 17వ తేదీ జరిగిన రాజేష్ పోస్టుమార్టానికి సంబంధిం చిన వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేఖ రులతో మాట్లాడుతూ రాజేష్ మృతిలో పోలీస్ వ్యవస్థతో పాటు డాక్టర్ల నిర్లక్ష్యం కూడా ఉందని ఆరోపించారు. ఎమర్జెన్సీ పేషెంట్‌గా గాంధీ హాస్పిటల్‌కు వచ్చిన రాజేష్‌కు 50 నిమిషాల పాటు ఎటువంటి వైద్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేష్ వ్యవహారంలో కేవలం బీసీ బిడ్డ అయిన సీఐని మాత్రమే సస్పెండ్ చేసి, మిగిలిన దోషులను కాపాడు తున్నారని, తక్షణమే స్పష్టమైన విచారణకై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, టి.వి. నరసింహ మాదిగ, గజ్జల రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పర్వదినం నాటికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తాం

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ఉగాది నాటికి ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామెదర్ రాజనర్సింహ తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను మంత్రి మంగళవారం పరిశీలించారు. పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఎలక్ట్రికల్ వర్క్స్ కొన్ని ఇంకా చేయాల్సి ఉందన్నారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్ ఇతర ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కూడా చివరి దశలో ఉందని తెలిపారు. ఇప్పటికే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎంఆర్ఐ వంటి భారీ యంత్రాల ఏర్పాటు పూర్తయిందన్నారు. తమ ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం ఉండదని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే తమ తాపత్రయమన్నారు.

అన్నిరకాలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉగాది నాటికి పేషెంట్లకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తామని మంత్రి స్పష్ట చేశారు. వెయ్యి బెడ్ల ఈ హాస్పిటల్‌లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పిన మంత్రి దామోదర్ గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సనత్‌నగర్ టిమ్స్ ఉంటుందన్నారు. ఇక్కడే అవసరమైన రీసెర్చ్ జరుగుతుందని, ఇక్కడే అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అన్నిరకాల అవయవమార్పిడి సర్జరీలు చేసేలా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో తెస్తున్నామని, ఆరోగ్యశాఖలో గత రెండేళ్లలోనే సుమారు 10 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పిన మంత్రి.. మరో 7 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ అవుతున్నాయన్నారు. త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని దీంతో డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఎలాంటి కొరత ఉండదని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## తెలంగాణ తల్లి విగ్రహంలోనే స్పష్టంగా సంస్కృతి, సంప్రదాయాలు

### జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ తల్లి విగ్రహంలోనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు స్పష్టంగా ప్రజలకు కనబడుతున్నాయని కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్క రించి మాట్లాడారు. స్వర్గీయ అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహాలు తెలంగాణలో ప్రజా పాలనను ప్రజలకు తెలియజేస్తున్నాయన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలను పేద ప్రజల కోసం అమలు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు కుటుంబ పాలన పోవాలని కోరుకుంటూ ప్రజాపాలనకు స్వాగతం పలికారన్నారు. ప్రజలకు ఏ అవసరాలు ఉన్నాయో ప్రభుత్వం అదే చేస్తుందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు కొంత మందికే అందేవని కాంగ్రెస్ సర్కార్‌లో పేద ప్రజలకు అందేలా కృషి చేయడం జరుగుతుందన్నారు.




సిద్దిపేట కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, చిత్రంలో కలెక్టర్

త్వరలోనే సిద్దిపేట పట్టణంలో రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు వేగంగా చేరుకునేలా జిల్లా అధికార యంత్రంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి, ఆర్డీఓ సదానందం, జిల్లా రవాణ శాఖ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి.ఇమామ్(అత్తు), దేవులపల్లి యాదగిరి, బొమ్మల యాదగిరి, సాకి అనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 20న ఎర్ర బ్యాడ్జీలతో పోరాట దినం

### తీర్మానించిన ఆర్‌టిసి జెఎసి

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఆర్‌టిసిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఎర్ర బ్యాడ్జిలతో పోరాట దినంగా నిర్వహించాలని ఆర్‌టిసి జేఏసీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు పూర్తయిప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఆర్టీసి కార్మికవర్గం తీవ్ర అసంతృప్తితో ఉన్నారని టిజిఎస్ ఆర్టీసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎన్.కమలాకర్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, బి.యాదగిరి అన్నారు.

మంగళవారం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి జెఎసి నేతలు మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అవలంబిస్తోందని, ఎన్ని మార్లు ఆర్టీసి కార్మికుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ పరిష్కారం చేయటంలో తగిన శ్రద్ధ చూపకపోవడంతో.. జెఎసి ఆధ్వర్యంలో గతంలో అనేక పోరాటాలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక దినోత్సవమైన మే 1, 2025న స్వయంగా స్పందించి ఆర్టీసి కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నామని బహిరంగంగా చెప్పి 7 నెలలు కావస్తున్నప్పటికీ ఒక్క డిమాండ్ కూడా పరిష్కరింపచేయలేదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనగా మరో పోరాటానికి జెఎసి శ్రీకారం చుట్టనుందని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు పోస్టుకార్డు ఉద్యమం చేయాలని జెఎసి నిర్ణయించినట్టు తెలిపారు.

అనంతరం ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి కార్మికులు, ఉద్యోగులు అందరూ ఎర్ర బ్యాడ్జీలు (రిబ్బన్లు) ధరించి "పోరాట దినం" పాటించాలని నిర్ణయించినట్టు తెలిపారు. జెఎసి ఇచ్చిన ఈ ఉద్యమ కార్యాచరణను కార్మికవర్గమంతా ఐక్యంగా విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ సమావేశంలో జె.రాఘవులు, కె.రామిరెడ్డి (ఈయు), బి.యాదయ్య కోశాధికారి, సి.సత్తయ్య, ఎం.హెచ్.ఆలీ, బుద్ధ విశాల్, జి.రాములు (బికెయు), రాంచందర్, బి.శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదు

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పందించారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటి బొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యా యని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టిపిసిసి చీఫ్ తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిసామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కెసిఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

14-1P□g7exHMNWJQE.qxdo/p:14-1P□g7exHMNWJQE.qxd 1/1/02 7:02 AM Page 1





## జూదాలు, కోడి పందాల బరులు సిద్ధం

### కోర్టు ఆదేశాలు... పోలీసు హెచ్చరికలు బేఖాతర్

జగ్గయ్యపేట, జనవరి 13 ప్రభాతవార్త: సంక్రాంతి సంబరాల పేరుతో అసాంఘిక పనులకు పాల్పడ కూడదని కోర్టు ఆదేశాలున్నా.. పోలీసు హెచ్చరికలు చేసినా నిర్వాహకులు బేఖాతర్ చేస్తున్నారు. తగ్గేదేలే అంటూ పందాల బరులను జెసిబిలతో చదును చేసి పటిష్టమైన టెంట్లువేసి ముస్తాబు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని కోడి పందాలు, కాయ్ రాజా కాయ్ జూదాలు జోరుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం రండి తరలిరండూ అంటూ తెగించారు. పాలకుల ప్రోత్సాహం, తోడ్పాటుతో పోలీసులు కూడా చూసి చూడనట్లు ఉంటారులే, ఇది ప్రతి సంవత్సరం జరిగే తంతేగా అంటూ గ్రామాల శివార్లలో పొలాలు, మామిడి తోటల్లో ప్రత్యేక శిబిరాలను బెట్టింగ్స్ బృందాలు సిద్ధం చేశారు. కోడి పందాలు మరోపక్క పేకాటలు, మూడు ముక్కల జూదాలు, మద్యం అమ్మకాలకు ఎప్పటిలాగే నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఎన్ని రకాల నిబంధనలు ఉన్నా ఈ జాతర కొనసాగితీరుతుందనే ధీమా నిర్వాహకులు, జూదరుల్లో బలంగా ఉంది మరి.

## రేరా అనుమతి లేని వెంచర్‌లో ప్లాట్లు కొనవద్దు

విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి రెరాలో ఇప్పటి వరకు నిర్మాణదారులు, డెవలపర్లు, కొనుగోలుదారులు వారి ప్రాజెక్టులను నమోదు చేసుకోకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని ఎపి రెరా ఛైర్మన్ శివారెడ్డి కోరారు. సిఆర్‌డిఎ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన రెరా కమిటీ ఏర్పాటై నాలుగు నెలలైందని, ఈ సందర్భంగా, కొనుగోలుదారుల ప్రయోజనాలే లక్ష్యంగా ఉమ్మడి 13 జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెరా అనుమతి లేని వెంచర్‌లో ప్లాట్లు, ఫ్లాట్‌లు కొని వినియోగదారులు నష్టపోవద్దని సూచించారు. 2019లో ప్రభుత్వం మారడం, కరోనా పరిణామాల వల్ల చాలా మంది నిర్మాణదారులు, డెవలపర్లు, కొనుగోలుదారులు రెరాలో వారి ప్రాజెక్టులను నమోదు చేసుకోలేదని తెలిపారు. అలాంటివారికి మార్చి 31 వరకు అవకాశం కల్పించామని తెలిపారు. అలాగే, ప్రాజెక్టు పురోగతి గురించి దాఖలు చేసి, క్వార్టర్లీ అప్డేట్స్ సకాలంలో దాఖలు చేయని వారికి కూడా 50 శాతం పెనాల్టీపై దాఖలు చేసే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అథారిటీలో తమ ప్రాజెక్టులను నమోదు చేసుకోని వారు కనీసం ప్రకటనలు ఇవ్వడం గానీ, విక్రయించడం గానీ, అగ్రిమెంట్ చేసుకోవడం గానీ చేయకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపైన ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం పెనాల్టీ విధిస్తామని ఛైర్మన్ శివారెడ్డి హెచ్చరించారు. డాక్యుమెంటేషన్ అంతా రెరా వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో కడపలో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

## ఆడబిడ్డ నిధి ఎప్పుడు అమలు చేస్తారు?



విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలో ఏడాదిన్నర క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కూటమి అధినేతగా చంద్రబాబు మహాశక్తి గ్యారంటీలో భాగంగా ఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకం ఇప్పటివరకూ అమలు కాలేదని పిసిసి ఛీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. వరుసగా రెండోఏడాది కూడా ఈ పథకం అమలు చేయకపోవడంపై ఆమె సిఎం చంద్రబాబును ప్రశ్నించారు. రెండేళ్లు కావస్తున్నా మహాశక్తి పథకానికి అతి గతి లేదన్నారు. పండుగల పేరు చెప్పి కాలయాపన తప్ప మహిళా సాధికారితపై చంద్రబాబుకు కమిట్మెంట్ లేదన్నారు. ఈ పథకం కావాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని ఒకరు, మహిళలు రెడీగా ఉండమని మరొకరు.. దీపావళి, సంక్రాంతికి ఇస్తామని ఇంకొకరు ఆడబిడ్డల మనోభావాలతో ఆటలాడుతున్నారని షర్మిల ఫైర్ అయ్యారు. ఆడబిడ్డ నిధి పేరుతో కోటిన్నర మంది రాష్ట్ర మహిళలకు సిఎం చంద్రబాబు చేసింది ఘరానా మోసమే అన్నారు. మహిళల అభివృద్ధికి పెద్దపీట అంటూ చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి బూటకపు మాటలే అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఆడబిడ్డ నిధి ప్రధాన హామీ అని, 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు ఆర్థికంగా భరోసా నిచ్చే హామీ అని అన్నారు. ప్రతి ఏడాది 18 వేలు లబ్ధి చేకూరే పథకానికి రెండేళ్లుగా పంగనామాలు పెడుతూ.. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకోడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గుండాలన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటినుంచి అమలు చేస్తారో చెప్పాలన్నారు. నచ్చినప్పుడు, ఇష్టం ఉన్నప్పుడు అమలు చేసేవి కావు ఎన్నికల హామీలు అన్నారు. మహాశక్తి పథకాన్ని తక్షణం అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని షర్మిల డిమాండ్ చేశారు.

# కెమికల్ ఫ్యాక్టరీల వైఖరిపై సమర శంఖారావం

- ప్రాణాలొడ్డి కాలుష్యభూతాలను తరుముతాం
- జెపిసి ప్రతినిధుల బృందం హెచ్చరికలు
- శ్మశానంగా మారుతున్న జగ్గయ్యపేట ఆటోనగర్

జగ్గయ్యపేట, జనవరి 13 ప్రభాతవార్త: పరిశ్రమలు రావాలి, పిల్లలకు ఉద్యోగ ఉపాధులు పెరగాలి, అభివృద్ధి సాధించాలని కలలుగన్న ప్రజల కళ్ళల్లో సిమెంట్ బూడిద, దేహంలో రసాయనాల విషం నేటి తరంతోపాటు భవిష్యత్ తరాల ఉనికికి మరణశాసనం లిఖిస్తున్నాయంటూ బాధిత ప్రజానీకం ఆక్రోసిస్తోంది. దాదాపు దశాబ్ధకాలంపాటు అనేక ఆందోళనలు, పోరాటాలు చేసినా కనికరంలేని పాలకులు, పట్టించుకోని అధికారుల స్వార్ధ చింతనతో ఇక్కడ కాలుతున్న చితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందని విలపిస్తున్న కుటుంబాల గురించి పట్టించుకున్న నాధులు లేకపోవటం దారుణమంటూ బాధితులు కంటనీరు పెడుతున్నారు. పీల్చే గాలిలో కాలుష్యం, భూగర్భ జలాల్లో రసాయనాల కాలుష్యం, పలువురు బాధ్యతాయుత రాజకీయ నాయకుల మనసుల్లో పేరుకు పోతున్న కాలుష్యం వెరసి సగటు మనుషుల, ఆయుష్షు-ఆరోగ్యం అంపశయ్యపై రక్తంఒడ్డిన భీష్ముని లా మారిపో యిందంటూ పలువురు విద్యావంతులు, మేధావులు, సామాజిక సేవికులు వాపోతున్నారు. విషం కక్కుతున్న కెమికల్ ఫ్యాక్టరీల వైఖరిపై సమర శంఖం పూరించేందుకు జెపిసి ప్రతినిధుల బృందాన్ని సంఘటిత పర్చారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణ శివారులోగల ఆటోనగర్‌లో గల ఏడు కెమికల్ కర్మాగారాలు స్వలాభం కోసం నిబంధనలు పాటించకుండా ప్రకృతి సంపదనలను కలుషితం చేస్తున్న సంఘటలు తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. ప్రజలు ఫిర్యాదుచేయటం, పాలకులు, అధికారులు చుట్టపుచూపుగా వచ్చి తిలకించి చర్యలు తీసుకుంటామంటూ యధావిధి హామీలు ఇస్తూ నిష్క్రమిస్తున్న సంఘటనలు హాస్యాస్పదంగా కొనసాగుతున్నాయంటూ జెపిసి ప్రతినిధులు విమర్శించారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 28 యూనియన్లతో ఏర్పాటైన జెపిసి రాబోవు రోజుల్లో తాము చేపట్టబోవు ప్రజా ఉద్యమం గురించి వివరించారు. తమ ప్రాణాలు దారపోసైనా కాలుష్యాన్ని నియంత్రింపజేసి తీరుతామంటూ ప్రతినబూనారు. ఆటోనగర్ ప్రాంతంలోని 300లకు పైగా గల పరిశ్రమల్లో 200లకుపైగా కాలుష్యం వలన మూతపడిపోయాయని, భూగర్భ జలాలు రసాయనాలతో కలుషితమై పట్టణంలోని శాంతినగర్ వరకు విస్తరించాయని, రాబోవు కాలంలో జగ్గయ్యపేట పట్టణంలోని బోర్లు కూడా ఎందుకూ పనికిరాకుండా పోవటమే కాకుండా ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలస పోవాల్సిన అగత్యం వస్తుందంటూ వారు ఆందోళన వ్యక్తంచేశారు. అగ్నిమాపక అనుమతులు, ఫ్యాక్టరీస్‌కు సంబంధించిన అనుమతులు తీసుకోకుండా ఫ్యాక్టరీని రెండు నెలలుగా రన్‌చేస్తున్నారని వారు తెలిపారు. కనీసం ఫ్యాక్టరీ పేరుతో బోర్డు కూడా ఏర్పాటుచేయకుండా ప్రమాద నివారణ, భద్రతా నియమాలు పాటించకుండా వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, యాసిడ్ కెమికల్ వేపన్ న్యూట్రల్‌చేసే స్క్రబ్బర్‌ను కూడా ఏర్పాటుచేసుకోకుండా ఫైర్ హైడ్రేట్ లేకుండా ఫ్యాక్టరీని నడుపటం చట్టవ్యతిరేక మన్నారు. కార్మికులకు, సిబ్బందికి కనీస నైపుణ్యాలు కూడా లేవని, రసాయన పదార్ధాల ఎంఎస్‌డిఎస్, రక్షణ జాగ్రత్తల ఎస్‌ఓపిలు, కనీస జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఇంత దారుణంగా ప్రవర్తిస్తున్న వారిపై ఏ ప్రభుత్వం కూడా కఠిన చర్యలు తీసుకోకపోవటం వలననే ప్రజలు దురావస్థకు, ఆరోగ్య దోపిడీకి గురవుతున్నారంటూ ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జెపిసి నాయకులు ధరణికోట వెంకటరమణ, డాక్టర్ బొజ్జా రాజేష్, మందడపు శ్రీనివాసరావు, గద్దే నాని, కర్లపాటి శ్రీనివాస్, కనపర్తి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, యలమంచిలి రాజేంద్రప్రసాద్, కె మార్షల్ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



విషం కక్కుతున్న కెమికల్ ఫ్యాక్టరీల వైఖరిపై సమర శంఖం పూరిస్తున్న జెపిసి ప్రతినిధుల బృందం



## ఘనంగా ఎన్‌ఏఆర్‌ఎల్ నిర్వాహకుల మేధోమథన సమావేశం

పాకాల, జనవరి 13 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం గాదంకి రెవెన్యూ గ్రామంలో ఉన్న ఎన్‌ఏఆర్‌ఎల్ వాతావరణ, అయానోస్ఫిరిక్ శాస్త్రాల రంగంలో విజయవంతమైన ఆవిష్కరణలు, పరిశోధనల 33 సంవత్సరాలను గుర్తుచేసుకుంటూ నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ తన వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. భవిష్యత్తు కార్యక్రమ ప్రణాళికలను మరింత బలోపేతం చేయడానికి మంగళవారం ఒక మేధోమథన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌ఏఆర్‌ఎల్ మాజీ డైరెక్టర్లు, వివిధ ఇస్రో కేంద్రాలు, యూనిట్ల డైరెక్టర్లు, ప్రధాన జాతీయ సంస్థల అధిపతులు, ఇస్రో కేంద్రాల నుండి నామినేట్ చేయబడిన సభ్యులు, ఆహ్వానించబడిన నిపుణులు, ఎన్‌ఏఆర్‌ఎల్ నుండి పిహెచ్‌డిలు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు, ఎన్‌ఏఆర్‌ఎల్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు పాల్గొన్నారు. ఎన్‌ఎంఆర్‌ఎఫ్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పి.బి. రావు, ఎంఎస్‌టి రాడార్ టెక్నాలజీ, మిడిల్ అట్మాస్ఫియర్ ప్రోగ్రామ్ మార్గదర్శక అభివృద్ధిని గుర్తుచేసుకున్నారు. ఎంఎస్‌టి రాడార్ ఫెసిలిటీని స్థాపించడంలో శాస్త్రీయ సమాజం సమిష్టి ప్రయత్నాలను ప్రశంసించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్, ఎ.ఎస్. కిరణ్‌కుమార్ ఇస్రో కార్యక్రమాలతో ఎన్‌ఏఆర్‌ఎల్ సన్నిహిత అనుబంధాన్ని జాతీయ అనువర్తనాల కోసం సిఓఆర్‌ఎస్ నావల్ సి డేటాను ఉపయోగించడంలో ఎన్‌ఏఆర్‌ఎల్ గణనీయమైన సహకారాన్ని హైలైట్ చేశారు. స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నీలేష్ దేశాయ్; షార్ అండ్ యుఆర్‌ఎస్‌సి మాజీ డైరెక్టర్ డాక్టర్ పి. కున్హికృష్ణన్; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నెటిజం డైరెక్టర్ డాక్టర్ ఎ.పి. దిమ్రీ; ఐఐఎస్‌టి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపాంకర్ బెనర్జీ; ఎడిఆర్‌ఐఎన్‌ఎస్ డైరెక్టర్ డాక్టర్ నోబ్లిన్ జాకబ్; ప్రొఫెసర్ కె. మోహన్ కుమార్, ప్రొఫెసర్ శ్యామ్‌లాల్, ఇతర విశిష్ట అతిథులతో కలిసి, ఎన్‌ఎంఆర్‌ఎఫ్ ఎన్‌ఏఆర్‌ఎల్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇన్‌స్టిట్యూట్ అద్భుతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. మేధోమథన సమావేశంలో ఎన్‌ఏఆర్‌ఎల్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల యొక్క అవలోకనాన్ని ప్రదర్శించారు. ఎన్‌ఏఆర్‌ఎల్‌లో నిర్వహించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను నిపుణులు ప్రశంసించారు.

### నారాయణ్‌పేట్, సిసిఎస్‌లో నమోదైన కేసులపై

## సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** నారాయణ్‌పేట్‌లోని మద్దూరుతో పాటు సిసిఎస్‌లో నమోదైన రెండు కేసులపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నేతృ త్వంలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన సిట్ ఏర్పాటయ్యింది. ఈ మేరకు సర్కారు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సిఎం రేవంత్ రెడ్డి ఫోటోలను అసభ్యకరంగా పోస్ట్ చేసిన వ్యవహారంలో పబ్లిక్ టివి వాట్సాప్ గ్రూప్ నిర్వాహకుడు కావలి వెంకటేష్‌పై మద్దూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11వ తేదీన ఈ కేసు నమోదయ్యింది. తాజాగా మహిళా ఐఎఎస్ అధికా రిని కించపరిచే వార్తలు ప్రసారం చేసిన వ్యవహారంపై రెండు న్యూస్ చాళ్లతో పాటు 7 యూట్యూబ్ చానళ్లపై సిటీ సిసిఎస్‌లో కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 75, 78, 79 (వేధింపులు, మహిళల గౌరవానికి భంగం కలిగించడం), 351 (1), 352 (2) (శాంతి భ ద్రతలకు విఘాతం కలిగించేలా అవమానించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు ఘటనలపై సమగ్ర విచారణకు సర్కారు సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్‌కు సజ్జన్నార్ నేతృత్వం వహించనుండగా ఇందులో సిటీ పోలీసు విభాగంలోని ఉత్తర రేంజి జాయింట్ సిపి శ్వేత, చేవెళ్ల డిసిపి యోగే ష్ గౌతం. సిటీ పరిపాలనా విభాగం డిసిపి వెంకటలక్ష్మి, సైబర్ క్రైం డిసిపి అరవింద్‌బాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ప్రతాప్ కుమార్, సిసిఎస్ ఎసిపి గురు రాఘవేంద్ర, సిఐ సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ రెడ్డి, షీ సైబర్ సెల్ ఎస్ఐ హరీష్‌లు సభ్యులుగా వున్నారు.





## 'కాల్ ఫర్ బ్లడ్' వెబ్‌యాప్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** రక్తం అవసరమైన వారికి వెంటనే ధాతలను అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో రూపొందించిన కాల్ ఫర్ బ్లడ్ ఫౌండేషన్ వెబ్ అప్లికేషన్‌ను డిజిపి శివధర్ రెడ్డి మంగళవారం నాడు ప్రారంభించారు. లక్డికాపూల్‌లోని తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో డిజిపి దీనికి సంబంధించిన వెబ్ యాప్‌ను ప్రారంభించడంతో పాటు పలు అంశాలపై మాట్లాడారు. రక్తం అవసరమయ్యే వారికి ఆ సమయంలో ధాతలను గుర్తించే సాంకేతిక సదుపాయం ఈ యాప్‌లో అందుబాటులో వుంటాయని డిజిపి తెలిపారు. రక్త ధాతల వివరాలు గోప్యంగా వుండే విధంగా ఆధునిక సాంకేతికతతో దీనిని రూపొందించారని ఆయన తెలిపారు. ఒకసారి రక్తదానం చేసిన వారి పేర్లు నిర్ణీత కాలం వరకు మళ్లీ ఇందులో కనిపించకుండా ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలసిన వారికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడు తుందని డిజిపి తెలిపారు. కాల్ ఫర్ బ్లడ్ ఫౌండేషన్ తీసుకువచ్చిన ఈ యాప్ రక్తం అవసరమయ్యే వారికి ఎంతగానో సహాయ పడుతుందని ఆయ న తెలిపారు. అందరి మంచి కోసం ఏర్పాటైన ఈ ఫౌండేషన్‌ను డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చింతల సం పత్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## బాధ్యత లేకుండా భావప్రకటన స్వేచ్ఛ వినియోగించరాదు

### మహిళాఅధికారుల పట్ల అసభ్యంగా రాయడం, కూయడం గర్హనీయం

### సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** రాజ్యాంగం హామీ ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ అత్యంత విలువైనదని, సమాజానికి ప్రాణవాయువు లాంటిదని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రిటైర్డ్ లోకాయుక్తా (గోవా) జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే రాజ్యాంగం పరిమితుల్లేని స్వేచ్ఛకు హామీనివ్వలేదని తెలిపారు. ఇటీవల ఓ ఐఏఎస్ అధికారిణి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా ప్రసారం చేసిన కథనాలను సుదర్శన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ఖండిరచారు. సోషల్ మీడియా అయినా సరే, ప్రధాన స్రవంతిలోని మీడియా అయినా సరే.. ప్రచార సాధనాలు ఏవైనా, బాధ్యత లేకుండా భావ ప్రకటన స్వేచ్ఛను వినియోగిస్తే నియంత్రణ కూడా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తుందని, ఇది కూడా అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. స్వీయ నియంత్రణ, సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించడం చేతగాకపోతే మీ భావ ప్రకటనా స్వేచ్ఛను మరొకరు నియంత్రించకుండా మీకు మీరే ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటే మంచిదని సూచించారు. తమ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేటువంటి యువ అధికారిణిల పట్ల అసభ్యంగా, బాధ్యతా రహితంగా భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో అమర్యాదగా, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేవిధంగా రాయడం, కూయడం అత్యంత గర్హనీయమని, పురుషాధిక్యత భావజాలంతో కూడిన ప్రమాదకరమైన దుశ్చర్య అని తన ప్రకటనలో తప్పుబట్టారు.

# 19న బిజెపి జాతీయ అధ్యక్షుని ఎన్నిక

- నామినేషన్ దాఖలు చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్‌నబిన్
- 20న లాంఛనంగా ఆయన పేరు ప్రకటన

**న్యూఢిల్లీ, జనవరి 13:** భారతీయ జనతాపార్టీ సంస్థాగత జాతీయ ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్‌నాయకుడు నితిన్‌నబిన్ జాతీయ అధ్యక్షుడుగా నామినేషన్ దాఖలుచేయనున్నారు. ఈ ఎన్నిక లాంఛన ప్రాయం మాత్రమే. పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా గత డిసెంబరులో బాధ్యతలుస్వీకరించిన నితిన్ తన నామినేషన్ పత్రాలను ఈనెల 19వ తేదీ దాఖలుచేస్తారు. జనవరి 20వ తేదీనే ఆయన బిజెపి కొత్త జాతీయ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ నేతలు చెపుతున్నారు. అందరు బిజెపి రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బిజెపి అన్ని రాష్ట్రాల అధ్యక్షులు, జాతీయ కార్యవర్గం, ఇతర కీలక నాయకులు సీనియర్ బిజెపి నాయకులు నామినేషన్‌రోజున ఢిల్లీకి రావాలని పార్టీ వర్తమానాలు పంపించింది. బిజెపి చీఫ్ ఎలక్షన్ అధికారి కె.లక్ష్మణ్ బిజెపి అధ్యక్షుడుగా ఆయన పేరును అధికారికంగా ప్రకటిస్తారు. మూడు సెట్ల నామినేషన్లు ఈమేరకు ఆయన దాఖలుచేస్తారు. ఒక సెట్‌పై 20 మందికిపైగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సంతకాలుచేయాలి. మరోసెట్‌పై ప్రధాని నరేంద్రమోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, పార్టీ ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జెపినడ్డాలు సంతకంచేస్తారు. ఇక మూడోసెట్‌పై బిజెపి జాతీయ కార్యవర్గసభ్యుల సంతకాలుంటాయి. ఒకే ఒక్క పేరు వస్తుండటంతో బిజెపి జాతీయ అధ్యక్షుడుగా నితిన్‌నబిన్ పేరు దాదాపుగా ఖరారయినట్లే. ప్రస్తుత అధ్యక్షుడు జెపినడ్డా ఆధ్వర్యంలో ఇప్పటికే పార్టీ జాతీయ స్థాయి సమావేశం నిర్వహించింది. నితిన్‌నబిన్‌తోపాటు బిఎల్ సంతోష్; సునీల్ బన్సాల్, అరుణ్‌సింగ్, తరుణ్‌చుగ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బిజెపి అధ్యక్ష ఎన్ని కకకు సన్నాహాలు, ఏర్పాట్లను ఈ సమావేశంలో సమీక్షించారు ఈనెల 19,20 తేదీల్లోనే ఈ ఎన్నిక పూర్తవుతుంది. బీహార్‌కు చెందిన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రకేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నితిన్ నబిన్‌ను ముందుగా జాతీయ కమిటీకి వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా నియమించిన



బిజెపి తదనంతరం ఆయన్నే రెగ్యులర్ అధ్యక్షుడుగా ఎన్నుకుంటున్నది. ఇప్పటివరకూ పనిచేసిన జెపినడ్డా రెండుసార్లు పదవీకాలం పొడిగింపు పొందారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోను, పార్లమెంటు ఎన్నికల సమయంలో కూడా ఆయన పదవీకాలం పొడిగించారు. ప్రస్తుతం నడ్డా కేంద్రమంత్రిగా కూడా పనిచేస్తుండటంతో పార్టీ అధ్యక్షపదవికి మార్పు అనివార్యం అయింది. ఇందులో భాగంగానే నితిన్‌నబిన్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన కేంద్రం లాంఛనప్రాయంగా ఎన్నికలు నిర్వహిస్తోంది. ఇకపై బిజెపికి పూర్తికాలపు అధ్యక్షుడుగా బీహార్ నేత నితిన్‌నబిన్ కొనసాగనున్నారు.



## కిలో చికెన్ రూ.350కి చేరిక

### మటన్ కేజీ రూ.950

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో పండుగ వేళ చికెన్ రేట్లు పెరగడం షాకిస్తోంది. పండుగ డిమాండ్‌ను పౌల్ట్రీ వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ కారణంగా చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. సాధారణ రోజుల్లో రూ. 240 ఉన్న చికెన్ ఇప్పుడు స్కిన్‌లెస్ రూ.340 నుండి రూ.350 వరకు, లైవ్ చికెన్ రూ.180 వరకు పలుకుతోంది, అలాగే నాటుకోడి ధర రూ.2 వేల నుండి రూ.2,900 వరకు చేరింది. డిమాండ్ పెరగడం, ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతు న్నారు. దీంతో నాన్‌వెజ్ మార్కెట్లలో సందడి తగ్గింది. హైదరా బాద్‌లో అయితే కిలో కోడి మాంసం రూ.300 నుండి రూ.320 వరకూ పలుకుతోంది. నాటుకోడి సంగతి అయితే చెప్ప నక్కర్లేదు. మామూలు రోజుల్లో నాటుకోడి రేటు ఇప్పుడు ఏకంగా రూ.3 వేలకు అమ్ముతున్నారు. మటన్ ధర కూడా కిలో రూ.950 అమ్ముతున్నారు.

# మరికొన్ని సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 13, ప్రభాతవార్త :** మకరవిళక్కు పండుగ సీజన్‌ను పురస్కరిం చుకుని ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యం లో దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్యస్థానాల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. రైలు నెం. 06067 తిరువనంతపురం సెంట్రల్ - చర్లపల్లి స్పెషల్: జనవరి 15న గురువారం ఉద యం 4.10 గంటలకు తిరువనంతపురం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రైలు నెం. 06068 చర్లపల్లి - తిరువనంతపురం సెంట్రల్ స్పెషల్: జనవరి 16న శుక్రవారం రాత్రి 9.45 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 8.00 గంటలకు తిరువనంతపురానికి చేరుకుంటుంది. రైలు నెం. 06065 కొల్లం జంక్షన్ - కాకినాడ టౌన్ స్పెషల్: జనవరి 15న గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు కొల్లం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. రైలు నెం. 06066 కాకినాడ టౌన్ - ఎర్నాకులం స్పెషల్: జనవరి 16న శుక్రవారం సాయంత్రం 6.00 గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది. తిరువనంతపురం- చర్లపల్లి- తిరువనంతపురం స్పెషల్ రైళ్లు కొల్లం, చెంగన్నూర్, తిరువల్ల, చంగనాస్సేరి, కొట్టాయం, ఎర్నాకులం జంక్షన్, అలువా, త్రిస్సూర్, పాలక్కాడు, పొద నూర్, తిరుప్పూర్, ఎరోడ్, సేలం, జోలార్‌పేట్టై, కట్పాడి, రేనిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్లలో ఆగుతాయి. కొల్లం-కాకినాడ టౌన్ స్పెషల్ రైలు కాయంకులం, చెంగన్నూర్, తిరువల్ల, చంగనాస్సేరి, కొట్టాయం, ఎర్నాకులం జంక్షన్, ఎర్నాకులం టౌన్, అలువా, త్రిస్సూర్, పాలక్కాడు, పొదనూర్, తిరుప్పూర్, ఎరోడ్, సేలం, జోలార్‌పేట్టై, కట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు, రాజమండ్రి, సమల్కోట్ స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. కాకినాడ టౌన్-ఎర్నాకులం స్పెషల్ రైలు సమల్కోట్, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, పెరంబూర్, కట్పాడి, జోలార్‌పేట్టై, సేలం, ఎరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడు, త్రిస్సూర్, అలువా స్టేషన్లలో ఆగుతుంది. ఈ ప్రత్యేక రైళ్లలో ఏసీ 3టియర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు.

## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ పట్టివేత

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి గుజరాత్‌లోని సూరత్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఓ అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి 6.28 కిలోల నాణ్యమైన గంజాయిని జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివ రాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషాలోని గంజాం జిల్లా చంద్రాపూర్‌కు చెందిన అనంత స్వాయి న్ (32) స్థానికంగా సెక్యూరిటీ గార్డుగా వున్నాడు. అయితే ఇందులో పెద్దగా జీతం లేక పోవడంతో అతను పక్కదారి పట్టాడు. తానుండే ప్రాంతానికి చెందిన ఆనంద్ స్వయిన్ అనే గంజాయి స్మగ్లర్‌తో చేతులు కలిపి తాను కూడా ఈ దందాలో దిగాడు. గంజాయి స్మగ్లింగ్ చేస్తే దండిగా డబ్బులు వస్తాయని ఆనంద్ చెప్పడంతో అనంత అంగీకరించాడు. ఈ క్రమంలో ఇతను పలుమార్లు గం జాయి స్మగ్లింగ్ చేసి కొంత గడించాడు. తాజాగా ఆనంద్ అనంతకు 6.28 కిలోల గంజాయిని ఒడిషాలో ఇచ్చి దీనిని గుజ రాత్‌లోని సూరత్‌లో తనకు పరిచయం వున్న స్మగ్లర్‌కు ఇవ్వాలని కోరాడు. దీని తరువాత అనంత గంజాయి వున్న సూట్ కేసుతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఒడిషా నుంచి సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం వచ్చాడు. అన ంతరం గంజాయితో సహా ఎంఎంటిఎస్ రైలులో సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కాచి గూడ స్టేషన్‌కు వచ్చాడు. ఇక్కడి నుంచి అనంత గంజాయిని తీ సుకుని సూరత్‌కు వెళ్లాల్సి వుంది. అయితే అనంత గురించి పక్కా సమాచారం వున్న ఈగల్ పోలీసులు కాచిగూడ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి అ తన్ని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ మూడు లక్షల 14 వేల రూపాయలుగా పోలీసులు తెలిపారు. కాగా రాష్ట్రంలో గంజాయి లేదా ఇతర ఎలాంటి డ్రగ్స్ గురించి సమాచారం వున్నా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా 8712671111కు తెలపాల ని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.

## హాకీ ఇండియా లీగ్‌లో..
# హైదరాబాద్ ఓటమి
### పైపర్స్ విజయం



**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా లీగ్ 2025-26 సీజనులో హైదరాబాద్ టూఫాన్స్‌పై 2-1 తేడాతో ఎస్‌జి పైపర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. విజేతల తరఫున టోమస్ డొమెనే 2 గోల్స్ సాధించగా, గోల్ కీపర్ టోమస్ శాంటియాగో అద్భుతంగా గోల్ చేశాడు. టూఫాన్స్ తరఫున అమన్‌దీప్ లక్రా గోల్ చేశాడు. ఈ పోటీలో పైపర్స్ అద్భుతంగా రాణించి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను సాధించగా, థామస్ డొమెనే (8వ నిముషం) డ్రాగ్‌ఫ్లిక్ ద్వారా ఒకదాన్ని గోల్‌గా మార్చాడు. తొలి 15 నిమిషాల్లో పైపర్స్‌కు మొత్తం 6 పెనాల్టీ కార్నర్లు లభించింది. హైదరాబాద్ 5 సర్కిల్ ఎంట్రీలను నమోదు చేస్తూ ఆటలోకి అడుగుపెట్టింది. రెండవ క్వార్టర్‌ను ప్రారంభించే సమయానికి టూఫాన్స్ తమ ప్రత్యర్థిని వెనక్కి నెట్టి, గోల్‌పై 12 సర్కిల్ ఎంట్రీలు, 4 పెనాల్టీ కార్నర్‌లను నమోదు చేసింది. గోల్‌పై 7 షాట్లు నమోదు చేసినా అవి ఎటువంటి ఫలితాన్ని ఇవ్వలేదు. టోమస్ డొమెనే(29) ద్వారా పైపర్స్ తమ రెండవ గోల్‌ను సాధించడంతో హాఫ్ టైంలో పైపర్స్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించింది. హైదరాబాద్ మూడవ క్వార్టర్‌లో 8 సర్కిల్ ఎంట్రీలు, 2 పెనాల్టీ కార్నర్‌లను నమోదు చేశారు. అమన్‌దీప్ లక్రా(41) తన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ సాధించడంతో చివరి క్వార్టర్‌లోకి 2-1 స్కోరుతో టూఫాన్స్‌కు పోరాడే అవకాశం ఇచ్చాడు. హైదరాబాద్ చివరి క్వార్టర్‌లో 16 సర్కిల్ పెనెట్రేషన్‌లు, 6 పెనాల్టీ కార్నర్‌లను సాధించినా, టోమస్ శాంటియాగో జాకరీ వాలెస్‌నుగోల్ చేయనీయకుండా అడ్డుకోవడంతో పైపర్స్ టోర్నమెంట్‌లో తమ మొదటి విజయాన్ని నమోదు చేసింది.

# అండర్19 ప్రపంచ కప్‌లో భారత్ ఓటమి
### ఇంగ్లండ్ 20 రన్స్ తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** అండర్19 ప్రపంచ కప్ 2026లో భాగంగా చివరి మ్యాచ్‌లో భారత్ ఇంగ్లాండ్ చేతిలో 20 పరుగుల (డబ్ల్యుఎల్‌ఎస్ పద్ధతి) తేడాతో ఓడిపోయింది. బులవాయోలో జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ థామస్ రెవ్ అజేయంగా 71 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ మూడు వికెట్లకు 196 పరుగులు చేసింది. అయితే 34.3 ఓవర్ల తర్వాత వర్షం ఆటను నిలిపివేసింది. ఈ సమయానికి ఇంగ్లాండ్ 177 పరుగుల పార్‌స్కోర్ కంటే చాలా ముందుంది. 295 పరుగుల బరిలోకి దిగిన భారత్, రెండో ఓవర్లోనే ఓపెనర్ బెన్ డాకిన్స్‌ను హెనిల్ పటేల్ ఔట్ చేయడంతో అద్భుతమైన ఆరంభాన్ని పొందింది. జోసెఫ్ మూర్స్, బెన్ మేయస్ రెండో వికెట్‌కు 77 పరుగులు జోడించి కోలుకున్నారు. ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ ఖిలాన్ పటేల్ ఇద్దరికీ బాటలు వేయడంతో, 19వ ఓవర్‌లో ఇంగ్లాండ్ 104 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. కానీ రెవ్ 6 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుకు స్కోరు పెంచాడు. కాలెబ్ ఫాల్కనర్(29) కూడా ఇంగ్లాండ్ భారత్ ఓటమిలో కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆయుష్ మాత్రే భారత్‌కు మంచి ఆరంభాన్ని అందించి టాప్ ఆర్డర్‌లో (49) రాణించాడు. వైభవ్ సూర్యవంశీ ఘోరంగా విఫలమై ఒక పరుగుకు ఔటయ్యాడు. విహాన్ మల్హోత్రా(10), వేదాంత్ త్రివేది(14) తేలిపోయారు. జేమ్స్ మింటో బౌలింగ్‌లో మాత్రే క్యాచ్ అవుట్ అయ్యే సమయానికి, భారత్ 4 వికెట్లకు 79 పరుగులు చేసి కష్టాల్లో పడింది. కానీ అభిజ్ఞాన్ కుండు 82 పరుగుల ఇన్నింగ్స్‌తో భారత్‌ను క్లిష్ట పరిస్థితి నుంచి బయటపడేశాడు. వికెట్ కీపర్‌బ్యాటర్ ఆర్‌ఎస్ అంబ్రిష్‌తో కలిసి ఐదవ వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. కనిష్క్ చౌహాన్ కేవలం(45) జట్టుకు విజయాన్ని అందించాడు, భారత్ ఎనిమిది వికెట్లకు 295 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో మింటో ఎనిమిది ఓవర్లలో 34 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టాడు.

ఆట



# ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్
### మెయిన్ డ్రాకు తన్వి

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత తన్వి శర్మ, మహిళల డబుల్స్ జాతీయ ఛాంపియన్‌లు అశ్విని భట్, కె శిఖా గౌతమ్, మన్నెపల్లి తరుణ్ బిడబ్ల్యూఎఫ్ ఇండియా ఓపెన్ 2026 ప్రధాన డ్రాకు ప్రమోట్ చేయబడ్డారు. ఈ టోర్నమెంట్ ముందు కొంతమంది అగ్రశ్రేణి క్రీడాకారులు వైదొలగడంతో ఈ అవకాశం లభించింది. ప్రపంచ ఛాంపియన్ మరియు పురుషుల సింగిల్స్ ప్రపంచ నంబర్ 1 చైనాకు చెందిన షి యుకి మలేషియా ఓపెన్ 2026 ఫైనల్‌లో కున్లావుట్ విటిడ్సర్న్‌తో తలపడాల్సి రావడంతో టోర్నమెంట్ నుంచి వైదొలిగాడు. అతని స్వదేశీయుడు వెంగ్ హాంగ్ యాంగ్ కూడా వైదొలిగాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో మలేషియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో పివి సింధు చేతిలో రిటైర్ అయిన మహిళల 3వ సీడ్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అకానె యమగుచి కూడా వైదొలిగింది. దీంతో తన్వి ఇండియా ఓపెన్‌లో అరంగేట్రం చేయడానికి మార్గం సుగమం చేసింది. తన్వి తొలి రౌండ్‌లో చైనాకు చెందిన రెండో సీడ్ వాంగ్ ఝీ యితో తలపడనుంది. అలాగే రిజర్వ్‌డ్ కేటగిరీ నుంచి తరుణ్ ఎంపిక కావడం వల్ల పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండు అఖిల భారత పోటీలు జరుగుతాయి. లక్ష్య సేన్, శెట్టి ఆయుష్ ఒకరితో ఒకరు తలపడనుండగా, తరుణ్ తొలి రౌండ్‌లో కిదాంబి శ్రీకాంత్‌తో తలపడనున్నాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని-సిఖా జోడీ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మార్గోట్ లాంబెర్ట్‌కామిల్లె పోగ్నాంటేతో తలపడనుంది.

# టి20లు ఆడకుండానే లక్కీ కెప్టెన్స్
## ఈ దిగ్గజాల రూటే వేరు

**న్యూఢిల్లీ:** సాధారణంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వంటి భారీ లీగ్‌లో ఒక జట్టుకు నాయకత్వం వహించాలంటే టీ20 ఫార్మాట్‌లో ఎంతో అనుభవం ఉండాలి. కానీ, ఐపీఎల్ చరిత్రలో కొందరు దిగ్గజాలు ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడిన అనుభవం లేకుండానే కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టారు. షేన్ వార్న్ నుంచి కరుణ్ నాయర్ వరకు ఐదుగురు ఆటగాళ్లు ఈ జాబితాలో ఉన్నారు.



ఆస్ట్రేలియా స్పిన్ మాంత్రికుడు షేన్ వార్న్ ఈ లిస్టులో టాప్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియా తరఫున ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడకుండానే, ఐపీఎల్ తొలి సీజన్ (2008)లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కెప్టెన్సీ చేశారు. అంతేకాదు అండర్ డాగ్స్‌గా ఉన్న ఆ జట్టును ఏకంగా ఛాంపియన్‌గా నిలబెట్టి తన నాయకత్వ పటిమను ప్రపంచానికి చాటారు. అలాగే టీమిండియా మాజీ సారథి దాదా సౌరవ్ గంగూలీకి టీ20 అంతర్జాతీయ అనుభవం సున్నా. అతడు భారత్ తరఫున కేవలం వన్డేలు, టెస్టులు మాత్రమే ఆడాడు. అయినప్పటికీ, ఐపీఎల్ ఆరంభ సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్, పూణే వారియర్స్ జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. లెగ్ స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే కూడా భారత్ తరఫున ఒక్క టీ20 కూడా ఆడలేదు. అయితే, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును అద్భుతంగా నడిపించాడు. 2009 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లిన ఘనత కుంబ్లేదే. ఇక క్లాసిక్ బ్యాటర్ వివిఎస్ లక్ష్మణ్ టీ20 ఫార్మాట్‌కు సెట్ కారనే విమర్శలు ఉన్నప్పటికీ, 2008లో డెక్కన్ ఛార్జర్స్ జట్టుకు ఆయన కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. లక్ష్మణ్ తన కెరీర్‌లో భారత్ తరఫున కేవలం టెస్టులు, వన్డేలు మాత్రమే ఆడాడు. ఒక్క టీ20 ఇంటర్నేషనల్‌లో కూడా ప్రాతినిధ్యం వహించలేదు. ఈ జాబితాలో అత్యంత ఆశ్చర్యకరమైన పేరు కరుణ్ నాయర్. మిగిలిన నలుగురు దిగ్గజాలు రిటైర్మెంట్ దశలో ఐపీఎల్ ఆడగా, కరుణ్ నాయర్ మాత్రం యువ ఆటగాడిగా ఉన్నప్పుడే ఈ అరుదైన ఫీట్ సాధించాడు. 2017లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అప్పటికి ఆయనకు టీ20 అంతర్జాతీయ అనుభవం లేదు.



## క్లాసిక్ ఓపెన్‌లో యూకీ బాంబ్రీ జోడీ తొలి విజయం

**న్యూఢిల్లీ:** కొత్త ఏడాదితో భారత్ డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ తొలి జోడీ తొలి విజయాన్ని అందుకుంది. న్యూజిలాండ్‌లో మొదలైన ఏఎస్‌బీ క్లాసిక్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-ఆండ్రీ గొరాన్‌సన్ (స్వీడన్) జోడీ శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ యూకీ-గొరాన్‌సన్ ద్వయం 8-3, 6-2తో అజీత్ రాయ్ (న్యూజిలాండ్)-జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 66 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-స్వీడిష్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తొలి సర్వీస్‌లో 32 పాయింట్లకు గాను 27 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 16 పాయింట్లకుగాను 8 పాయింట్లు స్కోరు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. కాగా యూకీ-గొరాన్‌సన్ ద్వయం బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీతో కొత్త సీజన్ ఆరంభించింది. ఆ టోర్నీలో తొలి రౌండ్‌లో బై పొంది నేరుగా రౌండ్ మ్యాచ్ ఆడిన ఈ జంట 5-7, 4-6తో ఒర్లాండో లుజ్-మటోస్ (బ్రెజిల్) ద్వయం చేతిలో చిత్తయింది.

## ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 3.7బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ, జనవరి 13:** భారత్‌ప్రైవేటు ఈక్విటీ కార్యకలాపాలు నాలుగోత్రైమాసికంలో పటిష్టం అయ్యాయి. పెట్టుబడులు 3.7 బిలియన్ డాలర్లకు చేరడంతో గత త్రైమాసికంకంటే 44.3శాతం వృద్ధినమోదు చేసినట్లు తేలింది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజి గ్రూప్(ఎల్‌ఎస్‌ఇజి) తన నివేదికలో మొత్తం నాలుగో త్రైమాసికంలో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 2024 నాలుగో త్రైమాసికం కంటే అత్యధికంగా ఉన్నట్లు వెల్లడించింది. పూర్తిసంవత్సరానికిగాను ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 23.7శాతంపెరిగాయి. అంటే 12.1 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు ఎల్లెస్‌ఈజీ తెలిపింది. అయితే పెట్టుబడులు పరంగా ఎంతో అప్రమత్తంగా జరిగినట్లు తేలింది. మొత్తంగాచూస్తే పెట్టుబడులు కొంత మందగమనంతో ఉన్నప్పటికీ టెక్నాలజీ ఆధారిత రంగాలు మాత్రం వృద్ధిలో ఉన్నట్లు తేలింది.కృత్రిమ మేధ, గ్రీన్‌పోర్టులు, క్విక్‌కామర్స్ రంగాల్లో ఈ పిఈ పెట్టుబడులు పెరుగుతున్నట్లు అంచనా వేసింది.

## ఎఐ ఆధారిత నియామకాలు: 3.8 లక్షలు అంచనా!

**బెంగళూరు, జనవరి 13:** కృత్రిమమేధ ఇపుడు నియామకాల్లో అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది భారత్ లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో కృత్రిమమేధ మెళకువలున్నవారికే ఎక్కువ సంఖ్య లభించింది. ఎఐ లింక్డ్ ఉద్యోగాలు గత ఏడాది 2,90,256 వరకూ జరిగినట్లు ఒకసర్వేలో తేలింది. ఎఐ నియామకాలు 32శాతం వార్షికపద్దతిలో వృద్ధి ఉంది. 2026లో సుమారు 3.8 లక్షలమందికి ఉద్యోగాలు రావచ్చని ఫౌండిట్ సర్వేలో తేలింది. భారత్ జాబ్ మార్కెట్ గత ఏడాదినుంచే కొత్త నమ్మ కాలను పంచుతోంది. సుస్థిర నియామకాలు, ఇంటర్వ్యూల్లో వృద్ధి వంటి వాటితో విభిన్నరంగాలు, వివిధ హోదాలు, నగరాల్లో కూడా మెరుగుపడుతున్నట్లు సర్వేలో తేలింది. నెలవారీగాచూస్తే ఐదుశాతం వృద్ధిఉంటే వార్షిక పద్దతిలో అయితే 15శాతం ఎఐ నియామకాలున్నట్లు ఫౌండిట్ సిఇఒ తరుణ్‌శర్మ వెల్లడించారు.

## ఆల్‌టైమ్ గరిష్టానికి ప్యాసింజర్ వాహనాల సేల్స్

**ముంబయి, జనవరి 13:** భారత్‌లో ఈ ఏడాది మూడోత్రైమాసికంలో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు భారీగా ఉన్నాయి. వినియోగరంగం నుంచి డిమాండ్ పెరగడంతో అమ్మకాలు మెరుగయినట్లు చెపుతున్నారు. దీనికి తోడు పండుగ సీజన్‌కూడా వారికి కలిసొచ్చింది. ఆటోమొబైల్ ఉత్పత్తిదారులసంఘం సియామ్ అంచనాలప్రకారం పివి దేశీయ విక్రయాలు 3వ త్రైమాసికంలో ఆల్‌టైమ్ గరిష్టానికి చేరి 12,76,073కి పెరిగాయి.20.6శాతం గత ఏడాది కంటే వృద్ధిని నమోదుచేసాయి. కేలండర్ సం వత్సరంలో కార్ల విక్రయాలు ప్రత్యేకించి ప్యాసింజర్ వాహనాల్లో పెరిగాయి. 44.90లక్షల వాహనాలు పంపిణీ అయినట్లుతేలింది.యుటిలిటీ వాహనాలు భారీగానే అమ్మ కాలు జరిగాయని చెపుతున్నారు.

# రికార్డు స్థాయి నుంచి దిగువకు సెన్సెక్స్, నిఫ్టీ
### ట్రేడింగ్‌లో డీలాపడ్డ మేజర్ కంపెనీలు





**ముంబయి, జనవరి 13:** ఇంట్రాడేలో అమ్మకాల జోరుపెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు దిగువస్థాయిలోనే ట్రేడింగ్‌ను ముగించాయి. రికార్డు గరిష్టంనుంచి బిఎస్‌ఇ సెన్సెక్స్ 995 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 50సూచీలో కూడా 296 పాయింట్లు దిగజారాయి. ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిళ్లే కనిపించాయి. ఇంట్రాడేలో ఒక దశలో నిఫ్టీ 25,899.80కి చేరినా తదనంతరం 25,750కి దిగజారింది. వినియోగరంగ ఉత్ప త్తులు, ఫార్మా రంగ స్టాక్స్ తీవ్రస్థాయిలో దెబ్బ తిన్నాయి. భారీ స్టాక్స్‌లో లాభాలస్వీకరణ ఎక్కువ కనిపించింది. ఇన్వెస్టర్లు లాభాలకే మొగ్గు చూపించారు. గ్లోబల్ ధోరణులు అనిశ్చితంగా కనిపించడం, ముడిచమురుధరలు పెరగడం కూడా ఒత్తిడికి కారణం అయింది. ద్రవ్యోల్బణం, కరెంటుఖాతాలోటు వంటివి కూడా మార్కెట్లపై ప్రభావం చూపించాయి. విదేశీ ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తే దేశీయ ఇన్వెస్టర్లు కొంతమేర మద్దతు పలికినట్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా క్షీణించాయి. దిగుమతి ఆధారిత రంగాలపై ఈ భారం పడింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 250.48 పాయింట్లు క్షీణించి 83,627 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50సూచీ 57.95 పాయింట్లు క్షీణించి 25,732.30 పా యింట్లవద్ద నిలిచిపోయింది. ట్రెంట్ 3.39శాతం, లార్సెన్ అండ్ టూబ్రో 3.25శాతం, రిలయన్స్ 2.14 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్‌ఇలో మిడ్ క్యాప్‌సూచీ 0.16 శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.46శాతం పెరిగింది. మార్కెట్లపరంగాచూస్తే బిఎస్‌ఇలో 2038 కంపెనీలు పెరిగాయి. 2099 షేర్లు దిగజారితే 201 కంపెనీలషేర్లు యధాతథంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 90.22గా మారింది. ఎంసిఎక్స్ పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదునాటి సెటిల్ మెంట్లు 0.32శాతం క్షీణించి రూ.1,41,580గా మారింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడి చమురు మార్చి సెటిల్ మెం ట్లకుగాను 1.05 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 64.92 డాలర్లుగా నడిచింది. ఇక షేర్లపరంగా టిసిఎస్ 0.99శాతం పెరిగింది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 0.19శాతం క్షీణించింది. ఎల్‌అండ్‌టి కూడా 3.25శాతం తగ్గింది. కల్పతరు 0.33శాతం, మహారాష్ట్ర స్కూటర్స్ 6.73శాతం చొప్పున పెరిగాయి. ఓమాక్సే కంపెనీ షేర్లు 12.63శాతంపెరిగితే లోటస్ చాక్లెట్ కంపెనీ 9.71శాతం క్షీణించింది. ఇక జిటిపిఎల్ హాత్‌వే 7.93శాతం, ఆనంద్‌రాఠి వెల్త్ 0.51శాతం, ఇండోథాయ్ సెక్యూరిటీస్ 2.11శాతం, పూర్వాంకారా షెడ్ 0.22శాతం చొప్పున క్షీణిం చాయి. అలాగే ఎబి ఇన్‌ఫ్రా బిల్డ్ 3.5శాతం, బిఆర్‌గోయల్ ఇన్‌ఫ్రా 1.72శాతం, ఒరియంటల్ హోటల్స్ 2.84శాతం చొప్పున పెరిగాయి.





# స్వల్పంగా తగ్గిన పసిడి, వెండి

**ముంబయి, జనవరి 13:** రికార్డు స్థాయిలకు చేరిన బంగారం, వెండి ధరలు మంగళవారం స్వల్పంగా తగ్గాయి. ఇన్వెస్టర్లు భారీ లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో మధ్యాహ్నాం 1:15 గంటల సమయంలో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ 0.44 శాతం తగ్గి 10 గ్రాములకు రూ. 1,41,400 వద్ద ట్రేడ్ అయింది. మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ దాదాపు యథాతథంగా ఉంటూ కిలోకు రూ.2,68,926 వద్ద నిలిచింది. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ ఐబిజెఎ అంచనాల ప్రకారం, 24 క్యారెట్ల బంగారం ధర సోమవారంతో పోలిస్తే స్వల్పంగా తగ్గి 10 గ్రాములకు రూ.1,40,482గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ బంగారం ధర చరిత్రలో తొలిసారిగా 4,600 డాలర్ల మార్కును దాటింది. దీంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్‌పై న్యాయ శాఖ చర్యలు తీసుకోవచ్చన్న ఆందోళనలు, ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం వంటి అంతర్జాతీయ పరిణామాలు పసిడి ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఫెడ్ చైర్ జెరోమ్ పావెల్‌పై జరుగుతున్న క్రిమినల్ విచారణపై మార్కెట్లు దృష్టి సారించాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి అన్నారు. అమెరికాలో బలహీనంగా ఉన్న ఉద్యోగాల గణాంకాల నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్‌లో రాజకీయ అస్థిరత వంటి అంశాలు కూడా బంగారం ధరలకు మద్దతునిస్తున్నాయి. బంగా రానికి రూ.1,39,550 వద్ద మద్దతు, రూ.1,44,350 వద్ద నిరోధం ఉంది. ఇక వెండికి రూ.2,60,810 వద్ద మద్దతు, రూ.2,71,810 వద్ద నిరోధం కనిపిస్తోంది. పారిశ్రామిక, గ్రీన్ ఎనర్జీ రంగాల నుంచి డిమాండ్ పెరుగుతున్నందున, 2026 నాటికి వెండి ధర ఔన్సుకు 100 డాలర్లకు పైగా చేరవ చ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## 10 నిమిషాల డెలివరీ క్లెయిమ్ రద్దు చేయండి
### క్విక్ కామర్స్ సంస్థలకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 13:** క్విక్‌కామర్స్ సంస్థలు ఇకపై పదినిమిషాల డెలివరీ క్లెయిమ్స్ నిలిపి వేయాలని గిగ్‌వర్కర్ల భద్రతకు ఈచర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కేంద్రం మంగళవారం క్విక్‌కామర్స్ సంస్థలకు ఆదేశాలు జారీచేసింది. దీనితో ఇపుడు బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ వంటి సంస్థలు 10 మినిట్ డెలివరీ క్లెయిమ్‌లు నిలిపివేసుకోవాల్సి వస్తోంది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ క్విక్‌కామర్స్ కంపె నీలతో వరుసవెంబడి సమావేశాలు నిర్వహించి ఇలాంటి అల్ట్రా ఫాస్ట్ డెలివరీ వ్యవస్థలను నిలిపివేయాలని కోరారు. మేజర్ సంస్థలన్నీ కూడా ఈ పదినిమిషాల డెలివరీ వ్యవస్థలను నిలిపివేయడానికి అంగీకరించాయి. ఇదే వ్యవస్థపై ఢిల్లీ ఎంపి రాఘవ్‌చడ్డా స్పందించారు. కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతో సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. క్విక్‌కామర్స్ ప్లాట్ ఫామ్స్ 10 మినిట్స్ అన్న పదాలను రైడర్‌ల టీషర్టులు, జాకెట్లు, లేదా బ్యాగ్‌లపైనా ముద్రిం చాయని అలాగే కస్టమర్స్ స్క్రీన్‌పై ఒక టైమర్‌నున కూడా ముద్రించారని, దీన్నిబట్టి చూస్తే గిగ్‌వర్కర్లు ఎంత ఒత్తిడికి లోనవు తున్నారో తెలుస్తోందని అన్నారు. కేంద్రం స్పందించి ఈ క్లెయిమ్ రద్దు చేయడంపై ఆయన హర్షం ప్రకటించారు. వందలాదిమందితో తాను మాట్లాడానని, వారికి భద్రత లేదని, సరైన చెల్లింపులు కూడా రావడంలేదని చెప్పారన్నారు. ఎంతో ప్రమాదకరమైన వృత్తిలో ఉన్నా వారికి భద్రత లేదని అన్నారు. ఇటీవలే గిగ్‌వర్కర్లు సరైన చెల్లింపులు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరుతూ సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. క్విక్ కామర్స్ వ్యవస్థల్లో గిగ్‌వర్కర్ల దోపిడీ జరుగు తుందన్న వార్తలను ఈసందర్భంగా స్విగ్గీ జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపీందర్‌గోయల్ తిరస్కరించారు. అంతకుముందు కేంద్రం గిగ్‌వర్కర్ల కోసం నిబంధనలు జారీచేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: NoJ/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.